సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పెట్రో ధరలు పెరిగితే అన్నీ కష్టాలే
సిబిఎస్ఇలో మూడు భాషల విధానం అమలు
శత్రువు రాడార్‌కు చిక్కని 'తారాగిరి' 05

సంపుటి 09, సంచిక: 124 | శనివారం | 04-04-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఆధిపత్యం కోసం అమెరికా

## యుద్ధాలు, సుంకాలు

అమెరికా అధ్యక్షుడిగా రెండవ పదవీ కాలం చేబట్టిన డోనాల్డ్ ట్రంప్ తమ 14 మాసాల అధికా రం కాలంలో అమెరికన్ మిలటరీ కార్యకలాపాలను ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు నాటకీయంగా విస్తరించాడు. ఈ తక్కువకాలంలో అమెరికా సైన్యం కనీసం 7 దేశాల్లో –సోమాలియా, ఇరాక్, ఎమెన్, సిరియా, నైజీరియా, వెనిజులా సహా దాడులు నిర్వహించింది.

**సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాసం 6లో**

2047 నాటికి తెలంగాణ

# టెక్స్‌టైల్ రాజధాని

- దక్షిణాసియాలోనే గొప్పగా తీర్చిదిద్దుతాం
- వస్త్ర పరిశ్రమ రంగం రాష్ట్ర ప్రజల డిఎన్ఎలోనే ఉంది
- ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిలో భాగస్వాములు కండి
- పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సులో 2026 నివేదిక విడుదల
- మంత్రులతో కలిసి టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్ సందర్శించిన రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

వస్త్ర పరిశ్రమ రంగంలో 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని దక్షిణాసియాలోనే గొప్ప టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్‌కు అనుగుణంగా ప్రపంచాన్ని మార్చగల వాతావరణాన్ని సృష్టించడంలో ప్రభుత్వంతో భాగస్వామ్యం కావాలని పారిశ్రామిక వేత్తలకు సిఎం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సిఐటిఐ)తో కలిసి 13వ ఏషియా టెక్స్‌టైల్ సదస్సు (అటెక్స్‌కాన్–2026)ను హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి అటెక్స్‌కాన్–2026 నివేదికను విడుదల చేశారు. సదస్సులో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర రావు, అధికారులు, జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ ఎగ్జిబిషన్‌ను మంత్రులతో కలిసి సిఎం సందర్శించారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిజాం కాలంలో ప్రపంచ నలుమూలల నుంచి వ్యాపారులు హైదరాబాద్ నగరానికి వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేశారని, తెలంగాణ రాష్ట్రం ఈ విషయాన్ని గర్వంగా చెప్పగలదని, తరువాయి 2లో

## త్వరలో కొత్త డిజిపి

ప్రజాపక్షం/హైదరాబాద్

సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా డిజిపి పదవికి అర్హులైన సీనియర్ ఐపిఎస్ అధికారుల పేర్లను యుపిపిఎస్‌సి పంపామని, అక్కడి నుంచి పేర్ల లిస్ట్ రాష్ట్రానికి అందిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు చెప్పారు. రెండు వారాల్లోగా రాష్ట్రం డిజిపి నియామకం చేయనుందని తెలిపారు. యుపీఎస్సీ ప్యానెల్ సిద్ధం చేసి మార్చి 12న పంపిందని వివరించారు. డిజిపిగా శివధర్ రెడ్డి నియామకం సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా జరిగిందని హైదరాబాద్‌కు చెందిన ధనగోపాలరావు వేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయసేన్‌రెడ్డి విచారించారు. ప్రకాష్‌సింగ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయలేదని పిటిషనర్ వాదించారు. ఎజి గడువు కోరడంతో విచారణను ఈనెల 13కు వాయిదా పడింది.

## గ్రూప్–1 ఆశావహులకు సుప్రీం తీర్పు గొప్ప ఊరట

ఉద్యోగ నియామకాల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి గుర్తింపు : సిఎం

తెలంగాణ గ్రూప్1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ఇది ఉద్యోగ నియామకాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొలువుల కోసం ఏళ్లకు ఏళ్లు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ 1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అని సిఎం అన్నారు. ఈ మేరకు సిఎం శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఒక ట్విట్ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసి, ఈ నియామకాలను తరువాయి 2లో

క్వాక్ ఏరీనా పబ్‌లో

## ఈగల్ టీం సోదాలు

ఐఎఎస్ కుమారుడితో పాటు మరో 7 మందికి డ్రగ్ పాజిటివ్

64 మందికి డ్రగ్స్ టెస్టులు

ప్రజాపక్షం/హైదరాబాద్



డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ మరోసారి కఠిన చర్యలు చేపట్టింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌లో ఉన్న క్వాక్ ఏరీనా పబ్‌పై అర్ధరాత్రి సమయంలో నిర్వహించిన ఆకస్మిక దాడిలో 8 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏప్రిల్ 2వ తేదీ మధ్యరాత్రి ఈగల్ ఫోర్స్, సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులతో కలిసి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఆ పబ్‌లో అంతర్జాతీయ డీజే బ్లాక్ కాఫీ ప్రదర్శనతో ప్రత్యేక పార్టీ జరుగుతుండగా, ముందస్తు నిఘా ఆధారంగా 64 మంది అనుమానితులను గుర్తించి డ్రగ్స్ టెస్టులు చేశారు. ఎబాన్ యూరిన్ టెస్ట్ కిట్లతో చేసిన పరీక్షల్లో గంజాయి (టిహెచ్‌సి), బెంజోడియాజిపైన్, మెతాంఫెటమైన్ వాడినట్లు 8 మంది వద్ద నిర్ధారణ అయ్యింది. పట్టుబడిన వారిలో మోనిష్ ఉమేష్, పృథ్వీరాజ్, అభిషేక్, రిషబ్, హరిత్, రితేష్, జ్యోతిరాదిత్యతో పాటు హరిత్ అనే వ్యక్తి ఐఎఎస్ అధికారి కుమారుడిగా గుర్తించినట్లు సమాచారం. పట్టుబడిన వారు డ్రగ్స్ వినియోగాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని గచ్చిబౌలి తరువాయి 12లో

వరంగల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో

## ఎసిబి దాడులు

భారీగా నగదు, బంగారం స్వాధీనం

తనిఖీ సమయంలో కార్యాలయంలో 20 మంది అనధికార ఎజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించిన అధికారులు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్



వరంగల్ (ఆర్.ఓ) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహించిన ఈ దాడుల్లో పలువురు అనధికార వ్యక్తులు, భారీగా నగదు లావాదేవీలు వెలుగుచూశాయి. తనిఖీల సమయంలో కార్యాలయంలో 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి లెక్కల్లో చూపని రూ.47,450 నగదు, 70 రిజిష్టర్ కాని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.మొబైల్ ఫోన్‌ల పరిశీలనలో సబ్‌రిజిస్ట్రార్ అధికారులు, డాక్యుమెంట్ రైటర్ల మధ్య ఫోన్‌పే ద్వారా సుమారు రూ.42,03,125 మేర లావాదేవీలు జరిగినట్లు తరువాయి 12లో

## అసెంబ్లీ టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోండి



లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ లేఖ

లేదంటే అవినీతికి వ్యతిరేకంగా నిలబడతామన్న వాదనను విరమించుకోండని హితవు

**న్యూఢిల్లీ :** కేరళలో ఎల్‌డిఎఫ్‌పై విమర్శలు గుప్పించడం కాకుండా అసెంబ్లీ టికెట్లు అమ్ముకుని అవినీతికి పాల్పడ్డ కాంగ్రెస్‌పార్టీ నేతలపై చర్యలు తీసుకోండి అని సిపిఐ కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీకి హితవుపలికింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు 'టికెట్ల కోసం నగదు లావాదేవీల కంభకోణానికి' పాల్పడ్డారని రాజ్యసభ సీనియర్ నాయకుడు ఎంపి పి.సందోష్ కుమార్ ఆరోపించారు. కేరళలో కొండచరియల సహాయక చర్యల కోసం పార్టీ సేకరించిన నిధులపై పారదర్శకత కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి రాజ్యసభ ఎంపి పి.సందోష్‌కుమార్ శుక్రవారం ఒక లేఖ రాశారు. రాహుల్‌కు రాసిన తన లేఖలో సందోష్ కుమార్ కేరళలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)కు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ 'దురుద్దేశక ప్రచారం' చేస్తున్నారని ఆరోపించారు. అయితే తరువాయి 2లో

మాజీ మావోయిస్టులు...

# బూర్జువా పార్టీల్లో చేరొద్దు

పార్లమెంటు సాక్షిగా అమిత్ షా పచ్చి అబద్ధాలు

లొంగిపోయిన మావోయిస్టులపై ప్రభుత్వ నిర్బంధం

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ



ప్రజాపక్షం/హనుమకొండ

భారత దేశానికి నష్టం కలిగిస్తున్న అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని నరేంద్రమోదీ మౌనం వీడాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ కాంక్షతో అనేక దేశాలు ప్రభావితం అవుతున్నాయని, ఇంధన సరఫరాలో ఇక్కట్లతో పాటు భారతదేశంలోని రైతుల ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బియ్యం తరువాయి 2లో

# అనర్హులకూ చోటు

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో స్థలం

ఇందిరమ్మ ఇళ్లూ మంజూరు

ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు

ప్రజాపక్షం/ ఖమ్మం



వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్దిదారుల జాబితాలో అనేక మంది అనర్హులకు చోటు దక్కిందని కనీసం భూదాన్ భూములను చూడని వారిని కూడా లబ్దిదారుల జాబితాలో చేర్చి ఎంచక్కా స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార యంత్రాంగం వెలుగుమట్ల వినోబానగర్ కాలనీకి సంబంధించి బాధితుల వివరాలను సేకరించి వారి పూర్వాపరాలను పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేసినప్పుడు ఈ అనర్హులకు లబ్దిదారుల జాబితాలో చోటు ఎట్ల దక్కిందన్న ప్రశ్నకు సమాధానం లేదు. అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనర్హులకు సంబంధించి ఆరోపణలు వచ్చినప్పుడు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం మేము ఇచ్చిందే జాబితా మేము చెప్పిన వారే లబ్దిదారులు అన్నట్లుగా వ్యవహరించడం సరికాదన్న వాదనలు వినపడుతున్నాయి. ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో గడిచిన పదేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని తరువాయి 2లో

బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో

## రాజకీయలబ్ధి కోసమే..

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ధ్వజం

ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఘోరంగా ఉల్లంఘించడమేనని విమర్శలదాడి



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణిపై కాంగ్రెస్ పార్టీ నిప్పులు చెరిగింది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలలో రాజకీయ లబ్ధి పొందడం కోసం మహిళా కోటా చట్ట సవరణ, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను ఆమోదించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని పిలిచిందని, ఇది ఎన్నికల ప్రవర్తనా నిమమావళి (ఎంసిసి)ని ఘోరంగా ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ ఆరోపించింది.ప్రభుత్వండీలిమిటేషన్ కసరత్తును ముందుకు నెట్టడం తరువాయి 12లో

## అమెరికా యుద్ధ విమానం కూల్చివేత

తమ గగనతలంలో వచ్చిన ఎఫ్–35ను రక్షణ వ్యవస్థ కూల్చివేసిందని ప్రకటించిన ఇరాన్



**దుబాయ్ :** అమెరికాకు చెందిన మరొక ఐదోతరం ఎఫ్35 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) వెల్లడించింది. సెంట్రల్ ఇరాన్ గగనతలం మీదుగా శుక్రవారం నాడు పయనిస్తున్న ఎఫ్35 యుద్ధ విమానాన్ని గగనతల రక్షణ వ్యవస్థతో కూల్చినట్లు తెలిపింది. విమానం నడుపుతున్న పైలట్ల కోసం అన్వేషణ సాగుతున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించినట్లు 'రాయిటర్స్' వార్తా సంస్థ కథనం పేర్కొంది. తమ ఇంటర్‌సెప్టర్ మిస్సైల్ తాకగానే అమెరికా యుద్ధ విమానం ఎఫ్35 భారీ పేలుడుతో కూలిపోయే స్థితికి చేరిందని, అందులోని పైలట్ బతికి బయటపడటం కష్టమేనని ఇరాన్ సైన్యం ప్రధాన కార్యాలయం ఖతం అల్ అంబియా అధికార ప్రతినిధి తెలిపారు. ఐఆర్‌జిసి ఏరోస్పేస్ దళానికి చెందిన సరికొత్త గగనతల రక్షణ వ్యవస్థ ఈ ఎటాక్ చేసిందన్నారు. ఈమేరకు వివరాలతో ఇరాన్ ప్రభుత్వ టీవీ ఛానల్ శుక్రవారం రోజు ఓ వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అంతకుముందు, మార్చి 19న ఇరాన్ దాడిలో ఒక ఎఫ్35 యుద్ధ విమానం దెబ్బతిన్నట్లు కథనాలు వచ్చాయి. కాగా..

ఇరాన్ మధ్యప్రాచ్యంలోని పలు ప్రాంతాలపై దాడులు జరిపింది. ఈ దాడుల్లో, కువైట్‌లోని ఒక ఆయిల్ రిఫైనరీలో అనేక అగ్ని ప్రమాదాలు చెలరేగాయి. ఇదే సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు శుక్రవారం ఇస్లామిక్ రిపబ్లిక్‌పై కొనసాగాయి. ఇరు వర్గాలు దాడులను కొనసాగిస్తున్న నేపథ్యంలో, యుద్ధం ఐదో వారానికి చేరుకున్నప్పటికీ ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. పిటిఐ కథనం ప్రకారం, హోర్ముజ్ జలసంధిపై టెహ్రాన్ నియంత్రణ గురించి చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశం కావడానికి సిద్ధమవుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ సైనిక సామర్థ్యం దాదాపు పూర్తిగా తరువాయి 2లో

## టిఆర్‌ఎస్ పేరు ఖాళీగా ఉంది

దానిని ఎవరైనా వాడుకోవచ్చు

నిద్రావస్థలో బిఆర్‌ఎస్

పార్టీ ఆవిర్భావ వేడుకలో ఎజెండా ప్రకటిస్తా

కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) పేరు ఖాళీగానే ఉన్నదని, ఈ పేరును ఎవరైనా వాడుకో వచ్చని, ప్రస్తుతం బిఆర్‌ఎస్ నిద్రావస్థలో ఉన్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గతంలో మహారాష్ట్ర, బీహార్‌కు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే, అక్కడ కాంగ్రెస్ ఓడిపోయిందని, ఇప్పుడు కేరళ రాష్ట్రంలో తరువాయి 12లో

## అటార్నీ జనరల్ బోండీపై ట్రంప్ వేటు



**వాషింగ్టన్:** పామ్ బోండీని అటార్నీ జనరల్ పదవి నుంచి తప్పిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత ఏడాది నుంచి కొనసాగిన ఆమె పదవీకాలం వివాదాస్పదంగా నిలిచింది. న్యాయశాఖ స్వతంత్రతను దెబ్బతీసిందని విమర్శలు వచ్చాయి. పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించడం, ట్రంప్ ప్రత్యర్థులపై దర్యాప్తులు ప్రారంభించడం వంటి చర్యలు ఆందోళనకు కారణమయ్యాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైళ్ల నిర్వహణపై విమర్శలు, ట్రంప్ కోరినట్లుగా ప్రత్యర్థులపై కేసులు నమోదు చేయడంలో విఫలం కావడం వంటి అంశాలు ఈ నిర్ణయానికి దారితీశాయి. ట్రంప్ తన ప్రకటనలో బోండీని దేశభక్తురాలు, విశ్వాసపాత్ర మిత్రురాలుగా ప్రశంసిస్తూ, ఆమె ప్రైవేట్ రంగంలో కొత్త బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాత్కాలిక అటార్నీ జనరల్‌గా డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్‌ను నియమించారు. కాగా, బోండీ తన ప్రకటనలో ఈ పదవిని జీవితంలో గొప్ప గౌరవంగా పేర్కొని, బాధ్యతల బదిలీ కోసం ఒక నెల పాటు సహకరిస్తానన్నారు. బోండీ తన పదవీకాలంలో న్యాయశాఖను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించిందని విమర్శలు ఎదుర్కొంది. అయితే ఆమె ఈ ఆరోపణలను ఖండిస్తూ, గత పరిపాలనలో జరిగిన అతివ్యాప్తిని సరిచేయడమే తన లక్ష్యమని తెలిపింది. ఆమె హయాంలో వేలాది ఉద్యోగులు పదవులు వదిలివెళ్లడం, న్యాయవ్యవస్థపై రాజకీయ ప్రభావం పెరిగిందన్న అభిప్రాయం బలపడింది.

# హోర్ముజ్ జలసంధిపై భద్రతా మండలిలో నేడు ఓటింగ్?

**న్యూయార్క్:** హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి దేశాలకు బలప్రయోగానికి అనుమతి ఇవ్వాలన్న అంశంపై చైనా, రష్యా వ్యతిరేకత వ్యక్తం చేయడంతో బహ్రెయిన్ ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సవరించాల్సి వచ్చింది. ఈ కీలక సముద్ర మార్గాన్ని ఇరాన్ యుద్ధ సమయంలో పెద్దమొత్తంలో నిలిపివేయడంతో గ్లోబల్ నౌకాయానంపై ప్రభావం పడింది.
అసోసియేటెడ్ ప్రెస్ కథనాన్ని అనుసరించి, జలసంధిని పూర్తిగా తెరిపించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని బహ్రెయిన్ ప్రతిపాదించింది. అయితే, 'అన్ని రకాల చర్యలు' అనే వాక్యంలో సైనిక చర్య కూడా ఉంటుందని భద్రతా మండలిలో వీటో హక్కుగల చైనా, రష్యా, ఫ్రాన్స్ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీనితో ఐక్యరాజ్య సమితి ఈ ప్రతిపాదనను సవరించింది. మారిన ప్రతిపాదనను అనుసరించి, ఐక్యరాజ్య సమితి చేయబోయే తీర్మానం రక్షణాత్మక చర్యలకు మాత్రమే అనుమతి ఇస్తుంది. దాడి చర్యలకు కాదు. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ఈ జలసంధి ద్వారా వెళ్తుంది. ఇరాన్ నియంత్రణ కారణంగా ఇంధన ధరలు భారీగా పెరిగాయి. కాగా, మొదట ఈ తీర్మానంపై భద్రతా మండలిలో ఓటింగ్ శుక్రవారం జరగాల్సి ఉండగా, అది గుడ్ ఫ్రైడే సెలవు కారణంగా వాయిదా పడింది. ఇప్పుడు శనివారం ఓటింగ్ జరగవచ్చని సమాచారం. కొత్త ప్రతిపాదన ప్రకారం, హోర్ముజ్ జలసంధి, పరిసర జలాల్లో నౌకాయానాన్ని రక్షించేందుకు పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన రక్షణ చర్యలు ఆయా దేశాలు తీసుకోవచ్చు. ఈ అనుమతి కనీసం ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది. దేశాలు ఒంటరిగా లేదా బహుళ దేశ నౌకాదళ భాగస్వామ్యాల ద్వారా ఈ చర్యలు చేపట్టవచ్చు, అయితే, ముందుగా భద్రతా మండలికి సమాచారం ఇవ్వాలి. ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై రెండు నుంచి మూడు వారాల పాటు తీవ్ర దాడులు కొనసాగిస్తాయని ప్రకటించారు. యుద్ధానికి స్పష్టమైన ముగింపు సమయం చెప్పలేదు. ఇరాన్ ప్రతిదాడులు కొనసాగిస్తూ, హోర్ముజ్ జలసంధిపై నియంత్రణ కొనసాగించడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతోంది. రష్యా రాయబారి వాసిలీ నెబెన్జియా ఈ ప్రతిపాదన సమస్యను పరిష్కరించదని పేర్కొంటూ, యుద్ధం ముగియడమే అసలు పరిష్కారం అని అన్నారు. చైనా రాయబారి ఫు కాంగ్ బలప్రయోగానికి అనుమతిని అన్యాయమైనదని, విచక్షణలేనిదని విమర్శించారు. ఇది పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మారుస్తుందని హెచ్చరించారు. ఫ్రాన్స్ రాయబారి



జెరోమ్ బోన్నాఫాంట్ కూడా ఉద్రిక్తత తగ్గించే చర్యలను ప్రోత్సహించాలని సూచించారు. మార్చి 11న భద్రతా మండలి బహ్రెయిన్ ప్రతిపాదించిన మరో తీర్మానాన్ని ఆమోదించింది. ఇందులో గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఖండిస్తూ, వెంటనే ఆపాలని కోరింది. అలాగే హోర్ముజ్ జలసంధిలో నౌకాయానాన్ని అడ్డుకోవడం అంతర్జాతీయ శాంతి, భద్రతకు ముప్పుగా పేర్కొంది.
యుద్ధానికి ముందు హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణా స్వేచ్ఛగా సాగేది. అయితే ఇప్పుడు దాన్ని మళ్లీ తెరవడం వాషింగ్టన్ బాధ్యత కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మార్గంపై ఎక్కువగా ఆధారపడే దేశాలే ముందుకు వచ్చి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బహ్రెయిన్ ప్రతిపాదించిన తీర్మానంపై శనివారం భద్రతా మండలి ఓటింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఈ తీర్మానం నౌకలు సురక్షితంగా ప్రయాణించేందుకు రక్షణ చర్యలకు అనుమతి ఇవ్వాలని ఉద్దేశించింది. ప్రారంభ ప్రతిపాదనలో అవసరమైన అన్ని మార్గాలు వినియోగించుకోవచ్చు అని పేర్కొనగా, రష్యా, చైనా, ఫ్రాన్స్ దేశాలు దీనికి వ్యతిరేకత వ్యక్తం చేశాయి.

## మైన్మార్ అధ్యక్షుడిగా సైనిక ప్రధాని ఎన్నిక



**బ్యాంకాక్:** మిన్ ఆంగ్ హ్లైంగ్ నేతృత్వంలోని సైన్యం ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని 2021లో గద్దె దించి అధికారం చేపట్టిన తరువాత, గత ఐదేళ్లుగా దేశంపై కఠిన నియంత్రణ కొనసాగించింది. అదే నాయకుడిని శుక్రవారం మైన్మార్ పార్లమెంట్ దేశ కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఈ పరిణామం ఎన్నికల ఆధారిత ప్రభుత్వ ఏర్పాటుగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి సైన్యం ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు చేపట్టిన చర్యగా పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇటీవల సైన్యం నిర్వహించిన ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరగలేదని ప్రతిపక్షాలు, స్వతంత్ర పరిశీలకులు విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో దేశంలో అంతర్గత యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రభుత్వానికి మార్పు అనేది దక్షిణాసియా దేశాలతో క్షీణించిన సంబంధాలను మెరుగుపరచడానికి కూడా ఒక ప్రయత్నంగా చెప్తున్నారు. చైనా, రష్యా వంటి దేశాలు సైనిక పాలనకు మద్దతు తెలుపగా, పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించాయి. మిన్ ఆంగ్ హ్లైంగ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు ఉన్నప్పటికీ, సైన్యానికి అనుకూల పార్టీలకు, సైన్యం నియమించిన సభ్యులకు పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో అతని విజయం ముందే ఖాయం అయింది. రాజధాని నేపీటా లో ఇటీవల భూకంపంతో దెబ్బతిన్న పార్లమెంట్ భవనంలో ఈ ఓటింగ్ జరిగింది. మొత్తం 584 ఓట్లలో 429 ఓట్లు అతనికి లభించాయి. రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన వారు ఉపాధ్యక్షులుగా నియమితులవుతారు. మాజీ సైనిక అధికారి న్యో సావ్, కరెన్ జాతికి చెందిన నాన్ నీ నీ ఆయే ఉపాధ్యక్షులుగా ఎంపికయ్యారు. వీరిలో నాన్ నీ నీ ఆయే దేశ తొలి మహిళా ఉపాధ్యక్షురాలు. ముగ్గురూ వచ్చే వారం పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. అధ్యక్ష పదవి స్వీకరించడానికి ముందు మిన్ ఆంగ్ హ్లైంగ్ తన సైన్యాధిపతి పదవికి రాజీనామా చేశారు. మైన్మార్ రాజ్యాంగం ప్రకారం ఒకే సమయంలో ఆ రెండు పదవులు నిర్వహించడానికి వీల్లేదు. కాగా, అతని స్థానంలో జనరల్ యే విన్ ఊ నియమితుడయ్యారు. మైన్మార్ 1962 నుండి 2016 వరకు సైనిక పాలనలో ఉండగా, తరువాత ఆంగ్ సాన్ సూకీ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించింది. 2020లో కూడా భారీ మెజారిటీతో గెలిచినా, 2021లో సైన్యం తిరిగి అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. సూకీ ప్రస్తుతం రాజకీయ ప్రేరణతో ఉన్న కేసుల్లో 27 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తోంది.

## కొన్ని పేటెంట్ ఔషధాలపై 100 శాతం టారిఫ్

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా నిర్ణయం

**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, రాబోయే నెలల్లో ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకోని ఔషధ కంపెనీలపై పేటెంట్ మందులకు గరిష్ఠంగా 100 శాతం టారిఫ్ విధించే అవకాశం ఉంది. మోస్ట్ ఫేవర్డ్ నేషన్ ధర ఒప్పందం కుదుర్చుకుని, అమెరికాలోనే ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న కంపెనీలకు టారిఫ్ మినహాయింపు ఉంటుంది. అలాంటి ప్రాజెక్టులు ప్రారంభించినప్పటికీ ధర ఒప్పందం లేని సంస్థలపై 20 శాతం టారిఫ్ ఉంటుంది. ఇది నాలుగు సంవత్సరాల్లో 100 శాతానికి పెరుగుతుంది. పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతరులకు 180 రోజుల గడువు ఇచ్చి, ఆ తరువాత ఈ టారిఫ్ అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే 17 ధర ఒప్పందాలు కుదిరినట్లు, అందులో 13 సంస్థలు సంతకం చేసినట్లు సమాచారం. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఔషధ దిగుమతులను నియంత్రించేందుకు ఈ చర్యలు అవసరమని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం 'లిబరేషన్ డే' మొదటి వార్షికోత్సవం సందర్భంగా వచ్చింది. ఆ రోజున ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా దిగుమతులపై భారీ పన్నులు ప్రకటించగా, తరువాత వాటిని సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. కాగా, తాజా టారిఫ్‌లపై





ఔషధ పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. అధునాతన మందులపై పన్నులు ఖర్చులను పెంచి, పెట్టుబడులకు ముప్పు కలిగిస్తాయని పరిశ్రమ ప్రతినిధులు హెచ్చరించారు. గత ఏడాది నుంచి ట్రంప్ ప్రభుత్వం పిఫైజర్, ఎలి లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ వంటి సంస్థలతో తక్కువ ధరల ఒప్పందాలు కుదుర్చుకుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న యూరోపియన్ యూనియన్, జపాన్, కొరియా, స్విట్జర్లాండ దే శాల మందులపై 15 శాతం టారిఫ్, యుకెకు 10 శాతం టారిఫ్ విధిస్తారు. భవిష్యత్ ఒప్పందాల ప్రకారం యుకె టారిఫ్ 'సున్నా'కు చేరే అవకాశం ఉంది. కాగా, లోహాలపై టారిఫ్‌లలో కూడా ట్రంప్ మార్పులు ప్రకటించారు. స్టీల్, అల్యూమినియం, కాపర్ దిగుమతులపై 50 శాతం టారిఫ్ కొనసాగుతుంది. సోమవారం నుంచి ఈ పన్నులు వస్తువుల మొత్తం కస్టమ్స్ విలువ ఆధారంగా లెక్కిస్తారు. లోహాల భాగం 15 శాతం కంటే తక్కువగా ఉన్న వస్తువులకు దేశానుసార టారిఫ్‌లు మాత్రమే వర్తిస్తాయి. అధికంగా లోహం ఉన్న ఉత్పత్తులకు 25 శాతం టారిఫ్ విధిస్తారు. 1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ చట్టంలోని సెక్షన్ 232 ఆధారంగా ఈ పన్నులు విధించారు. సుప్రీంకోర్టు మరో చట్టం కింద విధించిన పన్నులను రద్దు చేసినప్పటికీ, ట్రంప్ ఇంకా దిగుమతులపై పన్నులు విధించే ఇతర మార్గాలను ఉపయోగిస్తున్నారు. మొత్తం దిగుమతులపై 10 శాతం తాత్కాలిక టారిఫ్ కూడా అమల్లో ఉంది. ఈ చర్యలు వాణిజ్య లోటును తగ్గించి, తయారీ రంగాన్ని అమెరికాకు తిరిగి తీసుకురావడమే లక్ష్యమని ట్రంప్ పేర్కొన్నారు.

## దక్షిణ కొరియా, ఫ్రాన్స్ చర్చలు

**సియోల్:** హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ మధ్య సియోల్‌లో జరిగిన సమావేశంలో ఈ జలసంధి భద్రతపై సహకారం కొనసాగించాలని నిర్ణయించారు. అయితే స్పష్టమైన ప్రణాళికను వెల్లడించలేదు. అంతకు ముందు మాక్రాన్ సైనిక చర్యల ద్వారా జలసంధిని తిరిగి తెరిపించడం అనుకున్నంత సులభం కాదని పేర్కొన్నారు. అలాంటి చర్యలు ఎక్కువ సమయం తీసుకుంటాయని, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నుంచి తీరప్రాంత ముప్పు ఉండవచ్చని హెచ్చరించారు. చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఇలావుంటే, అమెరికా వేలాది మెరైన్లు, పారాట్రూపర్లను ఈ ప్రాంతానికి పంపింది. అయితే ఇరాన్ ప్రధాన చమురు టెర్మినల్ అయిన ఖార్గ్ దీవి లేదా జలసంధి పరిసర ప్రాంతాలను ఆక్రమించేందుకు భూమి దాడి చేసే ప్రయత్నం పెద్ద ప్రమాదాన్ని కలిగిస్తుందని మాజీ సిఐఎ డైరెక్టర్ బిల్ బరన్స్ పేర్కొన్నారు.

## గొప్ప ఊరట (మొదటి పేజీ తరువాయి)

అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని, వారికి మరో సారి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టిజిపిఎస్‌సి వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టిజిపిఎస్‌సి చైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

## చర్యలు తీసుకోండి
(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ తన సొంత పార్టీ శ్రేణులలోని ఆరోపణలపై ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా వామపక్షాలు వాటి సమగ్రతకు, సూత్రబద్ధమైన ప్రజాజీవితానికి గుర్తింపు పొందాయి. ఇతరులపై నిందలు వేయడానికి ముందు కాంగ్రెస్ తన సొంత శ్రేణులలో ఆత్మపరిశీలన చేసుకోవడం చాలా సముచితమని సందోష్‌కుమార్ హితవు పలికారు. ఢిల్లీలోని నార్త్ అవెన్యూ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఒక ఎఫ్ఐఆర్ గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కోసం డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కాంగ్రెస్ నాయకత్వంలోని అత్యున్నత స్థాయి వ్యక్తులపై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపిత కుంభకోణానికి సంబంధించి ఎంపి సందోష్‌కుమార్ కాంగ్రెస్ నాయకులు కె.సి.వేణుగోపాల్, కె.సురేశ్ సహా ప్రియాంకగాంధీ వాద్రా వ్యక్తిగత సహాయకుడు సాహబ్ అహ్మద్‌ఖాన్, వేణుగోపాల్ పిఏ అనాస్ అలీల పేర్లను ప్రస్తావించారు. కేరళ రాష్ట్రం వయనాడ్‌లోని చురాల్మలముండక్కై కొండచరియల ఘటన తర్వాత నిధుల సేకరణ, వినియోగంపై సిపిఐ నేత, ఎంపి సందోష్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేస్తూ సేకరించిన మొత్తం నిధుల పంపిణీలో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. సంపూర్ణమైన, ధృవీకరించదగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన రాహుల్‌గాంధీని కోరారు. మీరు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వారిపై కఠినచర్యలు తీసుకుని, కొండచరియల బాధితుల కోసం సేకరించిన నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో అవినీతికి వ్యతిరేకంగా నిలబడతామన్న వాదనను విరమించుకోవాలని ఎంపి సందోష్‌కుమార్ డిమాండ్ చేశారు.

## టెక్స్‌టైల్ రాజధాని (మొదటి పేజీ తరువాయి)




టెక్స్‌టైల్ ఇక్కడి ప్రజల డిఎన్ఎలో ఉందన్నారు. హైదారాబాద్ గ్లోబల్ సినిమా హబ్‌గా ఎదుగుతోందని, ఇటీవల నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోలను ఇక్కడ ప్రారంభించామని, టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుండగా, ఇప్పుడు హాలీవుడ్ కూడా చేరిందని, సినిమా సంబంధిత ఫ్యాషన్ రంగాన్ని కూడా తెలంగాణ నుంచే అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. తెలంగాణలోని పత్తి పొలాలకు లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోలకు అనుసంధానం కావాల ని, సిఐటిఐకి విజన్ ఉంటే ప్రభుత్వం సరైన భాగస్వాములం అవుతామని, అందరం కలిసి, ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్‌ను నిర్మిద్దామన్నారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని, అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేస్తుందని, ప్రపంచ పోటీకి అనుగుణంగా విధానాలు అనుసరిస్తున్నామని, అత్యుత్తమ మానవ వనరుల బలం ఉందని సిఎం చెప్పారు. పరిశ్రమల అభివృద్ధితోపాటే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, సంప్రదాయ ఆలోచనలతో పాటు ఆధునిక పరికరాలతో కలిపి డిజైన్, కట్టింగ్, స్టిచింగ్‌లో యువతకు ముఖ్యంగా మహిళలకు శిక్షణనిస్తామన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం తెలంగాణలో తయారైన దుస్తులను ధరించేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమని, తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పెట్టుబడిదారులకు పిలుపునిచ్చా రు. అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర భారతదేశానికి ఉందని శతాబ్దాలుగా కళలు, సంస్కృతి, సంప్రదాయాలు టెక్స్‌టైల్ రంగాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దాయన్నారు. వస్త్ర పరిశ్రమలో తెలంగాణ ముందంజలో ఉండటానికి చారిత్రక కారణాలున్నాయన్నారు. దేశంలో పత్తి ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామని, పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తం గా పేరుందని, టెక్స్‌టైల్ తెలంగాణకు కేవలం పరిశ్రమ మాత్రమే కాకుండా ప్రజల జీవనాధారమన్నారు. ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరలు, వరంగల్ దుర్రీస్, నారాయణపేట చేనేత వరకు అనేకం ఇక్కడున్నాయని సిఎం వివరించారు.

**తుమ్మిడి కుంట చెరువు పునరుద్ధరణ పనులు పరిశీలన**

నగరంలోని చెరువుల పునరుజ్జీవం, సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మాదాపూర్‌లోని తుమ్మిడి కుంట చెరువు పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైటెక్స్‌లో జరిగిన టెక్స్‌టైల్ సదస్సులో పాల్గొన్న అనంతరం, తిరిగి వస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి అనూహ్యంగా తుమ్మిడి కుంటను సందర్శించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో కలియతిరిగిన ఆయన, జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలోని మిగిలిన చెరువులను కూడా ఇదే తీరులో పునరుద్ధరిస్తామని ఈ సందర్భంగా అధికారులు సిఎంకు తెలిపారు. గతంలో ఆక్రమణల పర్వంతో తుమ్మిడి కుంట చెరువు తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం తీసుకున్న పకడ్బంది చర్యల వల్ల చెరువు రూపురేఖలు మారుతున్నా యి. ఒకప్పుడు ఆక్రమణల కారణంగా కేవలం 14 ఎకరాలకు కుంచించుకుపోయిన ఈ చెరువును, ప్రభుత్వం ఆక్రమణలను తొలగించి తిరిగి 28.05 ఎకరాలకు విస్తరిం చింది. ఈ పునరుద్ధరణ, సుందరీకరణ పనుల కోసం ప్రభు త్వం సుమారు 20 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంతో పాటు, భూగర్భ జలమట్టాన్ని పెంచడం, వరద ముప్పును తప్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్టీల్లో చేరొద్దు (మొదటి పేజీ తరువాయి)

తదితర వస్తువుల ఎగుమతి నిలిచిపోయిందని అన్నా రు. యుద్ధం ప్రభావంతో దేశంలో అన్ని రకాల ధర లు పెరిగి పోతున్నాయని, ప్రజల ఇక్కట్లను తొలగించి భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు, ట్రంప్ దుర్మార్గాన్ని ఆపేందుకు మోదీ మౌనం వీడాలని అన్నారు. మోదీ యుద్ధం పేరుతో దాడి చేస్తున్న దేశాలతో మాట్లాడకుండా యుద్ధం వల్ల నష్ట పోతున్న ఇరాన్‌తో మాట్లాడడం దేశానికి అవమానకరమని అన్నారు. ఒకవైపు అమెరికాలోనే 50 రాష్ట్రాలలో ట్రంప్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసనలు తెలుపుతుంటే మన దగ్గర అసమర్థ ప్రధానిగా మోదీ బలహీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అబద్ధాలు వల్లేవేశారని, కమ్యూనిస్టులు, మావోయిస్టుల పట్ల తన అక్కసును వెల్లగక్కారని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ పాల్గొని అనేక త్యాగాలు చేసిందని, ఆనాడు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని అన్నారు. నక్సలైట్ ఉద్యమం నుండి విడిపడి బయటికి వచ్చిన గద్దర్‌ను అమిత్ షా నక్సలైట్ అన్నారని, మరి అదే గద్దర్ చనిపోతే ప్రధాని మోదీ సంతాపం ఎందుకు వ్యక్తం చేశారని నారాయణ ప్రశ్నించారు. గద్దర్ చనిపోతే సంతాపం తెలిపి నందుకు ప్రధాని మోదీని దమ్ముంటే అరెస్టు చేస్తారా అని, లేదా అసత్యాలు పలికిన అమిత్ షా పై కేసు పెడతారా అని ప్రశ్నించారు. హత్యానేరం మోపబడిన అమిత్ షా 12 మందిని చంపించి నిర్దోషిగా ప్రకటించుకున్న చరిత్ర ఉందన్నారు. నక్సలైట్లను జన జీవన స్రవంతి లో కలవాలని మొదట కోరింది తామేనని, ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఇరు వర్గాలు కాల్పుల విరమణ పాటించాలని తామే సూచించామని అన్నారు. కానీ కేంద్రం అమానుషంగా వ్యవహరించి బయటికి వచ్చి న హిడ్మా లాంటి నక్సలైట్లను వందల మందిని ఎన్ కౌంటర్ చేయించిందని ఆరోపించారు. లొంగిపోయిన మావోయిస్టులకు కూడా ప్రభుత్వం సరైన గౌరవం ఇవ్వడం లేదని, మావోయిస్టులు ఎవరితో మాట్లాడవద్దని నిబంధనలు పెడుతున్నారని అన్నా రు. సిపిఐ రాష్ట్ర కార్యాలయానికి వస్తామని చెప్పిన మావోయిస్టు నాయకులు పోలీసుల ఒత్తిడితోనే రాలేదని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు సరైన స్వేచ్ఛ, గౌరవం ఇవ్వడం లేదని అన్నారు. మావోయిస్టులు ఇప్పటికైనా స్వేచ్ఛగా, గౌరవంగా బతుకాలని, ప్రజాస్వామ్య బద్ధంగా సిపిఐ వారికి అండగా ఉంటుందని చెప్పారు. 40 ఏండ్ల పాటు వారు జీవితాలను త్యాగం చేశారని, అలాంటి వారు బూర్జువా పార్టీలతో కలువ వద్దని, వారంతా వామపక్ష ఉద్యమంలో భాగం కావాలని కోరారు. కాగా ఇటీవల క్రిష్టియన్ మతంలో చేరితే ఎస్సీ కులం హోదా రద్దు అవుతుందని వచ్చిన తీర్పు సరికాదని, ఏ మతంలో చేరినా మనిషి కులం ఎన్నటికీ మారదని, క్రిష్టియన్ మతంలో చేరినా ఎస్సీ హోదా రద్దు కాదని అన్నారు. కేంద్రం చేపట్టిన ఎస్ఐఆర్ ను తాము వ్యతిరేకిస్తున్నామని, దేశంలో ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకే కేంద్రం రాష్ట్రాలపై ఎస్ఐఆర్ ను ప్రయోగిస్తున్నదని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి,సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, యెశబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ విమానం కూల్చివేత (మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిన్నదని చెప్పినా, టెహ్రాన్ మాత్రం ఒత్తిడిని కొనసాగిస్తోంది. శుక్రవారం ఉదయం డ్రోన్ దాడిలో కువైట్‌లోని మీనా అల్‌అహ్మది ఆయిల్ రిఫైనరీపై దాడి చేసింది. ఈ రిఫైనరీ యుద్ధ సమయంలో పలుమార్లు దాడికి గురైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు కువైట్ పెట్రోలియం సంస్థ తెలిపింది. బహ్రయిన్‌లో ఇరాన్ దాడు హెచ్చరికా సైరన్లు మోగాయి. సౌదీ అరేబియా అనేక ఇరాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో రక్షణ వ్యవస్థలు అమల్లోకి వచ్చాయి. ఇజ్రాయెల్ వైపు క్షిపణులు దూసుకెళుతున్నట్టు సమాచారం. టెహ్రాన్, మధ్య ప్రాంతంలోని ఇస్ఫహాన్ నగర పరిసరాల్లో దాడులు జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే ఎలాంటి లక్ష్యాలు దెబ్బతిన్నాయో స్పష్టంగా తెలియలేదు. గల్ఫ్ ప్రాంతంలోని ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ దాడులు, అలాగే ప్రపంచ చమురు, వాయువు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిపై కఠిన నియంత్రణ కారణంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ ధర శుక్రవారం ఉదయం సుమారు 109 డాలర్లకు చేరుకుంది. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఈ పెరుగుదల 50 శాతం కంటే అధికం.

**షరతులు విధించాలి..**

యుద్ధ విరమణపై ఇరాన్‌కు 15 అంశాల ప్రణాళికను అమెరికా ప్రతిపాదించింది. ఇందులో హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం కూడా ఉంది. అయితే చర్చల్లో పురోగతి కనిపించడం లేదు. గతంలో చర్చల సమయంలోనే అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ఆరోపిస్తోంది. కాగా, ప్రస్తుత పరిస్థితులపై ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి మొహమ్మద్ జవాద్ జరీఫ్ స్పందించారు. ప్రస్తుత పరిస్థితిలో ఇరాన్ తన పైచేయిని ఉపయోగించి ఒప్పందం సాధించాలని సూచించారు. అన్ని ఆంక్షలను ఎత్తివేయాలనే షరతుతో అణు కార్యక్రమంపై పరిమితులు విధించడం, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి ప్రతిపాదనలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**పెరుగుతున్న మరణాలు**

ఈ యుద్ధంలో ఇరాన్‌లో 1,900 మందికి పైగా మరణించారు. ఇజ్రాయెల్‌లో 19 మంది మరణించారు. గల్ఫ్ దేశాలు, వెస్ట్ బ్యాంక్‌లో రెండు డజన్లకు పైగా మరణాలు నమోదయ్యాయి. 13 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పో యారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ భూభాగ దాడుల కారణంగా 1,300 మందికి పైగా మరణించారు, 10 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. అక్కడ 10 మం ది ఇజ్రాయెల్ సైనికులు కూడా మరణించారు.

## అనర్హులకూ చోటు
(మొదటి పేజీ తరువాయి)

జీవిస్తుండగా ఫిబ్రవరి 24న వేలాది మంది పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చివేశారు. దీనిపై ప్రభుత్వం తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. విమర్శల నుంచి బయటపడడంతో పాటు లబ్ధిదారులకు న్యాయం చేయాలన్న ఆలోచనతో మొత్తం 720 మంది వెలుగుమట్ల నిర్వాసితుల్లో 311 మందిని అన్ని విధాలా అర్హులుగా గుర్తించి వెలుగుమట్ల భూదాన్ భూముల్లోనే స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. దానిని ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మరో 101 మందికి వారి వారి సొంత మండలాల్లో స్థలాలు ఉండడంతో ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. వెలుగుమట్ల లబ్ధిదారుల ఎంపికలో అధికార యంత్రాంగం మంత్రుల ఒత్తిడితో త్వరపడ్డారో లేక విచారణలో క్షేత్ర స్థాయి సిబ్బంది సరైన సమాచారం ఇవ్వక పొరపడ్డారో కానీ అనేక మంది అనర్హులకు వెలుగుమట్ల లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కింది. కూల్చివేతల ద్వారా జరిగిన నష్టాన్ని పూడ్చుకునే క్రమంలో ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవడం వల్ల పొరపాటు జరిగి ఉంటే బాధితుల ఆందోళన రాజకీయ పక్షాలు వివిధ సంస్థలు, సంఘాల వినతి తర్వాత లబ్ధిదారుల్లో అనర్హులు ఉంటే తొలగించాల్సిన అధికార యంత్రాంగం ఆ పని చేయలేదు. వెలుగుమట్ల వినోబానగర్ కాలనీలో ఒక్క రోజు నివసించని వారికి కూడా ఈ జాబితాలో చోటు దక్కిందని వారికి ఖమ్మం నగరంలో విలువైన స్థలాలు, భవనాలు ఉన్నాయని అటువంటి వారిని ఎలా లబ్ధిదారులుగా గుర్తించారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కొందరు క్షేత్ర స్థాయి సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి రాజకీయ నేతల అనుచరుల పేర్లను చేర్చారన్న విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒక లబ్ధిదారునికి సొంత గ్రామంలో వ్యవసాయ భూమి ఉండి పక్కా ఇల్లు ఉన్నా కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చారని మరో మహిళకు సంబంధించి పిల్లలు విదేశాలలో స్థిరపడి ధనిక కుటుంబానికి చెందిన ఆమెకు లబ్ధిదారుల జాబితాలో చోటు కల్పించారని బాధితులు ఆరోపిస్తున్నారు. వెలుగుమట్ల మోడల్ కాలనీకి సంబంధించి పట్టాలు అందజేసిన జాబితాను మరో సారి పునః పరిశీలించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పక్షాలు ప్లాట్ల నెంబర్ల వారీగా అనర్హుల జాబితాను ఇచ్చినా చర్యలు తీసుకోలేదని ఇక ఆందోళనే మార్గమని ఆ పార్టీ హెచ్చరిస్తుంది. అధికార యంత్రాంగం ఇప్పటికైనా పునః పరిశీలన చేయాలని అనర్హులు ఉంటే వెంటనే జాబితా నుంచి తొలగించి అర్హులకు అర్హత కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా కూల్చివేతల్లో నష్టపోయిన బాధితుల్లో అనేక మందికి అర్హత ఉందని మరోసారి విచారణ జరిపి అర్హత కలిగిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కోరుతున్నారు.

**పోలీస్ తీరు బేష్ :**

వెలుగుమట్ల విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడిన వారి పట్ల జిల్లా పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రశంసలు అందుకుంటుంది. సామాన్యులకు రకరకాల ఆశలు చూపి పెద్ద మొత్తంలో వసూలు చేసి పబ్బం గడుపుకునే వారికి ఇది ఒక హెచ్చరికగా మారింది. నగదు చెల్లించి నష్టపోయిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి అక్రమార్కులను దండించడంతో పాటు వారి స్థిర చరస్తులను జప్తు చేయడం కూడా అభినందనీయమే. అయితే దాదాపు 1500 మంది నుంచి నగదు వసూలు చేశారని బాధితులందరి వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారికి కూడా న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను కోరుతున్నారు. స్థిర చరస్తులను జప్తు చేయడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సంపద అందరికీ అందేదాకా సిపిఐ పోరాటం

- అణిచివేత ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుంది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/జగిత్యాల :** భారత కమ్యూనిస్టు పార్టీ రష్యాలో పుట్టిందని పార్లమెంట్ సాక్షిగా దేశ హోంశాఖ మంత్రి అమిత్ షా నిండు సభలో పచ్చి అబద్దాలు మాట్లాడారని ఇది పూర్తిగా అవస్తామని నిజాలు తెలుసుకుని అమిత్ షా మాట్లాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హితవు పలికారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చాడ వెంకట్ రెడ్డి ఇంటింటికి సిపిఐ, సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిపిఐ పార్టీ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో స్థాపించబడిందనే నిజాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలుసుకుని పార్లమెంట్‌లో మాట్లాడిన మాటలు సవరించుకుని క్షమాపణలు చెప్పాలని హెచ్చరించారు. మావోయిస్టుల పని ఇక పని అయిపోయిందని అంటున్న అమిత్ షా మాటలు కేవలం తాత్కాలిక ఉపశమేనన్నారు. అణిచివేతలు శాశ్వతం కాదని, పగలు, రాత్రిళ్లులాగా, కష్టాలు, సుఖాల మాదిరిగి దోపిడి ఉన్నంత కాలం సిద్దాంతం ఉంటుందని, అణిచివేత ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. ఈ దేశంలో సంపద కొంత మంది వద్దనే కేంద్రీకృతమై ఉందని అందరికి అందాల, చెందాలన్నదే సిపిఐ అరాటమన్నారు. సంపద అందరికి అందన్నంత కాలం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. దేశంలో రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, మద్దతు ధరలు లేవని, కూలీలకు కనీస వేతనాలు వేతనాలు ఇవ్వడం లేదని, కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను అమలులోకి తీసుకవచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కాని ఇప్పుడు మావోయిస్టులను అంతం చేయడంతో గిరిజన తండాలు లేకుండా ఉండాలనే దురుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ దుశ్చర్యకు పాల్పడడం సిగ్గు చేటని ఆరోపించారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కేరళలో ఎన్నికల ప్రచారం చేయడం తప్పుకాదని కమ్యూనిస్టులపై ఆరోపణలు, నింద లు వేయడం సూర్యుడిపై ఉమ్మి వేయడంలాంటిదేనన్నారు.

కమ్యూనిస్టులకు ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లేనని రేవంత్ రెడ్డి మాట్లాడడం చాలా భాధకరమన్నారు. కేరళలో బిజెపి ప్రభుత్వం వస్తే దేశానికే తీవ్ర నష్టమన్నారు. కేరళ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ స్థానిక పాలనను తెలుసుకుని తెలంగాణలో అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, మాజీ సిపిఐ జిల్లా కార్యదర్శులు బోయిని అశోక్, వెన్న మహేష్, కోరుట్ల, జగిత్యాల పట్టణ కార్యదర్శులు ముఖ్రం, మాడిశెట్టి కిరణ్, ఏఐటియూసి నాయకులు సుతారి రాములు, వెన్న మహేష్, నాయకులు ఇరుగురాళ్ల భూమేశ్వర్, ధర్మయ్య, రజాక్, దేవదాసు, హన్మంతు, వంశీ తదితరులు ఉన్నారు.

# కమ్యూనిస్టులంటేనే మోదీ, అమిత్ షాకు భయం

- కమ్యూనిస్టు ఉద్యమం లేకపోతే ప్రజల తరపున గళమెత్తే శక్తులు కనుమరుగు
- ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ సిపిఐ : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి
- ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అన్నింటినీ అమలు చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి




**ప్రజాపక్షం/చండూరు :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు కమ్యూనిస్టులంటే ఎందుకు భయం అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. పార్లమెంట్‌లో కమ్యూనిస్టులపై చేసిన ఆరోపణలు అనవసరమని పేర్కొన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం లేకపోతే ప్రజల తరపున గళమెత్తే శక్తులు కనుమరుగవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే కమ్యూనిస్టులను విమర్శిస్తున్నారని తెలిపారు. శుక్రవారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాధగోని నరసింహ భవనంలో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ స్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ,ఆదానిఅంబానీ వంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చుతోందని తీవ్రంగా ఆరోపించారు. ఈవిధానాల వల్ల దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ దేశ ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు దేశానికి హానికరమని అన్నారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం కృషి చేస్తోందని,అలాంటి పార్టీకి ప్రజల మద్దతు అవసరమని అన్నారు.సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏప్రిల్ 1నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తూ, సామూహిక నిధుల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు విరాళాలు అందించి ఈ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి కీలకమైన ఎస్ఎల్బీసీ, డిండి ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజాచారి, గురిజా రామచంద్రం, బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, గిరి రామ, మండల కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, చాపల శ్రీను, సుదనబోయిన రమేష్, బుర్ర శేఖర్, రమేష్, తిప్పర్తి రాములు, చలపతి, లాలు, బిక్షం రెడ్డి పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై అప్రకటిత సెన్సార్‌షిప్

- కేంద్రం తీరుపై ఐజెయు తీవ్ర ఆగ్రహం!

**అమరావతి :** జర్నలిస్టులు, స్వతంత్ర డిజిటల్ మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికల పట్ల ప్రభుత్వం అనుసరిస్తోన్న తీరుపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులు, వ్యంగ్య రచయితలు, స్టాండప్ కమెడియన్లు, ఫ్యాక్ట్ చెకర్ల కంటెంట్‌ను, వీడియోలను ఏకపక్షంగా తొలగించడం, బ్లాక్ చేయడాన్ని అప్రకటిత సెన్సార్‌షిప్‌గా ఐజెయు అభివర్ణించింది. ఆ మేరకు ఐజెయు అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మొహమ్మద్ జుబేర్, మోలిటిక్స్, నేషనల్ దస్తక్, 4 పీఎం న్యూస్ వంటి సంస్థలతో పాటు స్టాండప్ కమెడియన్ రాజీవ్ నిగమ్ వంటి వారి సోషల్ మీడియా ఖాతాలను, కంటెంట్‌ను బ్లాక్ చేయడం కార్యనిర్వాహక అధికారాలను దుర్వినియోగం చేయడమేనని వారు మండిపడ్డారు. స్వతంత్ర జర్నలిజం గొంతు నొక్కడానికి ప్రభుత్వం చేస్తోన్న ఇటువంటి ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వారు హెచ్చరించారు. ఆర్టికల్ 19 (1) (ఏ) ప్రకారం రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఇది నేరుగా జరుగుతున్న దాడి అని ఐజెయు నేతలు పేర్కొన్నారు. రహస్య విధానాలతో, అస్పష్టంగా ఉన్నచట్ట నిబంధనలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం భిన్నాభిప్రాయాలను అణచివేయలేదని వారు స్పష్టం చేశారు. 'పరోక్ష సెన్సార్‌షిప్ విధించడం ద్వారా విమర్శనాత్మక జర్నలిజాన్ని అణచివేయాలని చూస్తే దేశం మౌనంగా ఉండదు' అని ఐజెయు నేతలు ఘాటుగా స్పందించారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై జారీ చేసిన అన్ని ఏకపక్ష 'టేక్‌డౌన్' ఆర్డర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇటువంటి చర్యలకు గల కారణాలను బహిరంగంగా వెల్లడించాలని, జర్నలిస్టులను, స్వతంత్ర మీడియా ప్లాట్‌ఫారమ్‌లను భయభ్రాంతులకు గురిచేయడం ఆపాలని డిమాండ్ చేశారు. సెన్సార్‌షిప్‌ను ఎదుర్కొంటున్న జర్నలిస్టులు, మీడియా సంస్థలకు ఐజెయు అండగా ఉంటుందని, మీడియా స్వేచ్ఛను హరించే ప్రతి ప్రయత్నాన్ని సమర్థవంతంగా ప్రతిఘటిస్తామని ఐజెయు నేతలు బల్విందర్ సింగ్ జమ్మూ, డి.సోమసుందర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# రేవంత్‌రెడ్డి మాటలు పచ్చి అబద్ధం



- కేరళలో కాంగ్రెస్‌కు ఓట్లు పడవు
- కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలు చేయని ఆరు గ్యారెంటీలను అమలు చేశామంటూ కేరళ ప్రజలను రేవంత్ రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సరిగ్గా అమలు కాలేదని ఆరోపించారు. మహిళలకు రూ.2,500 నెలకు ఇస్తామన్న ఈ మొత్తం ఎంతమందికి అందుతోందని, వృద్ధులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 ఇస్తామన్న పెన్షన్‌ల హామీ ఏమైందని సిఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. దళితులకు రూ.12 లక్షలు, బిసిలకు లక్ష కోట్లు కేటాయిస్తామన్నారు, కానీ కనీసం రూ.20,000 కోట్లు కూడా కేటాయించలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం, ఉచిత స్కూటర్ల హామీలు గాలికి ఎగిరిపోయాయని విమర్శించారు. తెలంగాణలో గ్యారెంటీలు అమలు చేయకపోవడం ఒక మోసం అయితే, అమలు చేశామని అబద్ధాలు చెప్పడం మరింత పెద్ద మోసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తీరు కెసిఆర్ తరహాలోనే ఉందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళలో విలువ లేదన్నారు. కేవలం తెలంగాణ నుంచి పంపుతున్న డబ్బుల కోసమే కాంగ్రెస్ హైకమాండ్ ఆయన్ని అక్కడకు పిలుస్తోందని ఆరోపించారు. అక్కడ ప్రసంగాలు ఇప్పించినా, ఓట్లు మాత్రం పడవన్నారు.

**కాళేశ్వరం, అవినీతిపై నిలదీత**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం మేడిగడ్డ పిల్లర్ల గురించి కాకుండా, ప్రాజెక్టు మొత్తంపై సిబిఐ విచారణ జరిపించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ నేతలపై, కెసిఆర్ కుటుంబంపై కేసులు పెట్టి లక్ష కోట్లు వసూలు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఇప్పుడు తమ అసమర్థతను దాచుకోవడానికి బిజెపిపై నెపం వేయడం సరికాదన్నారు. హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందిస్తూ భద్రాచలం ముంపు ప్రాంతాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం అనేది విభజన చట్టం ప్రకారం కాంగ్రెస్, యుపిఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమేనని, దీనికి బిజెపికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

## ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వాణి ప్రసాద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణి ప్రసాద్(ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) ఎండిగా బాధ్యతలు స్వీకరించిన పి.గౌతమితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరు అధికారులను వారి కొత్త బాధ్యతల స్వీకరణపై మంత్రి అభినందిస్తూ, రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాల బలోపేతం, ముఖ్య పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, అలాగే ప్రస్తుత, రాబోయే పర్యాటక ప్రాజెక్టులను వేగవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సూచించారు. వాణి ప్రసాద్, పి.గౌతమి తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు తమ కట్టుబాటును వ్యక్తం చేశారు.

## కుల గణనలో ఒబిసిల సమగ్ర సమాచారాన్ని తీసుకోవాలి

- మాజీ ఎంపి వి.హెచ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రం చేపట్టిన కుల గణనలో ఎస్‌సి, ఎస్‌టి వర్గాల వివరాలు మాత్రమే సేకరించడం సరియైనది కాదని, ఒబిసి వర్గాల సమాచారాన్ని కూడా సమగ్రంగా తీసుకోవాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. డిజిటల్ సెన్సెస్‌పై తీవ్ర విహెచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణనపై విహెచ్ అనుమానాలు వ్యక్తం చేస్తూ, దీన్ని బోగస్‌గా అభివర్ణించారు. ఒబిసి వర్గాలు కూడా పేదరికంలో ఉన్నాయని, వారి పరిస్థితులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. బిజెపి ఓటు రాజకీయాలపై విమర్శలు గుప్పిస్తూ, హిందువుల ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ ఒబిసిలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ప్రభావంతోనే ఒబిసి లెక్కలు పరిగణలోకి తీసుకోవడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. నేడు(శనివారం) మధ్యాహ్నం 2 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసి సంఘాల నాయకులు, మేధావులతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని విహెచ్ తెలిపారు. ఇప్పుడే మేల్కొనకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అవసరమైతే పోరాటానికి సిద్ధం కావాలని విహెచ్ పిలుపునిచ్చారు.

# మెట్రో రైలు విషయంలో సిఎం రేవంత్‌ది తప్పుడు నిర్ణయం

- బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి. వివేకానంద




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో సిఎం రేవంత్ రెడ్డి మొదటి నుంచీ తప్పుడు దారిలోనే వెళ్తూ, తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని బిఆర్‌ఎస్‌ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద అన్నారు. ఎల్అండ్‌టిపైన కేసు నమోదు చేసి, జైలులో వేస్తామంటూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని, తద్వారా మెట్రోకు చెందిన 250 ఎకరాలను కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివేకానంద మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ రంగానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో 3 వేల ఎకరాలను, అలాగే హెచ్‌సియు, హిల్ట్ పాలసీ, టిడిఆర్‌తో పేరుతో భూములు కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సిఎం రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీనంపైన ప్రకటన చేశారని, కానీ ఆ ప్రకటనపైన సభలో ఎటువంటి చర్చ చేయలేదన్నారు. విభజన చట్టంలో తెలంగాణ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సినవే ఇంత వరకు రాలేదని, రాష్ట్రానికి పనికిరాని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముందు వరుసలో ఉంటే, రెండో వరుసలో మరో మంత్రి బండి సంజయ్ ఉంటారని ఆయన ఎద్దేవా చేశారు. వారిద్దరూ అలంకార కేంద్రమంత్రులు అని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు అవుతున్నాయని కేరళ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యనించారని, ఆ పథకాలు అమలు అవుతున్నాయా? లేదా? అనేది తెలంగాణ రాష్ట్రంలోని సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులను అడిగితే తెలుస్తుందని వివేకానంద అన్నారు.

# పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గుదిబండగా హైకోర్టు తీర్పు

- బిసి జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు రియంబర్స్‌మెంట్ పథకానికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వం సమయానికి చెల్లించకపోతే అడ్మిషన్ల సమయంలో కాలేజీలే విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేసుకోని, ప్రభు త్వం నిధులు విడుదల చేసిన తర్వాత ఆ ఫీజు డబ్బులు తిరిగి విద్యార్థులకు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గుదిబండలా మారుతుందని బిసి జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని బిసి జెఎసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసిల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే తెలంగాణ రాష్ట్రంలోనే తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారనీ, వేలాదిమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. హైకోర్టు తీర్పు దరిమిల ఫీజుల రియంబర్స్‌మెంట్ పథకాన్ని రక్షించుకోవడం కోసం బిసి సమాజం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, కో ఛైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్, బండి గారి రాజు, ఆవుల నరేష్, ఏ నరసమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులు కాపాడుకోవడానికే చిరుమర్తి లింగయ్య బిఆర్‌ఎస్‌లోకి..

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యక్తిగత ఆస్తులను కాపాడుకోవడానికే నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బిఆర్‌ఎస్ పార్టీలో చేరారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్ అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిరుమర్తి లింగయ్య తమ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులపై అనుచితంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌తో గెలిచిన తర్వాత పార్టీని వీడి వెళ్లడం తగదని అన్నారు. కరోనా సంక్షోభ సమయంలో ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు వేముల వీరేశం అని కొనియాడారు. ''గ్యాదరి కిషోర్‌తో కలిసి నువ్వు ఇసుక దందా చేయలేదా? నార్కట్‌పల్లిలో స్మశాన వాటిక కబ్జా చేసింది నువ్వు కాదా? దీనిపై చర్చకు వచ్చే దమ్ముందా'' అని ప్రశ్నించారు. వేముల వీరేశం గురించి తెలుసుకోవాలంటే ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావు, జగదీష్ రెడ్డిని అడగాలని సూచించారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలిచిన రెండో ఎమ్మెల్యే వేముల వీరేశం అని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి వేముల వీరేశం కృషి చేస్తున్నారని, ఇకపై తమ నాయకులపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించబోమని, ఇదే చివరి హెచ్చరిక అంటూ లింగం యాదవ్ స్పష్టం చేశారు.

## ఐఐఎం ఛైర్మన్, డైరెక్టర్లకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎంబీఏ అడ్మిషన్లకు అనుమతించాలని ఒక అభ్యర్థి విషయంలో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయని ముంబై ఐఐఎం ఛైర్మన్ శశికిరణ్ శెట్టి, డైరెక్టర్ మనోజ్ కె.తివారీలకు హైకోర్టు కోర్టుధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తనకంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్లను వ్యక్తిగత ఇంటర్వ్యూకు పిలిచారంటూ గుండ్లపోచంపల్లికి చెందిన కటారు సత్యసాయి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని సింగిల్ జడ్జి గతంలో విచారించి పిటిషనర్‌ను వ్యక్తిగత ఇంటర్వ్యూలకు అనుమతించాలని గత ఆదేశాలను అమలు చేయలేదని సత్యసాయి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీంతో న్యాయమూర్తి, ఐఐఎం ఛైర్మన్, డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. ఈనెల 30లోగా కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. లేకపోతే వారిద్దరూ వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలన్నారు. ఇదీ చేయకపోతే రూ.10వేలు చెల్లించాలన్నారు. విచారణ 30కి వాయిదా వేశారు.

## అసోం ఎన్నికల ప్రచారంలో సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అస్సాం శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున మంత్రి సీతక్క ఆ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. దిబ్రూగర్ జిల్లాలోని నహర్కటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రణతీ ఫుకాన్ తరపున ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి, ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. నహర్కటియా ప్రాంత అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అనుభవజ్ఞురాలైన ప్రణతీ ఫుకాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. స్థానిక యువత, మహిళలు కాంగ్రెస్ వైపు ఉన్నారని, ప్రజల సమస్యలను పరిష్కరించే సత్తా తమ పార్టీకే ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియా మహిళ అరెస్టు

- రూ.2.35 లక్షల విలువైన 7.5 గ్రాముల కొకైన్ స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముంబై నుంచి హైదరాబాద్‌కు కొకైన్ రవాణా చేస్తున్న నైజీరియా మహిళను సికింద్రాబాద్ ఎక్సైజ్ డిటిఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2.35 లక్షల విలువైన 7.5 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ముంబై నుంచి ఓ నైజీరియన్ మహిళ డ్రగ్స్ తీసుకువస్తోందన్న సమాచారం మేరకు డిటిఎఫ్ సిఐ సౌజన్య, ఎస్ఐ శివకృష్ణ సిబ్బందితో కలిసి పారడైజ్ సమీపంలోని సన్‌షైన్ హాస్పిటల్ ప్రాంతానికి వస్తోందని తెలిసి అక్కడ కాపు కాశారు. ఆటోలో వచ్చిన నిందితురాలు జేమ్స్ టెస్లింగ్ యామ్యూనల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఐదు ప్యాకెట్లలో దాచిన 7.5 గ్రాముల కొకైన్‌ను గుర్తించారు. విచారణలో ముంబైలో గ్రాముకు రూ.15 వేల చొప్పున కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో రూ.30 వేల చొప్పున విక్రయించేందుకు తెచ్చినట్లు నిందితురాలు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితురాలను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ పట్టివేతలో ప్రతిభ కనబర్చిన డిటిఎఫ్ సిఐ సౌజన్యతో పాటు సిబ్బందిని హైదరాబాద్ ఎక్సైజ్ అధికారులు అభినందించారు.

## ప్రేమించి పెళ్లి చేసుకోకపోతే 420 అవ్వదు : హైకోర్టు తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివాహం చేసుకుంటానని ప్రేమించిన అయిదేళ్ల తర్వాత పెళ్లి చేసుకోనని చెప్పిన ప్రేమికుడిపై మోసం (ఐపీసీ 420) కింద కేసు పెట్టడాన్ని హైకోర్టు రద్దు చేసింది. ప్రేమ విఫలమైతే మోసం కింద నేరంకాదంది. ప్రేమించిన తొలినాళ్ల నుంచి మోసం చేయాలనే ఉద్దేశంతో ఉండి పెళ్లి చేసుకోనప్పుడు మాత్రమే మోసం కింద నేరం అవుతుందని తీర్పు చెప్పింది. ఇందుకు ఆధారాలు కూడా ఉండాలంది. ప్రేమ తర్వాత పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడంటూ ఒక యువతి ఫిర్యాదు ఆధారంగా రామగుండం జిల్లా పొట్యాలకు చెందిన కె.సంతోష్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. దీనిని కింది కోర్టు విచారణ చేస్తోంది. ఈ కేసును సంతోష్ సవాలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ విచారించి పైవిధంగా తీర్పు చెప్పారు. 2018లో సంతోష్ ప్రేమకు ప్రతిపాదిస్తే యువతి నిరాకరించింది. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి సంతోష్ ఒప్పించాడు. 5 ఏళ్ల తర్వాత పెళ్లి చేసుకునేందుకు ముఖం చాటేశాడు. ఇది మోసం కిందకే వస్తుందని యువతి లాయర్ వాదన. ప్రేమ విఫలం అయితే మోసం కిందకు రాదు. తనపై క్రిమినల్ కేసు నమోదు చెల్లదు.. అని సంతోష్ లాయర్ వాదించారు. కింది కోర్టులో సంతోష్‌పై ఉన్న కేసును హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.



## సింగిరెడ్డిపాలెం పొదుపు సంఘాల్లో రూ.24లక్షల గోల్‌మాల్

సోషల్ ఆడిట్‌లో బయటపడ్డ భాగోతం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని సింగిరెడ్డిపాలెం పొదుపు సంఘాల్లో రూ.24లక్షలు గోల్‌మాల్ జరిగింది. సోషల్ ఆడిట్‌లో ఈ అవినీతి భాగోతం బయటపడింది. గ్రామ సర్పంచ్ ఒగ్గు కిరణ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో 2018 నుండి 2023 మధ్య కాలంలో 28 మహిళా సంఘాలకు సంబంధించి రూ.24,18,244 లెక్కల్లో తేడాలు వచ్చినట్లు డిఆర్‌పిలు అనిల్, కిషోర్ తేల్చారు. దీంతో మాజీ విఓఏ గణేష్ బాధ్యుడంటూ అధికారులు ప్రాథమిక నిర్ధారించారు. 2023లో నన్ను తొలగించే వరకు ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని కనీసం నాకు నోటీసులు ఇవ్వకుండా విచారణ చేయకుండానే నన్ను విధుల నుంచి తొలగించారని వాపోయారు. దాదాపు రూ.15లక్షలు సభ్యుల అనుమతితో ప్రామిసరీ నోటు రాసి ఇచ్చి దానికి నెలనెలా వడ్డీ చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. గ్రామంలో ఇంకా 60 మంది సభ్యులను విచారించి ఆడిట్ చేయాల్సి ఉందని వారి ఇండ్లకు తాళాలు వేసి ఉన్నాయన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపితే అసలు విషయాలు బయట పడుతాయన్నారు. మహిళా సంఘాల సొమ్ము ఒక్క రూపాయి కూడా పక్కదారి పట్టలేదని చెప్పారు.

## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మునుగోడు మండలం చల్మడ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చోల్లేడు గ్రామానికి చెందిన జనీగల కృష్ణయ్య,ఆయన భార్య లక్ష్మమ్మ,కుమారుడు కార్తీక్‌లను సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శుక్రవారం పరామర్శించారు.ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అనంతరం బాధితులను,వారి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి,అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరి లింగయ్య,మాజీ సర్పంచ్ జనీగల మహేశ్వరి సైదులు,పెంబల జానయ్య,తాటికొండ సైదులు,ఇంద్రారెడ్డి,బొడ్డు నరసింహ,బీసం కృష్ణ,దాం నరసింహ,ఉడుగుండ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## కేసుల్లో దర్యాప్తు వేగవంతం

పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డ్సు, ఫిర్యాదుల నిర్వహణను, కమాండెంట్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. రికార్డు త్వరితగతిన పూర్తి చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి బరోసా కల్పించాలని సూచించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందిస్తూ బాధితుల వద్ద నుండి కేసులు నమోదు చేయాలన్నారు. సామాజిక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. సిబ్బంది అందరూ జట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్‌ఐలు ఏడుకొండలు, ఐలయ్య, మహేందర్‌నాథ్, శివతేజ సిబ్బంది ఉన్నారు.

## స్వర్ణగిరిలో శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం

వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళ భరిత పుష్పమాలలతో శోభాయ మానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. స్వర్ణగిరి దివ్య దేవస్థానంలో సాయంత్రం 7:30 నిమిషాలకు శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణలు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట దేవస్థానం కొండపై దుకాణాల టెండర్లు ఎప్పుడో?

హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన స్థానిక భక్తుడు..

దుకాణాల గడువు తేదీ ముందుకు వస్తున్నా టెండర్ల ఊసేదీ?

టెండర్ల ద్వారా కోట్లరూపాయల ఆదాయం వచ్చే దుకాణాలపై ఇఒ చూపేది?



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో అన్ని విభాగాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో నోటిఫికేషన్ విడుదల అవుతున్న కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలకు సంబంధించిన టెండర్ల నోటిఫికేషన్ ప్రక్రియ విషయంలో మాత్రం దేవస్థాన అధికారుల చూపు సారించడం లేదు. కొండపై ఉన్న దుకాణాలను టెండర్లు వేయడం ద్వారా దేవస్థానానికి కోట్ల రూపాయలలో ఆదాయం సమకూరుతుందనే విషయం ప్రస్తుతం ఉన్న ఇఒ జె.భవాని శంకర్ (ఐఏఎస్) అధికారికి తెలియదు కాబోలు. అందుకే ఏటెండర్ అయినా మూడునెలల ముందే షెడ్యూల్ విడుదల చేసి టెండర్ల నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుంది. కాని కొండపైన దుకాణాల విషయంలో జాప్యం జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదనిపిస్తుంది. ఎందుకంటే ప్రతిదీ రూల్ ప్రకారంగా వ్యవహరించే దేవస్థాన అధికారులు కొండపైన దుకాణాల విషయంలో రూల్స్ పాటించకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.
వర్తక సంఘం పేరిట కొనసాగుతున్న దుకాణాలను టెండర్లు వెయ్యాలని స్థానిక భక్తుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనేపథ్యంలో కొండపై ఉన్న దుకాణాల గడువు దగ్గర పడుతున్నా టెండర్ల మాటే లేదని స్థానికులు పలుమార్లు ఈవో దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. అందుకు కారణం ఈవో జె భవాని శంకర్ (ఐఏఎస్) అధికారి వర్తక వ్యాపారులతో కుమ్మక్కై ఉండవచ్చనే ఆరోపణలు స్థానికంగా పెద్ద దుమారం రేపుతున్నాయి. అంతే కాకుండా వర్తక వ్యాపారాలకు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పైరవీల కారణంగా టెండర్ల నోటిఫికేషన్ ముందుకు సాగడం లేదనే ఆరోపణలు కూడా వెల్లువెత్తున్నాయి. కానీ హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ కొండపై ఉన్న దుకాణాల సముదాయాన్ని టెండర్లు వేయవలసి ఉంటుందనే విషయం ఈవో జె భవాని శంకర్ (ఐఏఎస్)కి తెలుసో లేదో...? ఒకవేళ టెండర్లు చేసినట్లయితే దేవస్థానానికి వచ్చే కోట్ల రూపాయల ఆదాయం చూసి కళ్లు చెదురుతాయనే భయం ఇఒకు ఉన్నట్లు ఉందేమో...? కొండపైన వర్తక వెల్ఫేర్ సంఘం పేరిట సుమారు 10 దుకాణాలు కొనసాగుతూ దేవస్థానాన్నికి ప్రతి నెల 14లక్షల రూపాయలు చెల్లిస్తూ సంవత్సరానికి 1కోటి 68 లక్షలు చెల్లిస్తూ 10 దుకాణాలను వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకొని వ్యాపారులు చేస్తూ దేవస్థానానికి కోట్ల రూపాయలలో గండి కొడుతూ వర్తక వ్యాపారులుగా కొండపై తిష్ట వేసుకుని గడువు తేదీ 31/05/2026 వరకు దుకాణాల టెండర్లు జరగకుండా పైరవీలు చేసి దేవస్థానానికి వచ్చే భక్తులను దోపిడీకి గురిచేస్తున్నారు. మొన్న టికి మొన్న జరిగిన సెల్ ఫోన్ కౌంటర్ టెండర్ సంవత్సరానికి 2కోట్ల 22లక్షలు కాగా, ఇలాగే మొన్న జరిగిన టెండర్ల వివరాలు గమనిస్తే దేవస్థానానికి ఒకొక్క టెండర్ ద్వారా ఎంత ఆదాయం సమకూరుతుందో వివిధ ప్రదేశాల్లో ఉన్న 10దుకాణాలకు సంవత్సరానికి కేవలం 1.68 లక్షలు మాత్రం ఆదాయం సమకూరుతుందనే అలోచన దేవస్థానంలో ఉన్న ఉన్నతాధికారులు ఈవో ఎందుకు గమనించటం లేదు. అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కొండపైన ఉన్న దుకాణాలను టెండర్లు వేస్తే ఒక్కో దుకాణానికి సుమారు 2కోట్ల ఆదాయం సమకూరుతుందనే విషయం ఉన్నతాధికారులు గమనించాలి. అంతే కాదు గడువు తేదీ 31/05/2026 దగ్గర పడుకున్నా దేవస్థాన రూల్స్ నియమనిబంధనల ప్రకారం మూడునెలల ముందే టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలి కాని అన్ని టెండర్ల విషయంలో ముందుగానే టెండర్ల నోటిఫికేషన్ ప్రక్రియ విడుదల చేసే దేవస్థాన అధికారులు కొండపై 10 దుకాణాల టెండర్ నోటిఫికేషన్ ప్రక్రియ ఎందుకు విడుదల చేయడం లేదో దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవాని శంకర్ (ఐఏఎస్) చెబుతారా..? లేక గత ఈవోలలాగే టెండర్లు వేయకుండా వర్తక వ్యాపారులతో మంతనాలు జరుపుతారా..? లేక హైకోర్టులో ఉన్న పిటిషన్‌ను గౌరవిస్తూ టెండర్ల ప్రక్రియ అమలు చేస్తారా..? వేచిచూడాల్సిందే.

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణంలోని12 వార్డులలోని శివాజీ నగర్‌లో ఐదేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శంకర్ కుమారుడు శరత్ చంద్ర కాంత్ పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క అకస్మాత్తుగా దాడి చేసి ముఖంపై తీవ్ర గాయాలు చేసింది. బాలుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి కుక్కను తరిమికొట్టి తల్లిదండ్రులతో కలిసి సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. గత నెల 28న జరిగిన పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో కూడా ఈ సమస్యపై చర్చించినట్లు అధికారులు తెలిపారు. వీధి కుక్కల నియంత్రణ, కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్ పేర్కొన్నారు.



## దొడ్డి కొమరయ్య పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తి



సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్య అంశాలను ప్రస్తావించారు. నిరంకుశ రాచరిక వ్యవస్థను గడగడలాడించిన ఘనత కొమరయ్యదేనని, ఆయన బలిదానంతోనే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన పోరాట ఫలితంగానే 3000 గ్రామాలు విముక్తి పొందాయని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు.నేటి యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా, సామాజిక స్పృహతో దేశాభివృద్ధికి తోడ్పడాలని, దొడ్డి కొమరయ్య వంటి వీరుల చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పేరబోయిన పెంటయ్య పాల్గొన్నారు. అలాగే చిన్న కందుకూరు ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్ పాల్గొన్నారు.
**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ సాయుధ పోరాటంలో నెలకొరిగిన తొలి అమరజీవి దొడ్డి కొమరయ్య అని బిసి హక్కుల సాధన సమితి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, ఊదరవెంకన్న, కొమ్రరాజు వెంకట్, శ్రీనివాస్, సైదులు, శేఖర్, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

**దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి**

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసి అమరుడైన కొముర య్య చిరస్మరణీయుడని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్,బి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ వారి సేవలను కొనియాడారు. తెలంగాణ సాయిధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని ఆర్జాల బావి గ్రామ సర్కిల్లో ఉన్న వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్‌పిటిసి శబరయ్య,వంగూరు నారాయణ యాదవ్,గుండు వెంకటేశ్వర్లు,కర్నాటి విజయకుమార్,సుక్కర్పోయిన పరమేష్,కోటేష్ యాదవ్ కుంటి గొర్ల లింగయ్య పాల్గొన్నారు.



## పోరాట పార్టీ సిపిఐకి చేయూతనివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారనికై ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న సీపీఐ నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని, పోరాటాలకు చేయూతనివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు తదితర ప్రజాసంఘాలను నిర్మించి, వెట్టి చాకిరి నిర్మూలనకు, కార్మికులు , కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి సిపిఐ పోరాటాలు సాగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటిపల్లి సత్తయ్య, మండల కార్యవర్గ సభ్యులు మన్నోజు సిద్దినరసింహ చారి, దుడుక లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.
**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆదేశానుసారం ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్యాల గ్రామంలో మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేటట్లు చూడా లని కరపత్రాలు పంచుతూ విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, కృష్ణ, రాజు, ప్రసాద్, మోహన్, బాలరాజు, తేజ, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.








## పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో లబ్ధిదారులు నడింపల్లి లక్ష్మయ్య, మైనవారిగూడెం గ్రామంలో లబ్ధిదారులు గంగపూరి రేణుకయాదయ్యలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేతతో కలిసి ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యం ప్రవేశపెట్టి ఏడాది అయిన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేద ప్రజల సొంత కలలను నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రజా ప్రభుత్వంపై చూపిస్తున్న ఆదరణకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గర్వ పడుతున్నానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, మండల నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎఐపిఎస్‌ఒ జిల్లా కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్‌ఒ) నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని జిల్లా పరిషత్ కార్యాలయం పక్కన ఉన్న పిఆర్‌టియూ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షవర్గం కట్ట వెంకటరెడ్డి,అనంతుల శంకరయ్య, గుర్రం వెంకటరెడ్డి,జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య తెలిపారు.ఈ సమావేశానికి ఎఐపిఎస్‌ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు హాజరుకానున్నారు.సమావేశంలో సభ్యత్వ విస్తరణ, జిల్లా నిర్మాణం,భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా సమితి సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## భూదానోద్యమ వజ్రోత్సవాల పాదయాత్ర

**ప్రజాపక్షం/భూధన్ పోచంపల్లి :** భూదాన ఉద్యమం మొదలై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సంఘమిత్ర ఆధ్వర్యంలో ఏప్రిల్ 16 నుండి 18 వరకు శివరాంపల్లి నుండి భూదాన్ పోచంపల్లి వద్దకు పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు నిజాం కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో యువతకు పిలుపునిచ్చారు. 1951 ఏప్రిల్ 18న ఒక చిన్న గ్రామం ప్రపంచ చరిత్రను మార్చిన సుదినాన్ని గుర్తు చేస్తూ అహింసా సమానత్వము దానధర్మము పేదలకు భూదానాన్ని చేయాలనే సంకల్పంతో గాంధే య నినాదంతో ఆచార్య వినోబా భావే తలపెట్టిన భూదానోద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని భావితరాలకు చరిత్రను తెలపవలసిన బాధ్యత అందరిపై ఉందని మేల్కొల్పుతూ సాగే ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జటంగి నర్సయ్య మరణం సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జటంగి నర్సయ్య మరణించడంతో శుక్రవారం మరిపడిగ గ్రామంలో నర్సయ్య పార్థివ దేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించిన సిపిఐ సీనియర్ నాయకులు పాల్వాయి దయాకర్ రెడ్డి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ సినియర్ నాయకులు జటంగి నర్సయ్య మరణం సిపిఐకి తీరని లోటు అని, నాటి నుండి నేటి వరకు పార్టీలో ఉంటూ పార్టీ ఇచ్చే సూచనలు, సలహాలు తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్ళడంతో నర్సయ్య పాత్ర కీలకం అని, ఆయన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాదగిరి, సినియర్ నాయకులు వెంకటయ్య,బక్కయ్య తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :**గుడ్ ఫ్రైడే సందర్భంగా నల్లగొండ పట్టణంలో క్రైస్తవ భక్తులు గంభీర వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనలు,ఊరేగింపులు నిర్వహించారు.పట్టణం లోని కలెక్టరేట్ సమీపంలో హౌస్‌ఆఫ్ ప్రేయర్ చర్చ్,గడియారం సెంటర్ లోని బాప్టిస్ట్ చర్చి తో పాటు దేవరకొండ రోడ్డు,హైదరాబాదు రోడ్డు,తదితర ప్రాంతాలలోని ప్రాంతాలలోని పలు చర్చిలలో క్రైస్తవులు సిలువ గీతాలను ఆలపించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేవరకొండ రోడ్డులో గల మరియా మతచర్చిలో యేసు క్రీస్తు శిలువ వేయబడిన బాధలను స్మరించుకుంటూ విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చిల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా,యేసు క్రీస్తు శిలువ మోసిన ఘట్టాలను ప్రతిబింబిస్తూ యువకులు నాటకీయ ప్రదర్శనలు చేశారు.శిలువ మోస్తూ వీధులలో ఊరేగింపుగా వెళ్లడం,కొరడాలతో శిక్షించే సన్నివేశాలను ప్రదర్శించడం ద్వారా ఆకాలం సంఘటనలను గుర్తుచేశారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించడంతో పాటు శాంతి,సహనం,ప్రేమ అనే సందేశాలను ఆచరించాలని పాస్టర్లు పిలుపునిచ్చారు.గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ప్రధాన చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు కొనసాగాయి.ఈ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ప్రశాంతంగా జరిగాయి.ఈకార్యక్రమంలో పాస్టర్స్ వినోద్ కుమార్, సుందర్, వెంకటయ్య, దానియల్, రంజిత్ కుమార్, శ్రీహరి ఉన్నారు.








## సిబిఎస్ఇలో మూడు భాషల విధానం అమలు

**న్యూఢిల్లీ :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యా విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయబోతుంది. 2031నాటికి పదో తరగతిలో కూడా మూడు భాషల విధానం అమలయ్యేలా ఈ మార్పు చేపట్టింది. అయితే, ఒకేసారి 2031లో అమలు చేయడం కాకుండా, ఇందుకోసం ఇప్పటి నుంచే త్రిభాషా విధానాన్ని అమలు చేయబోతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరో తరగతిలో మూడు భాషల విధానం అమలవుతుంది. 2026–27లో ఆరో తరగతికి, 2027–28లో ఏడో తరగతికి, 2028–29లో ఎనిమిదో తరగతికి, 2029–30 నాటికి తొమ్మిదో తరగతికి, 2031 నాటికి పదో తరగతికి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలనిసిబిఎస్ ఈ నిర్ణయించింది. పదో తరగతి వరకు ప్రతిఏటా ఇలాగే ఈ విధానం అమలవుతుంది. ప్రస్తుతం సీబీఎస్ఈలో రెండు భాషల విధానమే అమలవుతోంది. ఇంగ్లీష్‌తోపాటు మరో ప్రాంతీయ భాషను మాత్రమే అమలు చేస్తున్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి) 2020లో వచ్చిన సూచనలకు అనుగుణంగా ఈ మార్పు తీసుకొచ్చింది సీబీఎస్ఈ బోర్డు. బహుభాషా విధానం వల్ల ఉపయోగం ఉంటుందనేది దీని ఉద్దేశం. భారతీయ భాషలకు ఆదరణ కూడా పెరుగుతుందని ప్రభుత్వం కూడా విశ్వసిస్తోంది. కొత్త విధానంలో ప్రస్తుతం ఏడో తరగతి, ఆపై తరగతులు చదువుతున్న వారికి మాత్రం మూడు భాషలు ఉండవు. రెండు లాంగ్వేజెస్ మాత్రమే చదువుకోవాలి. ప్రస్తుతం ఆరో తరగతికి మాత్రమే మూడు భాషలకు సంబంధించిన పాఠ్య పుస్తకాల్ని అందించబోతున్నట్లు సిబిఎస్ఈ చైర్మన్ రాహుల్ సింగ్ తెలిపారు. వీరు 2031లో మూడు భాషలతో బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తారు. కొత్త విధానంలో ఏదైనా ఒక్క విదేశీ భాషను మాత్రమే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఎక్కువ మంది ఇంగ్లీష్ మాత్రమే ఎంచుకుంటారు. కాబట్టి, మరో విదేశీ భాషకు అవకాశం లేదు. థర్డ్ లాంగ్వేజ్‌ను ఆన్‌లైన్‌లో కూడా నేర్పించే ఏర్పాట్లు చేస్తోంది. రాబోయే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల స్కిల్స్ పెంచే కొత్త సబ్జెక్టులు కూడా రాబోతున్నట్లు తెలుస్తోంది.

## కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** విభిన్నప్రతిభావంతులైన సైనిక అభ్యర్థులను మాజీ సైనికులుగా పరిగణించవచ్చా అని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. శిక్షణ సమయంలో వైకల్యానికి గురైన సైనిక అభ్యర్థులకు 'మాజీ సైనికుల' హోదా కల్పించవచ్చా, వారికి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల ఉద్యోగాల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించింది. విభిన్న ప్రతిభావంతులైన సైనిక శిక్షకుల్లో అత్యధిక శాతం మంది 30 ఏళ్లలోపు వారని, వారికి ఉపాధి తప్పనిసరని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ''వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఉద్యోగాలు, కీలక పదవుల కోసం ఇటువంటి వ్యక్తులకు కల్పించే రిజర్వేషన్ ప్రయోజనాన్ని పొందే ఉద్దేశంతో బోర్డెడ్ అవుట్ క్యాడెట్‌లను కూడా మాజీ సైనికులుగా లేదా మాజీ సైనిక సిబ్బందిగా పరిగణించవచ్చా లేదా అనే అంశం చర్చకు వచ్చిన వాటిల్లో ఒకటి'' అని ధర్మాసనం పేర్కొంది. శిక్షణ సమయంలో వైకల్యం, గాయాల కారణంగా సైనికులుగా అర్హత పొందలేని శిక్షకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

## ఎన్‌సిఇఆర్‌టికి 'స్వయంప్రతిపత్తి వర్సిటీ' హోదా

**న్యూఢిల్లీ :** జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)ని అధికారికంగా 'స్వయంప్రతిపత్తి యూనివర్సిటీ హోదా' (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) ప్రకటించారని అధికారులు శుక్రవారం తెలిపారు. దీంతో ఎన్‌సీఈఆర్‌టీ స్వయంగా డిగ్రీలు ఇచ్చే అధికారాన్ని పొందిందని అన్నారు. యూజీసీ సలహా మేరకు విద్యాశాఖ ఎన్‌సీఈఆర్‌టీని దాని ఆరు అనుబంధ విభాగాలతో సహా ఒక ప్రత్యేక వర్గం కింద 'డీమ్డ్ టు బి యూనివర్సిటీ' గా ప్రకటించింది అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఆరు అనుబంధ విభాగాల్లో అజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, మైసూరు, షిల్లాంగ్‌ల్లోని ప్రాంతీయ విద్యా సంస్థలు, అలాగే భోపాల్‌లోని పండిట్ సుందర్ లాల్ శర్మ కేంద్ర వత్తివిద్యా సంస్థలు ఉన్నాయి. పాఠశాల విద్యకు సంబంధించిన అత్యున్నత సంస్థగా ఎన్‌సీఈఆర్‌టీ విద్యా పరిశోధన, ఆవిష్కరణలు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, పాఠ్యపుస్తకాలు, బోధనఅభ్యాసం మెటీరియల్స్ సహా వివిధ రకాల కార్యకలాపాలను నిర్వహిస్తుంది. మూడేళ్ల క్రితం 'డీనోవో' కేటగిరీ కింద ఎన్‌సీఈఆర్‌టీకి 'డీమ్డ్ టు బి యూనివర్సిటీ' హోదా కల్పించాలని కేంద్రం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. డీనోవో డీమ్డ్ యూనివర్సిటీ అనేది ఒక కొత్త సంస్థను డీమ్డ్ టు బి యూనివర్సిటీగా స్థాపించడానికి యూజీసీ దరఖాస్తు చేసుకోగల ఒక సంస్థ. ఇది ఇప్పటికే ఉన్న ఏ సంస్థ అందించని ప్రత్యేకమైన, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అధ్యయనం, పరిశోధన చేపడుతుంది.

## విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు

**చెన్నై:** తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి తూర్పు స్థానా నుంచి నామినేషన్ వేశారు. ఇందుకు సంబంధించి విజయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయ పరిశీలనకు దారితీయవచ్చని భావిస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి తూర్పు అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు విరుద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెరంబూర్‌లో ఇచ్చిన అఫిడవిట్‌లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. అదే తిరుచ్చి తూర్పు కోసం సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. మరోవైపు, ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతా తెరిచామని, ఇందులో లక్ష రూపాయలు ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్‌లో పేర్కొనగా... తిరుచ్చి అఫిడవిట్‌లో మాత్రం రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొన్నట్లు తెలిసింది. ఇలా ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలు దాచిపెట్టడం లేదా తప్పుగా పేర్కొనడం ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన కిందకే వస్తుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

అన్నా డిఎంకె కనుమరుగే

## బిజెపితో పొత్తుపై కనిమొళి

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. నాయకులు ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. తాజాగా బిజెపి అన్నాడిఎంకె పొత్తుపై డిఎంకె ఎంపి కనిమొళి తీవ్ర విమర్శలు చేశారు. బిజెపితో పొత్తు పెట్టుకునే రాజకీయ పార్టీలకు భవిష్యత్తు అంధకారంగా మారిపోతుందన్నారు. డిఎంకె అభ్యర్థి తరఫున ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ డీఎంకే హిందూ వ్యతిరేక పార్టీ అంటూ బిజెపి కూటమి చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు.

# పెట్రో ధరలు పెరిగితే అన్నీ కష్టాలే

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా మధ్య ఘర్షణలు రోజురోజుకూ మరింత ముదురుతున్నాయి. యుద్ధ వాతావరణంతో ప్రపంచ దేశాలు అతలాకుతలమవుతున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక లాంటి దేశాలను సంక్షోభం కుదిపేస్తోంది. ఇప్పటికే ఆయా దేశాల్లో ఇంధనంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. భారత్‌లో మాత్రం ప్రస్తుతానికి ఆ పరిస్థితి కనిపించడంలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే మొట్టమొదట వాహనదారులకు ఖర్చులు తడిసి మోపెడవుతాయి.




పెట్రోల్, డీజిల్ ధరల వల్ల నెలవారీ బడ్జెట్ అస్తవ్యస్తమవుతుంది. ఈ ముప్పు కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా ప్రజా రవాణా (బస్సులు, ఆటోలు) చార్జీలు పెరగడానికి దారితీస్తోంది. తద్వారా సొంత వాహనం లేని వారు సైతం ఈ భారం మోయాల్సి వస్తోంది. వాహనాల విక్రయాలపై ఇంధన ధరల ప్రభావం కనిపిస్తుంది. దీంతో ఆటోమొబైల్స్ రంగం సైతం కుదేలవుతుంది. ఆటోమొబైల్ రంగంలో డిమాండ్ తగ్గి... వాహనాల తయారీ సంస్థలతో పాటు వాటికి విడిభాగాలు సరఫరా చేసే లక్షలాది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోతాయి. డిమాండ్ పడిపోవడం వల్ల ఈ రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల కలిగే అతిపెద్ద 'చైన్ రియాక్షన్' రవాణా ఖర్చులు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతాయి.

దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వస్తువుల సరఫరాకు డీజిల్ తప్పనిసరి. లారీలు, ఇతర రవాణా వాహనాల యజమానులు సరుకు రవాణా చార్జీలు పెంచేస్తారు. దీనివల్ల రోజువారీ వాడే కూరగాయలు, పండ్లు, పాలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయి. ఆర్డర్ చేసే ఫుడ్ నుంచి కొనే ప్రతి వస్తువు వరకు అన్ని ధరలు పెరుగుతాయి. డీజిల్ ధరలు పెరిగితే అది నేరుగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

ధరలు పెరగడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. దీనివల్ల మార్కెట్లో వినియోగం తగ్గి... దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకోవడంలో జాప్యం జరుగుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇంధన ధరలు ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వృద్ధి మందగిస్తుంది.

## న్యాయాధికారుల నిర్బంధం వెనుక బిజెపి : మమత



**కోల్‌కతా:** న్యాయాధికారుల నిర్బంధం వెనుక బిజెపి ఉందని టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే రాష్ట్రంలో అధికారులను బదిలీ చేశారని, అదేవిధంగా ఎన్నికల రోజు అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందని వాపోయారు. మాల్దాలో ఇతర ప్రాంతాల నుంచి దుండగులను తరలిస్తున్నారని, వారి ద్వారా అల్లర్లకు తెరలేపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హజారీపర్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ''మాల్దాలో జరిగిన సంఘటనపై దర్యాప్తును ఎన్ఐఏకి అప్పగించారు, విచారణ బందంలో వాళ్లకు నచ్చిన ముంబై వ్యక్తులను నియమించుకున్నారు. బీజేపీ ప్రతిదీ ప్రణాళిక చేసింది, అయితే ఎన్ఐఏ వారిని పట్టుకోలేక పోయినప్పటికీ, మా సీఐడీ వారిని అరెస్టు చేసింది'' అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ సర్వేతో అనేక మంది ఓటర్లను రాష్ట్రంలో తొలగించారని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను బీజేపీ తనకు అనుకూలంగా ఉంటుందని మండిపడ్డారు.

## అమిత్ షాకు తప్పిన ప్రమాదం

**గువహతి :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రమాదం తప్పింది. అసోం అసెంబ్లీ ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో దుబ్రీ జిల్లా గోలక్‌గంజ్ పర్యటన రద్దు అయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా శుక్రవారం దుబ్రీ జిల్లాలోని రతియాదహాలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభకు హాజరుకావాల్సి ఉంది.

## మోదీకి భయపడ్డాడు : ఆప్

**న్యూఢిల్లీ :** రాజ్యసభలో ఆమ్ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పార్టీ తొలగించడంపై మాటల యుద్ధం నడుస్తోంది. తనను ఆ పదవి నుంచి పక్కనపెట్టడంపై చద్దా వీడియో సందేశం షేర్ చేయగా... దానికి ఆప్ నుంచి సమాధానం వచ్చింది. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఆయన భయపడ్డారని ఆప్ విమర్శించింది. 'రాఘవ్... కొన్నేళ్లుగా మీరు భయపడుతున్నారు. మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారు. మనమంతా అరవింద్ కేజ్రీవాల్ సైనికులం. నిర్భీతే మన ప్రధాన గుర్తింపు. మోదీకి భయపడేవారు... దేశం కోసం పోరాడతారా. సభలో మాట్లాడటానికి లభించే కొద్దిపాటి సమయంలో కీలక అంశాలు లేవనెత్తాలి. దేశాన్ని కాపాడటం కోసం పోరాడాలి. కానీ విమానాశ్రయాల క్యాంటీన్లలో సమోసాల ధరలు తగ్గించడం గురించి మాట్లాడుతున్నారు. గుజరాత్‌లో ఆప్ కార్యకర్తలను అరెస్టు చేశారు. దానిని చద్దా లేవనెత్తలేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా తీసుకువచ్చిన తీర్మానంపై సంతకం చేయడానికి తిరస్కరించారు. పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసినా... ఆయన మాత్రం సభలోనే ఉన్నారు' అని ఆప్ జాతీయ మీడియా చీఫ్ అనురాగ్ దండా విమర్శలు చేశారు. చద్దా ప్రవర్తనతో పార్టీ కార్యకర్తలు అసంతప్తిగా ఉన్నారన్నారు.

# శత్రువు రాడార్‌కు చిక్కని 'తారాగిరి'

నావికాదళంలోకి మరో యుద్ధనౌక

**విశాఖ :** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17 ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ యుద్ధ నౌక ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.




తారాగిరి విశేషాలు పరిశీలిస్తే... 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ వ్యవస్థతోపాటు శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.

### దివంగత ఎమ్మెల్యేల బంధువులను ఎన్నికల బరిలోకి దింపాలనే..

# కాంగ్రెస్ నిర్ణయం సమర్థనీయం

కర్ణాటక సిఎం సిద్ధరామయ్య
'పవర్ షేరింగ్'పై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ

**దావణగెరె (కర్ణాటక) :** అసెంబ్లీ ఉప ఎన్నికలలో దివంగతులైన ఇద్దరు ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులను బరిలోకి దింపాలన్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం సమర్థించారు. వంశపారంపర్య రాజకీయాలు అంటూ బిజెపి చేస్తున్న విమర్శలపై సిద్ధరామయ్య స్పందించారు. రాష్ట్రంలో జరుగబోయే ఉప ఎన్నికలకు అభ్యర్థులను ఎంపికచేయడంలో తమ పార్టీ 'ఒక సాధారణ పద్ధతిని' అనుసరించిందని ఆయన స్పష్టం చేశారు. దావణగెరె సౌత్, బాగల్కోట్ నియోజకవర్గాలకు వరుసగా ప్రాతినిథ్యం వహించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు షామనూర్ శివశంకరప్ప, హెచ్.వై.మేటి మరణించడం వల్ల ఉప ఎన్నికలు అనివార్యం అయ్యాయి. దావణగెరెలో కర్ణాటక మంత్రి ఎస్.ఎస్.మల్లికార్జున్ కుమారుడు శివశంకరప్ప మనవడు సమర్థ్ శామనూర్‌ను, బాగల్కోట్‌లో ఉమేశ్ మేటిని అధికార కాంగ్రెస్ పోటీకి దింపింది. దావణగెరె సౌత్‌లో బిజెపికి చెందిన టి.దాసకరియప్ప, బాగల్కోట్‌లో వీరభద్రయ్య చరంతిమ తలపడనున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ ఒక నాయకుడు మరణించినప్పుడు అతడి కుటుంబ సభ్యుడిని ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహించడానికి అనుమతించడం సాధారణ ఆనవాయితీ అని, ఆ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే పద్ధతిని అనుసరించిందని 'పిటిఐ' వీడియోలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంచేశారు. ఏది ఏమైనప్పటికీ ఏప్రిల్ 9న జరుగనున్న రెండు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా క్లీన్ స్వీప్ చేస్తుందని, నూటికి నూరుశాతం విజయం సాధిస్తామన్న నమ్మకంతో ఉన్నామని సిద్ధరామయ్య వివరించారు.



తమ వర్గానికి చెందిన అభ్యర్థులను నిలబెట్టకపోవడంపై మైనారిటీ ఓటర్లు అసంతృప్తితో ఉన్నారనే వార్తల నేపథ్యంలో వారి మద్దతు కాంగ్రెస్ పార్టీకి కొనసాగుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. మైనారిటీలు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇస్తున్నారని, వారు స్వతంత్రులకు గానీ, బిజెపికి గానీ మద్దతు ఇచ్చే అవకాశం లేదని స్పష్టంచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ వారు కాంగ్రెస్‌తో నిలిచారని, ఈ ఎన్నికలు కూడా భిన్నం కాదని సిద్ధరామయ్య నొక్కి చెప్పారు. ఇతర రాష్ట్రాలలోని ఎన్నికలపై ఆయన వ్యాఖ్యానిస్తూ పలు ప్రాంతాలలో ప్రతిపక్ష పార్టీలు బలంగా రాణించే అవకాశం ఉందన్నారు. అసోం, ఇతర రాష్ట్రాలలో ప్రతిపక్షపార్టీలు తమ సత్తాను చాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బిజెపి అన్నిచోట్లా గెలువకపోవచ్చని ఆయన సమాధానం ఇచ్చారు. దక్షిణాదిలో ప్రధానపోటీ కాంగ్రెస్, బిజెపి మధ్యనే ఉంటుందన్నారు. పశ్చిమబెంగాల్‌లో అధికారపార్టీ అధికారాన్ని నిలబెట్టుకుంటుందని, తమిళనాడులో డిఎంకె గెలుస్తుందని, కేరళలో యుడిఎఫ్ విజయం సాధించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలియజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వాలలో గ్యారెంటీ పథకాలైన 'శక్తి', 'గృహ లక్ష్మి', 'గృహజ్యోతి', 'యువ నిధి' 'అన్న భాగ్య'లను 'సామాజిక పెట్టుబడులు'గా సిఎం అభివర్ణించారు. మూలధన వ్యయంపై విమర్శలను తోసిపుచ్చుతూ కేటాయింపులు క్రమంగా పెరిగాయని వివరించారు. గత సంవత్సరం మూలధన వ్యయం సుమారు రూ.73,200 కోట్లుగా ఉండగా, ఈ సంవత్సరం సుమారు రూ.84,000 కోట్లుగా ఉందన్నారు. ప్రభుత్వం మూలధన ప్రాజెక్టులపై ఖర్చు చేయడంలేదనే ఆరోపణలు అవాస్తవం అన్నారు. రాష్ట్ర ఆర్థిక విషయాలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ ఆదాయ పరిమితులు ఉన్నప్పటికీ కర్ణాటక క్రమశిక్షణ నిబంధనలను పాటిస్తోందని చెప్పారు. ప్రపంచ చమురు సంక్షోభంపై ఆందోళనలను ప్రస్తావిస్తూ ఈ సంక్షోభాన్ని పరిష్కరించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. పవర్ షేరింగ్ సమస్యపై ఆయన మాట్లాడుతూ దీనిపై నిర్ణయాన్ని హైకమాండ్ తీసుకుంటుందని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు.

## ఓటమి కాదు
## రాఘవ్ చడ్డా

**న్యూఢిల్లీ :** రాజ్యసభలో ఆమ్ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్ చద్దా శుక్రవారం స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ... తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 'పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా... ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలు ఎత్తిచూపడం ఏమైనా నేరమా? నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. విమానాశ్రయాల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీచార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే... అది ఆమ్ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది. ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు. ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కానీ, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా' అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు.

# చంద్రుడి దిశగా ఆర్టెమిస్–II

వ్యోమగాముల పయనం

**కేప్ కనావెరల్ (అమెరికా):** నాసా ఆర్టెమిస్–II మిషన్‌లో భాగంగా ఉన్న వ్యోమగాములు తమ ప్రథమ దశను పూర్తిచేశారు. అనంతరం చంద్రుడి దిశగా ప్రయాణాన్ని ప్రారంభించారు. అపోలో యుగం తరువాత దశాబ్దాలుగా భూమి కక్ష్యలోనే పరిమితమైన మానవ అంతరిక్ష ప్రయాణం నుంచి బయటపడుతూ, ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. లాంచ్ అయిన 25 గంటల తర్వాత జరిగిన ట్రాన్స్‌లూనర్ ఇగ్నిషన్ ద్వారా ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడియన్ వ్యోమగామి ఉన్న ఒరియన్ క్యాప్సూల్ భూమి కక్ష్యను విడిచి, సుమారు 4 లక్షల కిలోమీటర్ల దూరంలోని చంద్రుడి వైపు దూసుకెళ్లింది. 1972లో అపోలో–17 తరువాత మొదటిసారిగా మానవులు భూమి కక్ష్యను దాటి ప్రయాణిస్తున్నారని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' అధికారులు తెలిపారు. ఇంజిన్‌లో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యోమగామి జెరెమీ హాన్సన్ మాట్లాడుతూ, భూమి వెనుకకు వెళ్లిపోతుండగా కిటికీల నుంచి కనిపించిన దృశ్యాలు అద్భుతంగా అనిపించాయని చెప్పారు. మిషన్ ప్రారంభానికి ముందు, సుమారు ఒక రోజు పాటు భూమి సమీపంలోనే ఉండి, జీవనాధార వ్యవస్థలను పరీక్షించిన తరువాతనే చంద్రుడి ప్రయాణానికి అనుమతి ఇచ్చారు. కమాండర్ రీడ్ వైజ్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, హాన్సన్ బృందం చంద్రుడి వద్దకు చేరుకుని తిరిగి భూమికి వస్తుంది. చంద్రుడిపై దిగకుండా, దానిని చుట్టి తిరిగి వచ్చే ఈ ప్రయాణంలో వారు ఇప్పటివరకు మానవులు ప్రయాణించిన దూరాన్ని మించనున్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో అత్యధిక వేగాన్ని నమోదు చేసే అవకాశముంది. గ్లోవర్, కోచ్, హాన్సన్ వరుసగా చంద్రుడి దిశగా ప్రయాణించిన తొలి నల్లజాతి, తొలి మహిళ, తొలి అమెరికాయేతర వ్యక్తులుగా చరిత్ర సృష్టించారు. ఈ మిషన్ భవిష్యత్‌లో చంద్రుడిపై స్థిర నివాసాల ఏర్పాటుకు నాసా చేపట్టిన ప్రణాళికలకు పునాది వేస్తోంది. ఈ ప్రయాణంలో భూమి, చంద్రుడి గురుత్వాకర్షణను వినియోగిస్తూ ఫ్రీరిటర్న్ ట్రాజెక్టరీ ద్వారా క్యాప్సూల్ ముందుకు సాగుతోంది. ఇంజిన్ వేగం గంటకు 38,000 కిలోమీటర్లకు పైగా పెంచి కక్ష్య నుంచి బయట పడింది. సోమవారం చంద్రుడి సమీపంగా ప్రయాణించడం తదుపరి కీలక ఘట్టం. చంద్రుడి వెనుక భాగాన్ని సమీపంగా వీక్షించే అవకాశం కూడా లభించనుంది. అంతేకాక, ఈ ప్రయాణంలో సంపూర్ణ సూర్యగ్రహణాన్ని కూడా వ్యోమగాములు ప్రత్యక్షంగా చూడనున్నారు. ఇలావుంటే, మిషన్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. ఒరియన్ క్యాప్సూల్ టాయిలెట్ వ్యవస్థలో లోపం తలెత్తడంతో తాత్కాలికంగా ఇతర పద్ధతులను ఉపయోగించాల్సి వచ్చింది. అలాగే నీటి సరఫరా వ్యవస్థలో సమస్యల కారణంగా, అదనంగా నీటిని నిల్వ చేసుకునే చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత మిషన్ విజయవంతమైతే, 2028 నాటికి చంద్రుడిపై మానవులను దింపే లక్ష్యాన్ని నాసా సాధించాలనుకుంటోంది.





06
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
04-04-2026
www.prajapaksham.in

# ఎడిట్
PEOPLE'S VIEWS

# అమరావతి శిలాక్షరం

ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి అధికారక గుర్తింపు దక్కింది. తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తరువాత పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు స్వంత రాజధానిపై 13 ఏళ్ళుగా ఉన్న అనిశ్చితికి తెరపడింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం – 2014కు సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందడం ద్వారా రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు చేరువైంది. రాష్ట్రపతి సంతకమైన వెంటనే గెజిట్ ప్రకటనతో అది శిలాక్షరమవుతుంది. అంతకుముందు మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రత్యేకంగా సమావేశమై రాజధానిగా అమరావతికి పార్లమెంటు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ (ప్రతిపక్ష వైసిపి గైర్హాజరు నడుమ) ఏకగ్రీవ తీర్మానం చేసింది. టిడిపి, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిన వెంటనే, చకచకా అడుగులు పడ్డాయి. మూడు రోజుల్లోనే పార్లమెంటు రెండవ విడత బడ్జెట్ సమావేశాల్లో ఏప్రిల్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు – 2024ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రవేశపెట్టారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి సహా పలు రాజకీయ పార్టీలు మద్దతుతో మూజువాణి ఓటుతో బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందింది. మరుసటి రోజు (ఏప్రిల్ 2న) రాజ్యసభలో కూడా బిల్లు సర్వామోదం పొందింది. రెండు సభల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాము అమరావతికి వ్యతిరేకం కాదంటూనే, ప్రస్తుత రూపంలో బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వాకౌట్ చేసింది.

ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5లోని సబ్ సెక్షన్ 2లో ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతి ఉంటుందనే పదాలను సవరణ బిల్లు ద్వారా చేర్చారు. తెలంగాణ ఏర్పడిన 2014 జూన్ 2వ తేదీ నుంచి పదేళ్ళ పాటు ఆంధ్రప్రదేశ్‌కు కూడా హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని నాటి చట్టంలో ఉంది. కాబట్టి, తాజా చట్ట సవరణ ద్వారా ఆ పదేళ్ళ గడువు ముగిసిన 2024 జూన్ 2వ తేదీ నుంచే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి కొనసాగనున్నట్లు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణకు సంబంధించిన హామీలు, ప్రయోజనాల విషయంలో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నది. ఇందుకు ముఖ్యకారణం రాష్ట్రంలో బిజెపి లేదా మిత్రకూటమి అధికారంలో లేకపోవటమే. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టానికి ఇప్పటికి రెండు సార్లు సవరణ తీసుకువచ్చింది ఎన్‌డిఎ ప్రభుత్వం. భద్రాచలంలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతూ ఒకసారి, తాజాగా అమరావతి రాజధానిగా చేర్చుతూ రెండవసారి సవరణలు తీసుకువచ్చింది. అమరావతిని రాజధానిగా చట్టబద్ధత కల్పించటంలో ఎవరికీ అభ్యంతరం లేదు కానీ, భద్రాచలం పట్టణంతో భౌగోళిక అనుసంధానం కలిగిన నాలుగు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ఇదే విషయాన్ని చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామ్‌రెడ్డి, రాజ్యసభలో రేణుకాచౌదరి లేవనెత్తారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. రెండు మార్లు ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయంలోనే తమ మిత్రపక్షమైన టిడిపి కోసం వాయువేగంగా సవరణ బిల్లులను కేంద్రం ఆమోదింపజేసింది. కానీ, తెలంగాణ పట్ల శీతకన్ను ప్రదర్శిస్తూనే ఉంది. బిల్లుపై మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ రాజకీయోపన్యాసం చేసారే తప్ప తెలంగాణకు సంబంధించిన నిర్దిష్ట డిమాండ్‌లపై సాంత్వన కల్పించలేదు. తాము విమానాశ్రయాలు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమే సహకరించడం లేదన్నట్లుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లోక్‌సభలో చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎంపి డాక్టర్ మల్లు రవి తిప్పికొట్టారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వచ్చి ప్రధాని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి విమానాశ్రయం సహా, ఇతర అనేక అంశాలపై ఇచ్చిన వినతిపత్రాలు, లేఖల గురించి గుర్తు చేశారు.

2014 నుండి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పలు హామీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. శాసనసభ నియోజకవర్గాల పెంపుపై ఎలాంటి చర్య తీసుకోకుండానే దేశవ్యాప్త నియోజకవర్గాల పునర్విభజనతో ఆ అంశాన్ని కలిపేశారు. జల వివాదాల విషయంలో అపెక్స్ కౌన్సిల్ వేసినప్పటికీ, పరిష్కరింపబడకుండా సాగతీత కొనసాగుతున్నది. ఎయిమ్స్ ప్రకటించినప్పటికీ, అప్పటికే బీబీనగర్‌లో నిర్మాణంలో ఉన్న నిమ్స్‌ను తీసుకొని ఎయిమ్స్ హోదా కల్పించినప్పటికీ, పూర్తిస్థాయి సేవలందించడంలో నత్తనడక నడుస్తున్నది. ఖమ్మం జిల్లాలో ఉక్కు కర్మాగారం వాగ్దానం పడకేసింది. కోచ్ ఫ్యాక్టరీ హామీని మార్చి ఓవర్ హాలింగ్ కేంద్రాన్ని కాజీపేటకు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని, హైదరాబాద్ మధ్య ర్యాపిడ్ రైలు, రహదారి అనుసంధానం కూడా ప్రకటనలకే పరిమితమైంది. తెలంగాణలోని ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలనే డిమాండ్‌ను కేంద్రం పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రానికి రాజ్యాంగబద్ధంగా వచ్చే పన్నుల వాటా, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నిధులను కలుపుకొని తెలంగాణకు తాము రూ.12 లక్షల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప, ఇక్కడ నుంచి పంపే ఒక్క రూపాయి పన్ను నుంచి 41 పైసలే తిరిగి వస్తుందనే వాస్తవాన్ని మరుగు పరచడం బిజెపి నేతలకు అలవాటుగా మారింది. అయినప్పటికీ, తెలంగాణ ప్రజలు 17 లోక్‌సభ స్థానాలలో సగం (8) నియోజకవర్గాలలో గెలిపించినందుకైన కృతజ్ఞత చూపుతూ తెలంగాణకు సంబంధించిన విభజన హామీల అమలు, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు వేగిరంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాలి. ●



## బిజెపి వి విభజన రాజకీయాలు

అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ ప్రజలను తప్పదారి పట్టిస్తోంది. సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తోంది. అనవసర విషయాలపై వివాదాలు సృష్టించి ప్రజలను తప్పదోవ పట్టిస్తోంది. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం తాము మత ఘర్షణలు సృష్టిస్తున్నట్లు ఆరోపణలు చేయడం విడ్డూరం. 2014 నుంచి బీజేపీ సాధించింది ఏమీ లేదు. దేశంలోని ముస్లింలకు తాము వ్యతిరేకం కాదని, చొరబాటుదారులను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెపుతున్నారు. 1985 నుంచి అసోం రికార్డులు పరిశీలిస్తే అన్ని అంశాలు బహిర్గతమవుతాయి. చొరబాటుదారుల పేరుతో హిందూ, ముస్లింలను విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని బిజెపి చూస్తోంది. అసోంలో అధికారంలో ఉన్న బిజెపిని ప్రశ్నించ కుండా ముస్లింలకు కాంగ్రెస్ ఏమీ చేయలేదని ఒవైసీ అనడం సమంజసంగా లేదు.

– సీనియర్ కాంగ్రెస్ నేత పవన్ ఖేరా

## ఘటనల గోలలో మాయమవుతున్న మానవత్వం

ప్రతి ఉదయం పత్రికలు తిరగేసినా, టివి ఛానళ్లను ఆన్ చేసినా, లేదా యూట్యూబ్‌లో వార్తలను వీక్షించినా మన ముందుకు వస్తున్న కథలు దాదాపు ఒకే విధంగా ఉంటున్నాయి. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలు.. అదే సమయంలో పురుషులకు జరుగుతున్న అన్యాయాలు, మానసిక, శారీరక హింసకు సంబంధించిన వార్తలు కూడా వినిపిస్తూనే ఉన్నాయి.

మనకు తెలిసిన సంఘటనలు కేవలం పైపైకి కనిపించే మంచు పర్వతం శిఖరం లాంటివి మాత్రమే. అసలు సమస్య అంతర్గతంగా ఇంకా పెద్దదిగా ఉంది. ఎందరో బాధితులు తమ అనుభవాలను బయటపెట్టలేక మౌనం పాటిస్తున్నారు. కారణాలు అనేకం. కుటుంబ ఒత్తిడి, సమాజపు విమర్శ భయం, న్యాయం దొరకదనే నిరాశ, లేదా వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం. అందువల్ల మనం వినే ప్రతి సంఘటన వెనుక, వినిపించని మరెన్నో బాధలు దాగి ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

ఒక ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు, సమాజం ఒక్కసారిగా మేల్కొన్నట్లు కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఆగ్రహావేశాలు, హ్యాష్‌ట్యాగ్ ఉద్యమాలు, నిరసనలు, ర్యాలీలు ఇవన్నీ కొద్ది రోజులపాటు ఉధృతంగా సాగుతాయి. న్యాయం కోసం గొంతులు ఎత్తబడతాయి. కానీ ఈ స్పందన ఎక్కువ కాలం నిలవదు. కొద్ది రోజుల్లోనే మరో కొత్త ఘటన వార్తల్లోకి వస్తుంది. ప్రజల దృష్టి దానిపై మళ్లుతుంది. పాత సంఘటనలు క్రమంగా మరుగున పడిపోతాయి. బాధితుల కోసం ప్రారంభమైన పోరాటం కూడా మధ్యలోనే ఆగిపోతుంది. ఇది కేవలం సంఘటనల మార్పు కాదు; ఇది మన సమాజపు జ్ఞాపకశక్తి, స్పందన సామర్థ్యం తగ్గిపోతున్న సంకేతం.

ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. కఠినమైన చట్టాలు తీసుకువస్తున్నారు. శిక్షలను పెంచుతున్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా భద్రత, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీలు, సంస్థలు ఏర్పడుతున్నాయి. అయినప్పటికీ, ఈ ఘటనలు పూర్తిగా తగ్గడం లేదు. ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం కేవలం చట్టాల్లో లేదు.

సమస్య యొక్క అసలు మూలం మనుషుల ఆలోచనల్లో, విలువల్లో ఉంది. చట్టాలు భయాన్ని కలిగించగలవు, కానీ అవి మనసులను మార్చలేవు. ఒక వ్యక్తి తప్పు చేయకూడదని నిర్ణయించుకోవడం చట్టం వల్ల కాదు; అది అతని విలువల వల్ల, అతని పెంపకం వల్ల, అతని మనసులో ఉన్న మానవత్వం వల్ల కలుగుతుంది.

ఇప్పటి సమాజంలో వేగంగా మారుతున్న జీవనశైలి, డిజిటల్ ప్రభావం, అసమతుల్యమైన సమాచార వినియోగం, అశ్లీలతకు సులభంగా లభ్యమవుతున్న ప్రాప్యత ఇవన్నీ కూడా మనుషుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. సంబంధాల పట్ల గౌరవం తగ్గిపోవడం, వ్యక్తిని ఒక వస్తువుగా చూడడం, మహిళలను లేదా పురుషులను తక్కువగా అంచనా వేయడం వంటి ధోరణులు పెరుగుతున్నాయి. ఇది ఒక సాంస్కృతిక సమస్యగా మారుతోంది. ఇక్కడ కుటుంబ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే గౌరవం, సమానత్వం, పరస్పర అవగాహన వంటి విలువలను నేర్పించాలి. స్త్రీ అంటే గౌరవం, పురుషుడు అంటే బాధ్యత అనే భావనలు మాటల్లో మాత్రమే కాకుండా, ప్రవర్తనలో కూడా ప్రతిబింబించాలి. అదే విధంగా విద్యాసంస్థలు కూడా కేవలం పాఠ్యాంశాలపై కాకుండా, నైతిక విలువలు, భావోద్వేగ బుద్ధి, లింగ సున్నితత్వం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

మీడియా పాత్ర కూడా అత్యంత ముఖ్యమైనది. కేవలం సంచలనాత్మకంగా వార్తలను చూపించడం కాకుండా, సమస్యల మూలాలను విశ్లేషించి, సమాజంలో చైతన్యం కలిగించే విధంగా వ్యవహరించాలి. ప్రతి ఘటనను టి ఆర్ పి కోణంలో కాకుండా, బాధితుల గౌరవాన్ని కాపాడే విధంగా, పరిష్కార దిశగా ప్రజలను ఆలోచింపజేసే విధంగా ప్రసారం చేయాలి. ఇక సమాజం మొత్తం కూడా తన బాధ్యతను గుర్తించాలి. ఒక సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించడం సరిపోదు. అలాంటి సంఘటనలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. చివరగా, ఒక ముఖ్యమైన విషయం మార్పు ఎప్పుడూ బయట నుంచి రాదు. అది ప్రతి వ్యక్తిలోనూ ప్రారంభమవుతుంది. మన ఆలోచనల్లో, మన మాటల్లో, మన ప్రవర్తనలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే సమాజంలో నిజమైన మార్పు కనిపిస్తుం ది. మన దృక్పథం మారాలి. అదే నిజమైన పరివర్తనకు మార్గం.

**సోరుపాక అనిల్ కుమార్**
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఆధిపత్యంకోసం అమెరికా యుద్ధాలు, సుంకాలు



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

అమెరికా అధ్యక్షుడిగా రెండవ పదవీకాలం చేబట్టిన డోనాల్డ్ ట్రంప్ తమ 14 మాసాల అధికారం కాలంలో అమెరికన్ మిలటరీ కార్యకలాపాలను ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు నాటకీయంగా విస్తరించాడు. ఈ తక్కువకాలంలో అమెరికా సైన్యం కనీసం 7 దేశాల్లో –సోమాలియా, ఇరాక్, ఎమెన్, సిరియా, నైజీరియా, వెనిజులా సహా దాడులు నిర్వహించింది. డ్రోన్ దాడులు, ఎంచుకున్న లక్ష్యాలపై దాడులు, యుద్ధ నౌకల మోహరింపు, మిత్ర రాజ్యాల సైన్యాలతో కలిసి సంయుక్త చర్యలు అమెరికన్ అధికారానికి నిత్య సాధనాలయినాయి. ఈ జోక్యాలకు విస్తరించిన భౌగోళిక ప్రాంతం ఒక ఆందోళనకరమైన పద్ధతిని వెల్లడిస్తున్నది. సైనిక బలాన్ని మరోసారి బలంగా ఉపయోగించటం అమెరికా విదేశాంగ విధానంలో ప్రధాన పనిముట్టుగా మారింది. కల్లోల ప్రాంతాలను అది ఇప్పటికే అస్థిరత, సంఘర్షణలోకి నెట్టింది.

ట్రంప్ ప్రభుత్వం ఈ సైనిక చర్యలతోపాటు, ఆర్థిక వేధింపులను పెద్ద ఎత్తున విస్తరించింది. అందుకు సుంకాలను తీవ్రమైన ఆయుధంగా ఉపయోగించింది. భారత్, కెనడా, మెక్సికో, చైనా, బ్రెజిల్, కొలంబియా, జపాన్, దక్షిణ కొరియా, అనేక యూరప్ దేశాలు సహా 20కి పైగా దేశాలపై వాషింగ్టన్ శిక్షాత్మక సుంకాలు విధించింది లేదా అటువంటి హెచ్చరిక చేసింది. ద్వైపాక్షిక వివాదాలకు మించి, అత్యధిక దేశాలనుంచి దిగుమతులపై గుండుగుత్తగా సుంకాలు విధించింది. బ్రిక్ గ్రూపు వంటి మొత్తం గ్రూపులపై సుంకాల హెచ్చరిక చేసింది. సైనిక దురాక్రమణ, వాణిజ్య యుద్ధం ఏకకాలంలో ప్రయోగించటం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రస్తుత దశలో ఆవిర్భవిస్తున్న తర్కాన్ని బట్టబయలు చేస్తున్నది. భౌగోళిక రాజకీయ నియంత్రణకోసం ఆర్థిక ఒత్తిడి, సైనిక బెదిరింపు సాధనాలుగా ఉపయోగిస్తున్న దశ ఇది.

ఈ పరిణామాలు ఏదో ఒక ప్రభుత్వ చేష్ట కాదు. అవి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న లోతైన వ్యవస్థాగత సంక్షోభానికి ప్రతిబింబం. అమెరికాలోపల, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు విశాలమైన కేంద్రాల్లో ఉత్పాదకత వృద్ధి నెమ్మదించింది, వేతనాలు ప్రతిష్టంభనలో పడ్డాయి, పెట్టుబడిపై తిరుగురాబడి తరుగుతున్నది. వ్యవస్థలోపల అంతర్గత వైరుధ్యాలు తీవ్రతరమవుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో సంక్షోభాన్ని బయట దేశాలకు విస్తరించే ప్రవృత్తి పెరుగుతుంది. దేశంలో ఆర్థిక ప్రతిష్టంభన విదేశాల్లో వ్యూహాత్మక ఆధిపత్యం ద్వారా భర్తీ చేయబడుతున్నది. యుద్ధాలు, ఆంక్షలు, బలవంతపు వాణిజ్య ఏర్పాట్లు, ప్రభుత్వాలను మార్పు చేసే చర్యలు – ఇటువంటి పద్ధతుల ద్వారా వ్యవస్థ తన మనుగడను కొనసాగించే ప్రయత్నాలు చేస్తుంటుంది.

వ్లదీమిర్ లెనిన్ మహాశయుడు వందేళ్లకు పూర్వమే, 'సామ్రాజ్యవాదం' అన్న తన ప్రసిద్ధ గ్రంథంలో ఈ లక్షణాన్ని విశ్లేషించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ దాని అత్యున్నత దశకు చేరినపుడు, అది ఇతోధిక లాభాల అన్వేషణలో తన పెట్టుబడిని తన సరిహద్దుల ఆవలకు ఎగుమతి చేయటం ఆరంభిస్తుంది. వెలుపలి దేశాలకు ఈ ఎగుమతి అనివార్యంగా సామ్రాజ్యవాదుల మధ్య శత్రుపూరిత పోటీని, బలహీనమైన దేశాలపై ఆధిపత్యాన్ని, పదేపదే సైనిక సంఘర్షణలను కలుగజేస్తుంది. ఆ విశ్లేషణ నేడు మరింత సంగతంగా పునరుద్ధరణ పొందుతున్నది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లోపల ఉత్పాదక పెట్టుబడి అవకాశాలు కుదించుకపోయినపుడు, సామ్రాజ్యకేంద్రాలు వనరులపై, మార్కెట్లు, వ్యూహాత్మక భూభాగాలపై భౌగోళిక రాజకీయ నియంత్రణపై ఆధారపడటం పెరుగుతుంది.

అయితే ప్రస్తుత సందర్భంలో, ఈ క్రమం మరింత ప్రమాదకరమైన రూపం తీసుకుంది. సామ్రాజ్యవాద కేంద్రం ఇంకెంతమాత్రం కేవలం పెట్టుబడినే ఎగుమతి చేయటంలేదు. అది యుద్ధాన్ని ఎగుమతిచేస్తున్నది. సైనిక సంఘర్షణ లాభసాటి వ్యవహారంగా మారింది. అతిపెద్ద మిలటరీ పారిశ్రామిక సముదాయాలు ఎడతెగని యుద్ధం నుండి లాభపడతాయి. అనంతంగా ఆయుధాలు ఉత్పత్తి చేస్తుంటాయి, సరఫరా చేస్తుంటాయి, ఆధునీకరిస్తుంటాయి. ప్రజాస్వామ్యాన్ని రక్షించే పేరుతో, మిత్ర రాజ్యాలను కాపాడే పేరుతో లేదా టెర్రరిజం పేరుతో యుద్ధాలు సమర్థన పొందుతూ ఉంటాయి. ఈ పదగుంభన ప్రచారం వెనుక ఉంది లాభాలార్జించే విస్తారమైన యంత్రాంగం. సంఘర్షణలను రగిలించేటటువంటి రాజ్యాలే అమెరికా మిలటరీ టెక్నాలజీ, సరఫరా వ్యవస్థల తోడ్పాటుపై ఆధారపడి ఉన్న ప్రభుత్వాలకు, మిత్ర రాజ్యాలకు ఆయుధాలు సరఫరా చేస్తాయి.

అమెరికా, ఇజ్రాయెల్ అలయెన్స్ నేడు ఈ దురాక్రమణ పూరిత సామ్రాజ్యవాద వ్యవస్థకు ఎంతో స్పష్టమైన ముఖానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. పశ్చిమాసియా వ్యాప్తంగా, పదేపదే సైనికచర్యలు, గురిపెట్టిన హత్యలు, అంతర్జాతీయ న్యాయసూత్రాలను బాహాటంగా అలక్ష్యం చేయటం ఈ ప్రాంతాన్ని అంతులేని చక్రగతి హింసలోకి నెట్టింది. భద్రత, సుస్థిరత పేరుతో మొత్తం సమాజాలను నాశనం చేశారు. జనసాంద్రత ఉన్న నగరాలపై బాంబులు పడుతున్నపుడు, స్కూలు పిల్లలు చనిపోతున్నపుడు, పౌరజనాభా పదుల లక్షల్లో స్వస్థలాల నుండి గెంటివేయబడుతుంటే విముక్తి, మానవతా జోక్యాల గూర్చిన వాగాడంబరం బోలుగా ధ్వనిస్తుంది.

**రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన అంతర్జాతీయ వ్యవస్థాగత చట్రం దాదాపుగా కుప్పకూలటాన్ని కూడా ఈ క్షణం వెల్లడిస్తున్నది. ఐక్యరాజ్య సమితి వ్యవస్థకు ఎన్ని పరిమితులు, వైరుధ్యాలున్నప్పటికీ అది ఒకప్పుడు ప్రపంచ వేదికగా పనిచేసింది. దేశాలు చర్చలు జరిపేవి, దౌత్యం ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించేవి. ఆ వ్యవస్థ నేడు నిరుపయోగంగా తయారవుతున్నది. శక్తిమంతమైన రాజ్యాలు అవి కావాలనుకున్నప్పుడు అంతర్జాతీయ సంస్థలను దాటివేస్తున్నాయి. యుద్ధం–శాంతికి సంబంధించిన నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకుంటున్నారు, బలప్రయోగంతో విధిస్తున్నారు. శక్తిమంతమైన రాజ్యాలు సంయమనం పాటించకుండా వ్యవహరిస్తున్నందున అంతర్జాతీయ చట్టం అథారిటీ నిలకడగా హరించుకుపోతున్నది.**

పశ్చిమ దేశాల నాయకులు ఇటీవల చేసిన ప్రకటనలు ఈ పతనాన్ని విస్పష్టం చేస్తున్నది. అమెరికా–ఇరాన్ సంఘర్షణను అంతర్జాతీయ చట్టం లెన్స్ నుంచి అంచనా వేయటం అర్థరహితమని వ్యాఖ్యానించారు జర్మనీ ఛాన్సలర్. పశ్చిమ నాయకులు ఒకనాడు ప్రపంచం ముందు ఛాంపియన్ చేసిన లీగల్ నియమాలు, సూత్రాలనే ఇవాళ ఎంతగా ఏవగించుకుంటున్నారో అటువంటి వ్యాఖ్యలు వెల్లడిస్తున్నాయి. వారు తమకు అనుకూలంగా ఉన్న సందర్భంలో అంతర్జాతీయ చట్టాన్ని బయటకు తీస్తారు, ఇబ్బందిగా ఉన్నపుడు దాన్ని త్రోసిపుచ్చుతారు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆవిర్భవించినటువంటి ప్రపంచ వ్యవస్థ మన కళ్లెదుటే విచ్ఛిన్నమవుతున్నది. బహుళపక్ష విభజన దిశగా క్రమంగా ప్రయాణిస్తున్న ప్రపంచంతో యునైటెడ్ స్టేట్స్ ఘర్షణపడుతున్నది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు తమ ఉనికిని నిలదొక్కుకొంటున్నాయి. ప్రాంతీయ రాజ్యాలు ఇతోధిక వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కోరుతున్నాయి. ప్రపంచ సంస్థలు, ద్రవ్య వ్యవస్థలపై పశ్చిమదేశాల గుత్తాధిపత్యానికి సవాలు పెరుగుతున్నది. కచ్చితంగా ఈ పరివర్తనే అమెరికన్ రాజ్యం ప్రస్తుత దుందుడుకు వైఖరికి మూలం.

తిరుగులేని ఆధిపత్యానికి కోతను ఎదుర్కొంటున్న అమెరికా తమ పెత్తనం నిలబెట్టుకునేందుకు, ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థను రక్షించుకునేందుకూ బరితెగింపు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆధిపత్యం కొనసాగించేందుకు సైనిక జోక్యాలు, ఆర్థిక ఆంక్షలు, సుంకాల యుద్ధాలు, బరితెగింపులతో కూడిన దౌత్యాన్ని అది సాధనాలుగా ఉపయోగిస్తున్నది. దాని ధ్యేయం సుస్థిరత కాదు, నియంత్రణ. లక్ష్యం సహకారం కాదు ఆధిపత్యం.

ట్రంప్ అనుసరిస్తున్న పద్ధతి ప్రచ్ఛన్న యుద్ధకాలంనాటి కార్యసరళికి పూర్తి భిన్నం. ఆనాడు ప్రపంచం అమెరికా, సోవియట్ యూనియన్ శిబిరాల మధ్య దాదాపుగా విభజితమైంది. శత్రుత్వం ఉద్రిక్తతలకు, ప్రాక్సీ సంఘర్షణలకు దారితీసినా, ప్రత్యర్థి పక్షాలు కొంత సంయమనం విధించుకున్నాయి. రాజ్యాల బలాల మధ్య సమతుల్యం విస్తరణకు పరిమితులు విధించినందున ప్రధాన రాజ్యాల మధ్య ప్రత్యక్ష యుద్ధాలు చాలావరకు నివారించబడినాయి. ప్రస్తుత కాలంలో ఆ సంయమనాలు నాటకీయంగా బలహీనపడ్డాయి. ఆధిపత్య సామ్రాజ్యవాద రాజ్యం అర్థవంతమైన అదుపులు లేకుండా వ్యవహరించడం పెరిగింది. సారూప్య శిబిరాల మధ్య శత్రుత్వానికి బదులు, ఏకైక రాజ్యం మిలటరీశక్తి పెక్కు ప్రాంతాల్లో ఏకపక్షంగా బలాన్ని ప్రయోగించటాన్ని ప్రపంచం ఇవాళ చూస్తోంది. బలహీనమైన దేశాలపై యుద్ధాలు విధిస్తూ వాటి ప్రజలను వినాశకర పర్యవసానాల్లోకి నెడుతున్నది.

అమెరికా సమాజంలోని అంతర్గత వైరుధ్యాలు ఈ వ్యవస్థ నైతిక దివాళాకోరుతనాన్ని మరింతగా బట్టబయలు చేస్తున్నది. ప్రపంచమంతటా యుద్ధాలకు దన్నుగా, సైనిక శిబిరాల నిర్వహణకు అమెరికా వందల బిలియన్‌ల డాలర్లు వెచ్చిస్తున్నది. అదే సమయంలో తన సొంత ప్రజలకు 'సార్వత్రిక వైద్య సంరక్షణను' హామీ ఇవ్వటాన్ని తిరస్కరిస్తున్నది. విదేశాల్లో యుద్ధం, విధ్వంసం కోసం అపారమైన వనరులను వెచ్చిస్తుండగా, కోట్లమంది అమెరికన్‌లు వైద్య రుణంతో, గృహవసతి లేక, తరుగుతున్న సామాజిక భద్రతలతో పోరాడుతున్నారు. వ్యవస్థలోని కంపు ఆ రాజకీయవేత్తల నడవడికలో కూడా వెల్లడవుతున్నది. జెఫ్రీ ఎప్‌స్టీన్ చుట్టూ బయటపడుతున్న సెక్స్ కుంభకోణాలు, డోనాల్డ్ ట్రంప్ సహా ఘనతవహించిన పెద్దల ప్రమేయాలు వెల్లడికావటం కేవలం వ్యక్తిగత వివాదాలు కావు; జవాబుదారీతనంలేని రాజకీయ తరగతి లోతైన మానసిక పతనానికి నిదర్శనం.

ఈ సామ్రాజ్యవాద వ్యవస్థ పర్యవసానాలు మిగతా ప్రపంచానికి చాలా తీవ్రంగా ఉంటాయి. సైనిక సంఘర్షణలు వాణిజ్య మార్గాలను విచ్ఛిన్నం చేస్తాయి. మౌలిక వసతులను ధ్వంసం చేస్తాయి, మానవ విషాదాలను కలుగజేస్తాయి. ఇంధన మార్కెట్లు అస్థిరమవుతాయి. ఆహార భద్రతకు ముప్పు కలుగుతుంది. యావత్ జనాభా నిర్వాసితులవుతారు. చారిత్రకంగా దోపిడీ భారాన్ని ఇప్పటికే అనుభవిస్తున్న ప్రాంతాలు మరింత లోతైన సంక్షోభంలో కూరుకుపోతాయి. అదేసమయంలో పెట్టుబడిదారీ అభివృద్ధిలోని అసమతుల్య స్వభావం పెట్టుబడిదారీ శిబిరంలో కూడా విభజనలు సృష్టిస్తుంది. నాటో విస్తరణకు రష్యా అడ్డుకట్ట వేసింది, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని నాటో సభ్య రాజ్యాల్లో కొన్ని విమర్శిస్తున్నాయి. కాగా పెట్టుబడి తర్కం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విస్తరణ కారణంగా ప్రపంచ వాతావరణం అరాచకంగా ఉంది.

*(ఇంకావుంది)*

## రక్షణ పేరిట ట్రాన్స్‌జెండర్లకు సంకెళ్లు!

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వాన్ని, స్వేచ్ఛను, ఆత్మగౌరవంతో జీవించే హక్కు ను ప్రసాదించింది. కానీ, దురదృష్టవశాత్తు ఇటీవల పార్లమెంటు ఆమోదించిన 'ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ)సవరణ బిల్లు, 2026' ఆ హక్కులన్నింటినీ కాలరాసేలా ఉందని మానవ హక్కుల కార్యకర్త గోపి శంకర్ మదురై తన కథనంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చట్టమైనా బాధితులకు అండగా ఉండాలి, కానీ ఈ కొత్త సవరణలు వారి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తూ, వారిని మరింత వివక్షకు గురిచేసే లా ఉన్నాయి. ఈ బిల్లులో ఉన్న అతి పెద్ద లోపం 'ట్రాన్స్‌జెండర్' అనే పదానికి ఇచ్చిన అత్యంత సంకుచితమైన నిర్వచనం. కేవలం హిజ్రా, కిన్నెర, అరవాణి వంటి కొన్ని సాంస్కృతిక గుర్తింపులు ఉన్నవారిని లేదా పుట్టుకతోనే శారీరక లింగ మార్పులు ఉన్నవారిని మాత్రమే ఈ చట్టం పరిగణనలోకి తీసుకోవడం వల్ల, సమాజంలో ఉన్న వివిధ రకాల లైంగిక ధోరణులు, లింగ గుర్తింపులు కలిగిన లక్షలాది మంది వ్యక్తులు ఈ చట్టం కల్పించే కనీస రక్షణకు కూడా దూరం అవుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను నేరుగా ఉల్లంఘించడమే కాకుండా, ఒక వర్గాన్ని సమాజం నుండి వేరు చేసి చూసేలా ఉంది.

ముఖ్యంగా ఈ బిల్లులో 'ఇంటర్‌సెక్స్' మరియు 'ట్రాన్స్‌జెండర్' అనే రెండు పూర్తిగా భిన్నమైన అంశాలను ఒకే గాటన కట్టడం ఒక ఘోరమైన శాస్త్రీయ తప్పిదం. ఇంటర్‌సెక్స్ అనేది ఒక వ్యక్తి యొక్క శారీరక లేదా జీవసంబంధమైన స్థితికి సంబంధించింది, అంటే పుట్టుకతోనే వారి క్రోమోజోములు లేదా అనాటమీలో వైవిధ్యం ఉండటం. కానీ ట్రాన్స్‌జెండర్ అనేది ఒక వ్యక్తి యొక్క అంతర్గత మానసిక గుర్తింపు. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించకపోవడం వల్ల, చిన్న వయసులోనే ఇంటర్‌సెక్స్ శిశువులపై వైద్యులు చేసే అనవసరమైన 'నార్మలైజింగ్' శస్త్రచికిత్సలను ఈ బిల్లు అరికట్టలేకపోతోంది. అటువంటి శస్త్రచికిత్సలు ఆ పిల్లల ప్రాథమిక హక్కులను కాలరాయడమే కాకుండా, వారి భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తాయి. ఈ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడంలో మన చట్టసభలు విఫలమయ్యాయి. శస్త్రచికిత్సకు ముందు సరైన జెనెటిక్ కౌన్సెలింగ్ లేదా సైకో సోషల్ విశ్లేషణ వంటి నిబంధనలు లేకపోవడం వల్ల ఈ వ్యక్తులు వైద్యపరమైన హింసకు గురయ్యే ప్రమాదం ఉంది.

మరో కీలకమైన అంశం ఏమిటంటే, 2014 నాటి చారిత్రాత్మక 'నల్సా' తీర్పులో సుప్రీంకోర్టు కల్పించిన 'స్వీయ గుర్తింపు' హక్కును ఈ సవరణ బిల్లు పూర్తిగా తుంగలో తొక్కింది. ఒక వ్యక్తి తనను తాను ఏ లింగంగా గుర్తించుకుంటున్నారో చెప్పుకునే స్వేచ్ఛను హరించి, దాని స్థానంలో జిల్లా మేజిస్ట్రేట్, ఒక మెడికల్ బోర్డు ఇచ్చే సర్టిఫికేట్‌ను తప్పనిసరి చేశారు. ఒక వ్యక్తి తన ఆత్మగౌరవాన్ని నిరూపించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, వైద్య పరీక్షలకు గురికావడం అనేది అత్యంత అవమానకరమైన విషయం. ఇది వ్యక్తుల గోప్యత ను దెబ్బతీయడమే కాకుండా, వారిపై అధికారులు, వైద్య సిబ్బంది వివక్ష చూపే అవకాశం కల్పిస్తోంది. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఒక వ్యక్తి యొక్క లింగ గుర్తింపును ఇతరులు లేదా ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయించడం అనేది అప్రజాస్వామికమైన చర్య. దీనివల్ల ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు నిరంతరం తమ అస్తిత్వాన్ని నిరూపించుకోవాల్సిన ఒత్తిడికి గురవుతున్నారు.

అంతేకాకుండా, దశాబ్దాలుగా కొనసాగుతున్న 'హిజ్రా జమాత్ ఘరానా' వంటి వ్యవస్థలలో ఉన్న అంతర్గత దోపిడీని అరికట్టే దిశగా ఈ బిల్లులో ఎటువంటి స్పష్టమైన నిబంధనలు లేవు. గురువులు తమ శిష్యుల సంపాదనపై పూర్తి నియంత్రణ కలిగి ఉండటం, వారిని ఒక రకమైన బంధిత కార్మికులుగా మార్చడం వంటి సామాజిక రుగ్మతలను కేవలం శిక్షలను పెంచడం ద్వారా పరిష్కరించలేము. చట్టం అనేది కేవలం నేరస్థులను శిక్షించేదిగా మాత్రమే కాకుండా, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక భద్రతను కల్పించేదిగా ఉండాలి. కానీ ఈ బిల్లు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వివాహ హక్కులు, దత్తత తీసుకునే స్వేచ్ఛ, వారసత్వ ఆస్తిలో వాటా లేదా విడాకులు వంటి కీలకమైన పౌర హక్కుల గురించి అసలు మాట్లాడకపోవడం విచారకరం. చట్టపరమైన గుర్తింపు లేకపోవడం వల్ల వీరు సమాజంలో అట్టడుగున మిగిలిపోతున్నారు.

ముగింపుగా, ఈ సవరణ బిల్లు శాస్త్రీయ దృక్పథం కంటే పాతకాలపు భావజాలంతో రూపొందించబడినట్లు కనిపిస్తోంది. దళిత, గిరిజన లేదా వికలాంగులైన ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఎదుర్కొనే బహుళ అంచెల వివక్షను (Intersectionality) ఈ చట్టం పూర్తిగా విస్మరించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) సూచనలను, మానవ హక్కుల విలువలను పరిగణనలోకి తీసుకుని, ఈ బిల్లును వెంటనే పునర్ సమీక్షించాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌జెండర్ సమాజాన్ని కేవలం సానుభూతితో చూడటం కాకుండా, వారిని సమాన పౌరులుగా గుర్తించి, వారి భాగస్వామ్యంతోనే సమగ్రమైన చట్టాలను రూపొందించినప్పుడే రాజ్యాంగం ఆశించిన సామాజిక న్యాయం చేకూరుతుంది. ఈ 'నిర్లక్ష్యపు వివక్ష' (Omissive discrimination) తొలగిపోయినప్పుడే ఆ వర్గాలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని, లేనిపక్షంలో ఈ చట్టం రక్షణ కంటే వారిని అణచివేయడానికే ఎక్కువ ఉపయోగపడుతుందని గోపి శంకర్ మదురై ఈ వ్యాసం ద్వారా హెచ్చరించారు.

**వెంకగారి భూమయ్య**

## విటమిన్ 'సి' పై అవగాహన అవసరం

భారతదేశంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 4న విటమిన్ సి దినోత్సవంను జరుపుకుంటారు. ఈ రోజు మన ఆరోగ్యానికి విటమిన్ సి ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటైంది. ఆధునిక జీవనశైలిలో పోషకాహార లోపాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో, విటమిన్ సి ప్రాధాన్యతను గుర్తుచేసే అవసరం మరింత పెరిగింది. విటమిన్ 'సి' ను అస్కార్బిక్ యాసిడ్ అని కూడా పిలుస్తారు. ఇది మన శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషక పదార్థాలలో ఒకటి. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మన శరీరాన్ని రక్షించడంలో విటమిన్ సి సహాయపడుతుంది. అంతేకాకుండా, గాయాలు త్వరగా మానడానికి, చర్మం ఆరోగ్యంగా ఉండడానికి కూడా ఇది ఉపయోగం. భారతదేశంలో విటమిన్ 'సి' దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య సంస్థలు ఈ రోజున ప్రత్యేక సదస్సులు, ప్రచార కార్యక్రమాలు చేపడతాయి. పండ్లు, కూరగాయల ప్రాముఖ్యతను వివరించి, రోజువారీ ఆహారంలో వీటిని చేర్చాలని సూచిస్తారు. విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలలో నిమ్మకాయ, నారింజ, మోసంబి, ఉసిరికాయ, టమోటా, క్యాప్సికమ్ వంటి పండ్లు, కూరగాయలు ఉన్నాయి. ముఖ్యంగా ఉసిరికాయలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. వీటిని నిత్యం తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. విటమిన్ సి లోపం వల్ల స్కర్వీ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి వల్ల దంతాలు బలహీనపడటం, దేహంలో నిస్సత్తువ, చర్మ సమస్యలు వంటి సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల సరైన పోషకాహారం తీసుకోవడం చాలా అవసరం. మొత్తానికి విటమిన్ సి దినోత్సవం మనకు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని గుర్తు చేస్తుంది. సరైన ఆహార అలవాట్లు పాటించడం ద్వారా మనం అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో విటమిన్ C ఉన్న పదార్థాలను చేర్చుకుని ఆరోగ్యంగా జీవించాలి.

**ఆళవందార్ వేణు మాధవ్**



## ఇందిరమ్మ చీరలు పంపిణీ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని 12వ డివిజన్‌లో ఇందిరమ్మ చీరలను మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. శుక్రవారం డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ ముఖ్య అతిథిగా హాజరై లబ్దిదారులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారని ఇప్పుడు నగరంలోని మహిళలకు కూడా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు, సరిపూడి సతీస్, ఆలస్యం శేఖర్, బండి వెంకటేశ్వరరావు, మూలగుండ్ల వేణు, బాల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భర్త అవయవాలు దానం



ప్రజాపక్షం/ఖమ్మం : ఓ మహిళా జర్నలిస్టు విపత్కర పరిస్థితుల్లోనూ మరొకరికి సహాయ పడాలన్న సదుద్దేశంతో తన భర్త అవయవాలను దానం చేసింది. వివరాల్లోకి వెళితే... పాపినేని అనంతలక్ష్మి డిజిటల్ మీడియాలో జర్నలిస్టుగా పనిచేస్తుండగా ఆమె భర్త పాపినేని నాగేశ్వరరావు విత్తన కంపెనీలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. వీరిది తల్లాడ మండలం కలకొడిమ గ్రామం ఇటీవల నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించి వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వైద్యుల సూచన మేరకు అనంతలక్ష్మి తీవ్ర దుఃఖంలోనూ అవయవాలను దానం చేయాలని నిర్ణయించుకుంది. తన భర్త అవయవాల దానం ద్వారా మరికొందరికి జీవితం ప్రసాదించాలన్న అనంతలక్ష్మి ఆలోచనను పలువురు ప్రశంసించారు. నాగేశ్వరరావు అనంతలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

## గిరిజనాభివృద్ధే ధ్యేయం

### ఐటిడిఏ పిఒ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను గిరిజనుల దరిచేర్చి వారిని అభివృద్ధి పర్చడమే ఐటిడిఏ ప్రధాన ధ్యేయమని, ఇక్కడి సిబ్బందికి అందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఐటిడిఏ పాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో గ్రూప్ 1 శిక్షణ డిప్యుటీ కలెక్టర్లు రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసినందున వారితో పిఒ ప్రత్యేకంగా ముచ్చటించారు. జిల్లా కలెక్టర్ సముదాయంలో ఎన్ని కార్యాలయాలు ఉంటాయో ఐటిడిఏలో కూడా అన్ని కార్యాలయాలు ఉంటాయని, ఐటిడిఏ మినీ కలెక్టరేట్ వంటిదని చెప్పారు. ఈ కార్యాలయం గిరిజనాభివృద్ధి , గిరిజన విద్యాభివృద్ధి, గిరిజన గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాలు, గురుకులాలు, తదితర విద్యాలయాల ద్వారా 35వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. కొండరెడ్ల విభాగం కోసం ప్రత్యేక కృషి జరుగుతుందని, క్రీడా పాఠశాలల, బిఇడి, డిఇడి కాలేజీ నడుస్తున్నాయని తెలిపారు. గిరిజన విద్యాలయాల్లో చదివిన పిల్లలు ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ సీట్లు సాధించారని, పలువురి విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. ట్రైకార్ ద్వారా గిరిజనులకు రుణాలు అందించి వారి భవిష్యత్ తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుందన్నారు. పలు విధాలుగా గిరిజనాభివృద్ధికి ఐటిడిఏ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలను పలోపతం చేసి వారి ద్వారా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రచించామని, సోప్, షాంపులతో పాటు, మిల్లెట్ బిస్కెట్ తయారీ, విక్రయాలు, భద్రగిరి మార్ట్ వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భార్యకు మెసేజ్ చేస్తున్నాడని భర్త దాడి

### కత్తితో గొంతుపై దాడి, తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : భార్యకు మెసేజ్ చేస్తున్నాడనే అనుమానంతో యువకుడిపై భర్త కత్తితో దాడి చేసి సంఘటన ఖమ్మంరూరల్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గోళ్లపాడు గ్రామానికి చెందిన శివ అతని ఇంటి పక్కన నివాసించే కుక్క మునేష్ ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు. వీరిరువురూ కలిసి తల్లంపాడులో ఓ సైట్‌లో ట్రాక్టర్‌లతో మట్టి తోలుతున్నారు. ఈనెల 2వ తేదీన మునేష్, అతని భార్యకు మధ్య గొడవ జరిగింది. అక్కడి నుంచి కోపంగా తల్లంపాడులోని సైట్ వద్దకు వెళ్లి నా భర్యకు ఎందుకు మేసేజ్ చేస్తున్నావ్ అంటూ గొడవపడ్డాడు. అక్కడి నుంచి తన బైక్‌పై శివాను తీసుకొని ఆరెకోడుతండా వద్ద ఎవరూ లేని ప్రదేశంలో బైక్ ఆపి కత్తితో దాడిచేశాడు. ఈ క్రమంలో అక్కడి నుంచి తప్పించుకొని, గునిగంటి లక్ష్మయ్య అనే వ్యక్తి ఫోన్ తీసుకొని తమ్ముడు త్రినేష్‌కు కాల్ చేశాడు. అతను వెంటనే అక్కడికి చేరుకొని 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. హత్యాయత్నానికి పాల్పడటంతో గొంతు, కుడిచెవి, రెండు చేతులకు బలమైన గాయాలయ్యాయని తల్లి ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఒ ముష్క రాజు తెలిపారు.

## ఖమ్మంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా కథోలిక్ చర్చ్ ఆధ్వర్యంలో 40 రోజులు దీక్ష తీసుకున్న వారితో ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్, జెడ్పి సెంటర్, ఎన్‌టిఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్, కరుణగిరి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఏసుప్రభువు సిలువపై ఉన్న వేషధారణతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ నగిలి ప్రకాష్ మాట్లాడుతూ దైవకుమారుడైనప్పటికీ ఏసుక్రీస్తు మానవుని వల్ల బాధలు పడి రక్షణ కోసం ప్రాణాలు అర్పించారన్నారు. క్షమాపణ పంచి త్యాగం చేసిన వ్యక్తి ఏసుక్రీస్తు అని బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపి అందరికీ పరలోక దీవెనలు అందించిన దైవకుమారుడన్నారు. అనంతరం కరుణగిరిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువకులు ఏసుప్రభు పాత్ర, మేరీమాత వేషధారణలు, భక్తి ఉపన్యాసాలు, గేయాలతో యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాదర్ లూ ఎస్ ఐజాక్, జ్ఞానేష్, జయరాజు, గోవా శౌరయ్య, టి.అంటోని, జి. సురేష్, ఏసురాజు, రాజు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు సర్కార్ ప్రోత్సాహకం

### ఆశాజనకంగా పామాయిల్ ధర
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతుల కృతజ్ఞతలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తెలిపారు. రైతులు పంటమార్పిడి విధానాన్ని అవలంభించాలని ఆయన తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బాలపేటలో గల పామాయిల్ క్షేత్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మానుకొండ రాధాకిషోర్ మాట్లాడుతూ స్వతహాగా రైతు అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పంటల మార్పిడి విధానాన్ని అవలంభించాలని సూచిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో మిర్చి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు పండించిన సమయంలో ఉన్న ధర ఇప్పుడు ఉన్న ధరలో ఎటువంటి వ్యత్యాసం లేదని, కానీ పెట్టుబడులు మాత్రం గణనీయంగా పెరిగాయన్నారు. పామాయిల్ సాగుపై రైతులు దృష్టిసారించాలని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభిస్తుందని, పామాయిల్ సాగులో మూడేళ్ల పాటు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం కూడా రాయితీలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. పాలేరు భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా తిరుమలాయపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలంలో సాగునీటిని అందించేందుకు రూ.70 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా అన్ని చెరువులకు కృష్ణా నీటిని తరలించి సాగునీటిని అందిస్తున్నారన్నారు. రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్ మండలంలో రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలని తెలిపారు.

గతంలో మార్కెటింగ్ ఉండేది కాదని ఇప్పుడు కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారని రఘునాథపాలెం ప్రాంతంలో కూడా పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ ధర కూడా టన్ను రూ.23,000 ఉందని, ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మండలంలో వేబ్రిడ్జి నిర్మాణం, వ్యవసాయ పనిముట్లు, రైతులకు సంబంధించి పలు సమస్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు. పామాయిల్ ధర పెంచేందుకు కృషి చేయడంతో పాటు రైతులకు తోడ్పాటునందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు ఈ సందర్భంగా రైతాంగం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, తమ్మిని నాగేశ్వరరావు, కేతినేని సీతారామయ్య, మందడపు భాస్కర్‌రావు, కుర్రా భాస్కర్‌రావు, భూక్యా రామచంద్రు, తావుర్యా నాయక్, కుర్రా మహేష్, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



## జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి : కలెక్టర్ అంకిత్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిలాల్లో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో భాగంగా ప్రతీ ఇంటికీ వెళుతూ ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేసరణ జరగాలని ఆయన సూచించారు. ఇందు కోసం 1వ తేది నుండి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో కలెక్టర్ పాల్గొని ఫీల్డు స్థాయిలో పనిచేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్.శివరామకృష్ణ, డా.పి సుస్మిత రజని పాల్గొని 34 మంది ఫీల్డ్ ట్రైనీలకు జనగణన నిర్వహణ విధానంపై, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతులు వినియోగం తదితర అంశాలపై శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా మూడవ రోజు కలెక్టరేట్ సమీపంలోని పాలకొయ్యతండ ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమం కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సిఇఓ సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ శ్రీజ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : దొడ్డి కొమరయ్య జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ పాల్గొని కొమరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బిసి సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, వివిధ సంఘాల నాయకులు గంగయ్య, చావళ్ల నాగేశ్వరరావు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, గుడె మల్లయ్య, శోభానాయక్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సాధిక్ అలీ, సుగుణారావు, నాగరాజు, గంగరాజు, బ్రహ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

## ‘ఎస్‌బిఐటి’లో అట్టహాసంగా అరోహన్

### ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి అటానమస్ కళాశాలలో అరోహన్ 2026 వేడుకలు విద్యార్థుల కేరింతల నడుమ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం కళాశాలలో అరోహన్ 2026 వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్‌డివో డిజిఎం రామస్వామి సౌందర్యరాజన్, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్‌డివో డిజిఎం (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) రామస్వామి సౌందర్యరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం కృతిమ మేథస్సు యుగంలో ఉద్యోగ భద్రత, ఉద్యోగాలపై ఆందోళన నెలకొందన్నారు. కృత్రిమ మేథస్సుకు సరైన సమాధానం మానవ మేథస్సే అన్నారు. మానవ మేథస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత యుగంలో డ్రోన్ టెక్నాలజీ బహుళ ప్రయోజనాలను సమకూరుస్తుందన్నారు. విద్యార్థులు ఈ అంశంపై దృష్టిసారించి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నూతన ఆవిష్కరణల కోసం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాకథాన్, ఐడియాదాన్ వంటి పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని దీనికి కారణం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తాము శిక్షణ ఇవ్వడమేనన్నారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆలోచనలతో అరోహన్ 2026 సందర్భంగా ప్రాజెక్టు ఎక్స్‌పోలను ప్రదర్శించడం కళాశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. రోబో టెక్నాలజీలో ఈ అరోహన్ ప్రారంభోత్సవాలు నిర్వహించడం కళాశాలకు ఉన్న సాంకేతిక సత్తాను తెలియజేస్తుందని వైస్ చైర్మన్ కె.శ్రీచైతన్య తెలిపారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన 40 ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న ప్రభుత్వం

### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పేద విద్యార్థులను విద్యకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దూరం చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ఫీజు బకాయిలను విద్యార్థుల నుండి వసూలు చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని హైకోర్టు తీర్పునివ్వడం సరికాదని దానిని పునః సమీక్షించాలని కోరారు. ఫీజు రీయంబర్స్‌మెంట్స్‌కు సంబంధించి ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందని ప్రైవేటు కళాశాలలు విద్యార్థులను చేర్చుకున్నారని ఇప్పుడు ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వంపై మొట్టికాయలు వేయాల్సిన హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చి విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసుకోవాలని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు చెప్పడం దుర్మార్గమన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పై ఆధార పడి చదువుతున్న విద్యార్థులు 15లక్షల మందికి పైగా ఉన్నారని ఈ తీర్పు వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫీజు బకాయిలు రావడం లేదని పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు పవన్, గోపి, చైతన్య, రాఘువేంద్ర, నరేష్, సుకుమార్, ఉమామహేష్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్ లకావత్ సైదులు తెలిపారు. శుక్రవారం ఎనిమిదవ డివిజన్ కొత్త డబుల్ బెడ్‌రూం కాలనీలో ఏర్పాటు చేసిన తాగు నీటి పంపును కార్పొరేటర్ సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కాలనీలో తాగు నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు తెలిపారు. బోరును శుభ్రం చేయడంతో పాటు కొత్త మోటార్, పైపులు, వైరింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోరు నుండి కాలనీకి కొత్త పైపులైన్ వేయించి నీటి సరఫరాకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాలనీవాసులకు నీటి సమస్య ఉండదని తెలిపారు. నీటి సరఫరా పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేసి కార్పొరేటర్ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్మశానవాటికకు దారేది?

### దళితులు, బిసిలు కాబట్టే చిన్న చూపు
### దారి చూపకపోతే కార్యాలయాల ముందు ఆందోళనలు చేపడుతాం
### ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ డిమాండ్




ప్రజాపక్షం/అశ్వాపురం : దళితులు, బిసిలపై వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందా? ఇక్కడ కూడా దండోరా చిత్రం సీన్ రిపీట్ అవుతుందా అనే అనుమానాలకు తావిస్తూ, శ్మశానవాటికకు వెళ్లే దారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న గ్రామ దళితులు, బిసిలు అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన దళితవాడ ప్రజలు, బిసి కులాల వారు తమకు కేటాయించిన శ్మశానవాటికకు సరైన దారి లేకపోవడంతో మృతదేహాలను తరలించడంలో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఇళ్ల మధ్య నుండి, పంట పొలాలుగుండా వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వ భూమిలోనే దారి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు దానిని అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై పలు మార్లు వినతిపత్రాలు సమర్పించినా, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం, ఇటీవల జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా కూడా ఈ సమస్యను స్థానికులు వివరించారు. అయితే ఈ సున్నితమైన అంశంపై కొంతమంది రాజకీయ లాభాల కోసం విమర్శలు చేయడం తగదని సమస్య పరిష్కారం ముఖ్యమని, రాజకీయాలు కాదని ఆయన స్పష్టం చేశారు. దళితుల మౌలిక హక్కులకు సంబంధించిన ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, స్మశాన వాటికకు సరైన దారి ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే తహసీల్దార్, పంచాయితీ కార్యాలయం ముందు ధర్నాలకు దిగుతామని భారీ జన సందోహాన్ని కూడగట్టి ఆందోళనలు చేపడతామని అన్నారు.

## అనుమతులు లేని సుమారు వందకిపైగా సానీ డంపర్ల నిలిపివేత

### ఫిట్‌నెస్ లేని సాని డంపర్లను నిలిపివేసిన డిప్యూటీ డైరెక్టర్ మైన్ సేఫ్టీ



ప్రజాపక్షం/మణుగూరు : సింగరేణి మణుగూరు ఏరియా పికెఒసి సెక్షన్ 2లో పనిచేస్తున్న విపిఆర్ దుర్గ (డిఐఎంపిఎల్) ఒబి కంపెనీలో ఆదివారం జరిగిన ప్రమాద సంఘటన నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ దిలీప్‌కుమార్ శుక్రవారం రక్షణ తనిఖీ చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో గుర్తించిన ఫిట్నెస్ సర్టిఫికెట్ మరియు అవసరమైన అనుమతులు లేని సుమారు వందకిపైగా సానీ డంపర్లను నిలిపివేశారు. గురువారం (రెండో తేదీ) సెకండ్ షిఫ్ట్ బ్లాస్టింగ్ తర్వాత మొత్తం వాహనాల్లో కేవలం ముప్పై ఐదు భారీ డంపర్‌లకే ఫిట్నెస్ అనుమతులు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన ఫిట్నెస్ లేని వాహనాల పనులను పూర్తిగా పార్కింగ్ యార్డ్‌కే పరిమితం అయ్యేలా నిలిపివేశారు.ఈ ప్రమాద సంఘటన ఒక ఓబి వర్కర్ చనిపోయిన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు, ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, అనుక్షణం కార్మికులను సూపర్‌వైజర్లను అప్రమత్తం చేయాలని, వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపు, పని స్థలాలలో రక్షణ చర్యలు, హాల్ రోడ్స్, లైటింగ్, వాటర్ స్ప్రేయింగ్ తదితర అంశాలలో ప్రమాదాలు నివారణకు చేపట్టవలసిన రక్షణ చర్యలకు సంబంధించి తగు సూచనలతో కూడిన ఆదేశాలు ఓబి యాజమాన్యానికి జారీచేసినట్లు తెలిసింది. అలాగే పర్యవేక్షణకు సంబంధించి సింగరేణి యాజమాన్యానికి కూడా తగు ఆదేశాలు అనగా కోల్‌మైన్స్ రెగ్యులేషన్ (సిఎంఆర్ 2017) నిబంధనల ప్రకారం రక్షణ సూత్రాలు పాటించాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎంపి) స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (యస్ ఓ పి) ప్రకారం గనిలో పనిలో గ్యారేజీలో అట్టి ఆదేశాలు అమలు చేయాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

## కెటిఆర్, హరీష్‌రావుల దిష్టి బొమ్మలు దహనం

ప్రజాపక్షం/పాల్వంచ : రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పాల్వంచ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల రంగారావు ఆధ్వర్యంలోఅంబేద్కర్ సెంటర్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుల దిష్టిబొమ్మలను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కెటిఆర్, హరీష్ రావులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఇలాగే దుష్ప్రచారాలను కొనసాగిస్తే వారికి పుట్టగతులుండవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాల్వ భాస్కర్‌రావు, బిఎస్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండం వెంకన్న గౌడ్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పైడిపల్లి మహేష్, నాయకులు భువన చందర్‌రెడ్డి, చింతా నాగరాజు, ఆవుల మధు, భట్టు మురళి, లక్ష్మణ్, రాము నాయక్, కాపా శ్రీను, గుండు రవి తదితరులు పాల్గొన్నారు.

## హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాపక్షం/అశ్వాపురం : అశ్వాపురం మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. భారజల కర్మాగారం (హెవీ వాటర్ ప్లాంట్)లో పనిచేస్తున్న ఉద్యోగి మలుకూరి వెంకటరెడ్డి గౌతమినగర్ కాలనీలోని డి టైప్ క్వార్టర్స్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, వారు ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్నట్లు సమాచారం. అనారోగ్య సమస్యల కారణం చేత మరణించి ఉండొచ్చని అతని తోడల్లుడు ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## నరేగా బచావో, విబి–జి రామ్‌జి హఠావో



**కేసముద్రం/ప్రజాపక్షం:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి విబిజి రాంజీగా పేరు మార్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ తెలంగాణ(కెకెసి) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక ప్రజలు పనిచేసే హక్కు, న్యాయమైన కూలీ, పంచాయతీ రాజ్ వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలపై నాలుగు రకాలుగా దాడి చేస్తుందని, నూతన చట్టం కాకుండా పాత చట్టాన్ని అమలు చేస్తూ పని హక్కు, కూలీ హక్కు, జవాబుదారీ తనం కల్పించాలని, నరేగాను వెంటనే పూర్తిగా పునరుద్ధరించాలని, రాజ్యాంగబద్ధ పని హక్కును తిరిగి అమలు చేయాలని, దేశవ్యాప్తంగా కనీస వేతనం రూ.400 చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెకెసి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ టి.రాజశేఖర్ రెడ్డి, మైనారిటీ రాష్ట్ర నాయకులు మున్నా జానీ, అబ్దుల్ జిలాని, మార్కెట్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు రియాజ్‌తో పాటు కల్వల గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రాంచంద్రయ్య, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు గండి శ్రీనివాస్, వార్డు సభ్యులు గంట రాంమోహన్ రెడ్డి, గంట బాలక్రిష్ణా రెడ్డి, కొమ్మాల జయిందర్ రెడ్డి, ఆకుల సుధాకర్, బొడ్డు బిక్షం, మెందు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేరళ సిఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



**ప్రజాపక్షం/మరిపెడ:** కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్బంగా ప్రచారనికీ తెలంగాణ నుండి స్టార్ క్యాంపెనర్ గా మఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సహచర మంత్రులతో కలసి వెళ్ళి,కేరళ ఎన్నికల ప్రచరంలో బాగంగా మట్లడుతూ కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ని టార్గెట్ చేస్తూ ఎల్‌డిఎఫ్ కూటమి కమ్యునిస్టులకు ఓటు వేస్తే అది బిజెపి కి వేసినట్లే అంటు చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలనీ మరిపెడ సిపిఐ మండల కార్యదర్శి మరగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు.కేరళ రాష్ట్రం తెలంగాణ కంటె అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి ముందంజలో ఉందని,100 శాతం అక్షరాస్యత సాధించింది అని,రాష్ట బడ్జెట్ లో 28 శాతం నిదులు కేటయిస్తోందని,కాని తెలంగాణ రాష్ట్రం కేవలం ఎనిమిది శాతం నిదులు మాత్రమే కేటయిస్తోందని అన్నారు.ఏ విదంగా చూసిన కేరళ ను మించి తెలంగాణలో అభివృద్ధి జరుగలేదని,అన్ని రంగలలో వెనుకబడి ఉందని అన్నారు.ఇండియా కుటమిలో ఉన్న కమ్యునిష్టును,కమ్యునిష్టులకు ఓటు వేస్తే అది బిజెపి కి వేసినట్లు అవుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవలనీ సిపిఐ మరిపెడ మండల సమితి తరుపున ఆయన డిమండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్,పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, వీరేందర్, తదితరులు పాల్గోన్నరు.

## సిఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** భీమదేవరపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ బీసీ రవాణా శాఖ మంత్రి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులు పచ్చునూరు భాస్కర్ రూ. 92,500, మాచర్ల కుమార్ స్వామి, రూ. 1,05000, మాచర్ల రజనీకాంత్, రూ.60000 వేముల మాధవి రూ. 21 000, తాళ్లపల్లి లలితకు రూ. 20000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి సదానందం, మార్పాటి గురువారెడ్డి, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు డబ్బా శంకర్ ,మాచర్ల సదానందం, చాగంటి వెంకటేశ్వర్లు, ఎలకపల్లి ప్రేమలత, మార్పాటి సింధు, మార్పాటి లలిత రెడ్డి, సాతూర్ విజయ, శాలువా సంధ్య, తాళ్లపల్లి రాణి, పచ్చునూరి కర్ణాకర్, పోలు మొగిలి, పచ్చ నూరి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చింతూరు పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 30 లక్షల రూపాయల సిసి రోడ్లకు చింతూరు పంచాయతీ సర్పంచ్ తెల్లం సుమాంజలి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలోని అంతరగత్త రోడ్ల నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని దీనిలో భాగంగానే రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను అభివృద్ధి దిశగా తీసుకుపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సీసీ రోడ్ల నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి సీతక్క, స్థానిక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నం ఎల్లయ్య, బంధం కృష్ణ, చింత సూరిబాబు, టిఆర్ఎస్ నాయకులు తెల్లం బుల్లేశ్వర రావు, చింత మోహన్, కృష్ణ,వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం కోసం రద్దీ.. షాపుల వద్ద సందడి

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో గురువారం రేషన్ దుకాణాల వద్ద అపూర్వమైన రద్దీ కనిపించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఏప్రిల్, మే, జూన్, నెలల కోటా కింద బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో తెలుపు రేషన్ కార్డుదారులు పెద్ద సంఖ్యలో షాపుల వద్దకు తరలివచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం నుండే రేషన్ దుకాణాల ముందు లైన్లు కట్టిన ప్రజలు తమ వంతు కోసం ఎదురుచూశారు. ఒక్కసారిగా భారీగా ప్రజలు రావడంతో కొన్ని చోట్ల తోపులాటలు, గందరగోళం నెలకొన్నాయి. అయితే సంబంధిత డీలర్లు, సిబ్బంది ప్రజలను క్రమబద్ధంగా నిలబెట్టి బియ్యం పంపిణీ చేపట్టారు. మూడు నెలల కోటాను ఒకేసారి అందజేయడం వలన ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుండగా, ఒకేసారి ఎక్కువ మంది రావడంతో షాపుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. తహసీల్దారు వేముల రాజకుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. రేషన్ బియ్యం పంపిణీతో మండలంలోని గ్రామాల్లో ఉత్సాహభరిత దృశ్యాలు కనిపించాయి.

# అంగడి భూమిని భూ కబ్జాదారుల నుండి రక్షించాలి



### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణకు వినతి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 246/1 విస్తీర్ణంలో గల రెండు ఎకరాల 16 గుంటలలో చేపల బావి కలగూరి బంగ్లా ఉండేదని, దీనిని భూ కబ్జాదారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులతో కుమ్ముక్కై కబ్జాచేయడం జరిగిందని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణకు సీపీఐ నాయకులు తెలిపారు.ఈ మేరకు హనుమకొండ కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 316 సుమారు నాలుగు ఎకరాల 16 గుంటలు విస్తీర్ణం గల గ్రామపంచాయతీ అంగడి స్థలాన్ని1970 సంవత్సరము ఎల్లాపూర్ గ్రామపంచాయతీ వారు ఈ భూమి పట్టాదారు నుండి ఆనాడు ఉన్నటువంటి ధరలకు అనుగుణంగా డబ్బులు చెల్లించి తీసుకోవడం జరిగిందిని తెలిపారు. 1973 నుండి అట్టి స్థలములో అంగడి కొనసాగుతూ వచ్చిందని, పహాని కాస్తు కాలములో ప్రభుత్వ అంగడి భూమి అని నమోదు అయి ఉన్నదని, అయినప్పటికీ 2022లో ధరణి వ్యవస్థ ద్వారా వారి వారసులు దీనిని తిరిగి అక్రమంగా పట్టా చేయించుకోవడం జరిగిందని తెలిపారు. ఇట్టి భూములో ప్రభుత్వ పశు వైద్యశాలను గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్మించినప్పటికీ ధరణిలోని లొసుగుల వల్ల స్థానికులతో కలిసి భూ కబ్జాదారులు ఆక్రమించడం జరిగిందని దీనిని విడిపించి ప్రభుత్వ స్థలంగా గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చూడాలని నారాయణను కోరారు. గ్రామ ప్రజలు తిరగబడి ఈ భూమిని ఇప్పటివరకు ఆపడం జరిగిందని, రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఈ భూములు ప్రభుత్వానికి దక్కేలా చర్యలు ఉండాలని లేని యెడల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పేదలకు పంచడం జరుగుతుందని, అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, సిపిఐ సీనియర్ నాయకులు మోతేలింగారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలునేదునూరి జ్యోతి, ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు రేణిగుంట్ల దుర్గాప్రసాద్, నాయకులు నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, గోపు బుచ్చిరెడ్డి, రేణుగుంట్ల చిరంజీవి పాల్గొన్నారు.

### నారాయణకు టూరిజం ఉద్యోగుల సన్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ ను తెలంగాణ టూరిజం కాంట్రాక్టు ఉద్యోగులు సన్మానించారు. శుక్రవారం హనుమకొండలోని హరిత హోటల్ కు విచ్చేసిన నారాయణను శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, టూరిజం కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, హనుమకొండ హరిత హోటల్ మేనేజర్ అశోక్ రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



## రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం నర్సంపేట లోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, శుభ్రత, రోగుల సౌకర్యాలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో శుభ్రతను కచ్చితంగా పాటించాలనీ, రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందించాలనీ సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఉమారాణి, ఆసుపత్రి పర్యవేక్షకులు కిషన్ నాయక్, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా నేదునూరి రాజమౌళి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ నేదునూరి రాజమౌళి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ నేదునూరి రాజమౌళి జన్మదిన వేడుకలు సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజమౌళి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ డాక్టర్ కె. నారాయణ,సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, మెట్టు శ్యాం సుందర్ రెడ్డి, తోట సుధాకర్, రేణుకుట్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## చెరువుల పునరుద్ధరీకరణకు ప్రత్యేక కార్యాచరణ

### చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువులలో పూడికతీత పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ నగరంలో చెరువుల పునరుద్ధరీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం లో భాగం గా వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధి లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అమృత్ 2.0.పథకం లో చెరువుల పునరుద్ధరీకరణ లో భాగంగా రూ.6 కోట్ల వ్యయం తో నగర పరిధిలోని చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువులలో పునర్జీవన, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పర్యావరణ పరిరక్షణ, నగర సౌందర్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమం లో భాగం గా అట్టి పనులను చేపట్టి జలాశయాలను శుభ్రం చేసి ట్యాంక్ బండ్ తరహాలో తీర్చి దిద్దడం జరుగుతుందని, ఉర్సు రంగ సముద్రం చెరువు వద్ద నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ చెరువుతో పాటు దేశాయి పేట చెరువు కు నిధులు మంజూరు చేయడం జరిగిందని, సాధ్యమైనంత త్వరలో అట్టి పనులను పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 5 గ్యారంటీలను తీసుకోవడం జరిగిందని, ఇంటర్మీడియట్ స్థాయి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం, సిఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని చేపట్టడం ప్రజలకు రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని, టెక్స్ టైల్ పార్క్ ఈ ప్రాంతంలో ఉండడం వల్ల ఇందుకోసం ఈ కార్యక్రమం లో వరంగల్ హన్మకొండ జిల్లా ల కలెక్టర్ లు డా.సత్య శారద, చాహత్ బాజ్ పాయ్ కార్పొరేటర్ లు సురేష్ జోషి, మరుపల్ల రవి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ అభివృద్ధిని కాంక్షించిన నరేందర్ రెడ్డి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ చేసి అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని అహర్నిశలు తాపత్రయపడిన వ్యక్తి చింతకుంట్ల నరేందర్ అని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం లోని ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతకుంట్ల నరేందర్ రెడ్డి సంతాప సభకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నరేందర్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... చింతకుంట్ల నరేందర్ రెడ్డి గారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని బాధపడ్డారు. 1987లో లెక్చరర్ ఉండి రాజకీయాలలోకి వచ్చిన మొట్ట మొదటగా తనకు అండగా నిలిచిన వ్యక్తి చింతకుంట్ల సురేందర్ రెడ్డి అని అన్నారు. అంటే దాదాపు 40 ఏళ్లుగా నాకు తోడుగా, అండగా చింతకుంట్ల కుటుంబం నిలిచిందని తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలకు నరేందర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని అయన మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం అనుక్షణం తాపత్రయ పడ్డారని అన్నారు. స్టేషన్ ఘనపూర్‌కు 100పడకల ఆసుపత్రి రావాలని పట్టుబాట్టారని ఈ రోజు ఘనపూర్‌కు 100పడకల ఆసుపత్రి వచ్చింది అంటే దానికి నరేందర్ రెడ్డి కారణం అని తెలిపారు. కానీ ఘనపూర్ అభివృద్ధి జరుగుతున్న తరుణంలో నరేందర్ రెడ్డి మన మధ్య లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, లకావత్ ధన్వంతి, రాంబాబు, వినయ్ కుమార్, లావణ్య శిరీష్ రెడ్డి, శ్రీధర్ రావు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణాకు ప్రభుత్వం ప్రత్యేక కృషి

### భూపాలపల్లి నియోజకవర్గంలో ఆర్‌టిసి బస్ సర్వీసులు ప్రారంభం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా రవాణాకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గాండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, టేగొండ, చిట్యాల మండలాల్లో పరకాల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్ సర్వీసును పరకాల ఆర్‌టిసి డిపో మేనేజర్ తో కలిసి గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించినారు. ఎమ్మెల్యే కొంత దూరం బస్ లో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా రవాణాకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రజలకు సురక్షితమని, ప్రతి ఒక్కరు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నుండి పరకాలకు వయా అంకుశాపూర్, సుబ్బక్కపల్లి, మొగుళ్ళ పల్లి నుండి వెళుతుందని, చింతకుంట రామయ్య పల్లి నుండి పరకాలకు వయా చిట్యాల, చల్లగరిగే, రేగొండ, రేగొండ మండల కేంద్రంలో రేగొండ నుండి ములుగు వ యా జగ్గయ్యపేట గోరికొత్తపల్లి,అబ్బాపూర్ వెళ్లే బస్సు సర్వీసులను నడిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.



**ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి**

తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శుక్రవారం తె లంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొ మరయ్య జయంతి వేడుకలు భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిలుగా హాజరై దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహనీయుల మార్గంలోనే మనదరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిఇందిర, క్రాంతి కిరణ్, శ్రీనివాస్, కిషన్, మేకల సంపత్, సదానందం యాదవ్, సతీష్, యాదవ, కురుమ సంఘ నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య



**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి దొడ్డి కొమురయ్య అని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోదులు దొడ్డి కొమురయ్య జయంతి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వయించగా కొమురయ్య చిత్ర పటానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దేశంలోనే ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ఈ పోరాటం సాగిందన్నారు. కొమురయ్య వీర మరణంలో గ్రామాల్లో చైతన్యం పెరిగి తెలంగాణ ఉద్యమమం మరింత ఉవ్వెత్తున సాగడంతో పాటు నైజాం నవాబు భారత సైన్యాలకు లొంగిపోవాల్సిన పరిస్థితి వచ్చిందనానరు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి నర్సింహరావు, రవీందర్, వివిధ కులాల సంఘ నాయకులు మల్లికాంబ, జాయ మల్లేష్, కె రమేష్, ఎస్ అంజనేయులు, వి చక్రపాణి, యం సాంబయ్య, పి హరీష్, బి వెంకయ్య, మల్లయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆకాంక్షలను నెరవేర్చిన ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే మురళీ నాయక్

**ప్రజాపక్షం/కేసముద్రం:** తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన గృహ ప్రవేశం పొందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేసి సాకారం చేసిందన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ముందుకు పోతున్న ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు అల్లం నాగేశ్వర రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, సర్పంచ్ వేల్పుల సుజాత రాంచంద్రయ్య, మున్సిపల్ కౌన్సిలర్ కనుకుల సుభద్ర రాంబాబు, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు గండి శ్రీనివాస్, వార్డు సభ్యులు గణపారపు సరితరమేష్, గంట బాలక్రిష్ణ రెడ్డి, గంట రాంమ్మోహన్ రెడ్డి, ఎల్లా గౌడ్, బిక్షం, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సీపీఐ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా దాదాపు 30 కుటుంబాలను వారు కలవడం జరిగింది. దాదాపు రూ.10వేల వరకు విరాళాలు సేకరించడం జరిగింది. సీపీఐ పార్టీకి మద్దతు తెలుపుతూ విరాళాలు అందించిన దాతలకు సీపీఐ పార్టీ మండల పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మండల కార్యదర్శి కావటి యాదగిరి, మండల సహాయ కార్యదర్శి మల్లేశం, నాయకులు ఎల్లయ్య, అంజయ్య, మురళి, సుధాకర్, శ్రీకాంత్, నరసయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్ ఘన విజయం



ఐపిఎల్–2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 65 పరుగుల భారీ తేడాతో కోల్‌కత్తా నైట్ రైడర్స్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో భారీ విజయం సాధిస్తే.. ఆ తర్వాత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులే చేసింది. హెన్రీచ్ క్లాసెన్(35 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. ట్రావిస్ హెడ్(21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సతో 46), అభిషేక్ శర్మ(21 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సతో 48) దూకుడుగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని (4/41) నాలుగు వికెట్లు తీయగా.. వైభవ్ అరోరా (2/47) రెండు వికెట్లు పడగొట్టాడు. కార్తీక్ త్యాగీ, అంకూల్ రాయ్ చెరో వికెట్ పడగొట్టారు.

**చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్!**

అనంతరం కెకెఆర్ 16 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. అంగ్క్రిష్ రఘువంశీ(29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సతో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. రింకూ సింగ్(25 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సో 35), ఫిన్ అలెన్(7 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సతో 28) దూకుడుగా ఆడారు. సన్రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్(3/21) మూడు వికెట్లు తీయగా.. ఎషాన్ మలింగా(2/14), నితీష్ కుమార్ రెడ్డి(2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. హర్ష్ దూబేకు ఒక వికెట్ దక్కింది.

**కొంపముంచిన రనౌట్..** 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్న కెకెఆర్..అనవసర రనౌట్‌తో మూల్యం చెల్లించుకుంది. ముఖ్యంగా అసాధారణ బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించిన రఘు వంశీ ఈ రనౌట్‌కు కారణమయ్యాడు. ముందుగా అనవసర పరుగు పరుగెత్తి కామెరూన్ గ్రీన్(2) రనౌట్‌కు కారణమైన అతను రెండో సారి తానే వికెట్ పారేసుకున్నాడు. ముఖ్యంగా రింకూ సింగ్ తో కలిసి ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించిన అనంతరం రనౌట్‌గా వెనుదిరిగి కెకెఆర్ ఓటమికి కారణమయ్యాడు. ఎషాన్ మలింగాఅద్భుత త్రోతో రఘువంశీ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఈరనౌట్ మ్యాచ్ కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఆ తర్వాత కెకెఆర్ వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది.

## కపిల్, ధోనీకి యువీ క్షమాపణలు



**ఢిల్లీ:** భారత దిగ్గజ సారథులు కపిల్ దేవ్, మహేంద్రసింగ్ ధోనీకి మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ బహిరంగ క్షమాపణలు చెప్పాడు. ఈ ఇద్దరినీ ఉద్దేశిస్తూ యువి తండ్రి యోగ్‌రాజ్ గతంలో పదేపదే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు గాను తాజాగా యువరాజ్ స్పందించాడు. ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యువి మాట్లాడుతూ.. 'నేను కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీకి క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా' అని అన్నాడు. భారత జట్టులో చోటు కోల్పోవడానికి ధోనీనే కారణమని యోగ్‌రాజ్ గతంలో ఆరోపించేవాడు. అంతేగాక 1980ల్లో తన క్రికెట్ కెరీర్‌ను నాశనం చేస్తానని కపిల్‌దేవ్ బెదిరించాడనీ వాపోయాడు. ఈ వ్యాఖ్యలపై ఇన్నాళ్లూ స్పందించని యువి తాజాగా.. 'ఇలా మాట్లాడటం కరెక్ట్ కాదని మా నాన్నకు చెబుతూనే ఉంటా' అని తెలిపాడు. ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు గాను తాను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నానని యువరాజ్ వెల్లడించాడు

## క్వార్టర్స్‌కు ఆదిత్య



**ఉలన్‌బాతర్:** మంగోలియా వేదికగా జరుగుతున్న ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. టోర్నీ నాలుగో రోజైన గురువారం జరిగిన పురుషుల 65 కిలోల విభాగంలో ఆదిత్య.. 50తో సౌదీ అరేబియాకు చెందిన మోసా అల్హాసాను ఓడించాడు.

## సైన్స్



### ద్విముఖంగా పని చేసే మెటాకాగ్నిషన్

మెటాకాగ్నిషన్ అనేది ద్విస్థాయి జ్ఞాన ప్రక్రియ. మొదటి స్థాయి సాధారణ ఆలోచన.. అంటే, సమాచారం గ్రహించడం, విశ్లేషించడం, నిర్ణయం తీసుకోవడం. రెండవ స్థాయిగా ఆ ఆలోచనపై పర్యవేక్షణ, నియంత్రణను పేర్కోవాలి. ఈ రెండు భాగాలను కలిపి మెటాకాగ్నిషన్‌గా పరిగణిస్తారు. మెటాకాగ్నిటివ్ జ్ఞానం, తన సామర్థ్యాలు, పరిమితులు, వ్యూహాలపై అవగాహన ఉండడాన్ని సూచిస్తే, మెటాకాగ్నిటివ్ నియంత్రణ అనేది అవసరమైతే వ్యూహాలను మార్చడం, ఆలోచనను సవరించడం, తప్పులను సరిదిద్దడం వంటి పనులు చేస్తుంది. కాగ్నిటివ్ న్యూరో సైన్స్ పరిశోధనల ప్రకారం, ప్రీఫ్రంటల్ కార్టెక్స్, మెటాకాగ్నిటివ్ మానిటరింగ్‌లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి నిర్ణయ నాణ్యతను అంచనా వేయడం, విశ్వాస స్థాయిని నియంత్రించడం, పక్షపాతాలను తగ్గించడం వంటి ప్రక్రియలతో సంబంధం కలిగి ఉంటాయి. బలమైన మెటాకాగ్నిటివ్ సామర్థ్యం ఉన్నవారు తమ జ్ఞానంపై ఖచ్చితమైన అంచనాలు వేస్తారు. దీనిని కాలిబ్రటెడ్ కాన్ఫిడెన్స్ అంటారు. ఇది అతివిశ్వాసం , అజ్ఞానాన్ని గుర్తించలేకపోవడం వంటి లోపాలను తగ్గిస్తుంది. విద్యా పరిశోధనల్లో ఇది స్వీయనియంత్రిత అభ్యాసంలో ముఖ్య సూచికగా దీనిని పేర్కొంటారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, మెటాకాగ్నిషన్ అనేది తెలివితేటల పరిమాణం కాదు; ఆ తెలివిని వ్యూహాత్మకంగా, తర్కబద్ధంగా, పరిస్థితికి అనుగుణంగా ఉపయోగించే నియంత్రణ వ్యవస్థ. అందువల్ల సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక విశ్లేషణ, దీర్ఘకాలిక నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఇది కేంద్ర పాత్ర పోషిస్తుంది.

### డార్క్ మ్యాటర్‌ను కొలిచేదెలా?



డార్క్ మ్యాటర్ అనేది కాంతిని విడుదల చేయని, గ్రహించని లేదా ప్రతిబింబించని పదార్థం. అందువల్ల దాన్ని నేరుగా టెలిస్కోప్‌ల ద్వారా చూడలేం. అయినప్పటికీ, ఖగోళ పరిశీలనల ప్రకారం విశ్వంలోని మొత్తం పదార్థంలో సుమారు 85 శాతం భాగం డార్క్ మ్యాటర్‌తోనే ఉంటుందని అంటారు. దీని ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించిన విధానం దాని గురుత్వాకర్షణ ప్రభావం ద్వారానే. గెలాక్సీల పరిభ్రమణ వేగాలు, గెలాక్సీ క్లస్టర్ల ప్రవర్తన, విశ్వ విస్తరణ నమూనాలు వంటి వాటిని కనిపించే పదార్థంతో మాత్రమే వివరించలేం. వాటి వివరణలో అదనపు గురుత్వ బలం ప్రస్తావన అత్యవసరమవుతుంది. అదే డార్క్ మ్యాటర్. డార్క్ మ్యాటర్ చిన్న కణాల రూపంలో మాత్రమే కాకుండా, విశాలమైన హాలోస్ లేదా గుంపుల రూపంలో ఉంటుంది. ఈ నిర్మాణాలు సూర్యుని కంటే లక్షల సార్లు ఎక్కువ పరిమాణం కలిగి ఉంటాయి. గెలాక్సీలు ఈ హాలోస్ లోపలే ఏర్పడతాయి. అందువల్ల డార్క్ మ్యాటర్ విశ్వానికి ఒక స్కాఫోల్డింగ్ లేదా మూలాధార నిర్మాణంలా పనిచేస్తుందని భావిస్తారు. డార్క్ మ్యాటర్‌ను మ్యాప్ చేయడానికి ముఖ్యమైన పద్ధతి గ్రావిటేషనల్ లెన్సింగ్. భారీ డార్క్ మ్యాటర్ గుంపు తన గురుత్వంతో దూర గెలాక్సీల నుంచి వచ్చే కాంతిని సైతం వంపుకు గురి చేస్తుంది. ఈ వంగిన కాంతి స్ట్రీక్స్ లేదా వక్రీకృత ఆకారాల రూపంలో కనిపిస్తుంది. ఈ వక్రీకరణ స్థాయిని కొలిచి, అక్కడ ఎంత డార్క్ మ్యాటర్ ఉందో అంచనా వేయవచ్చు. ఇది అదృశ్య పదార్థాన్ని పరోక్షంగా చూడగలిగే అత్యంత ప్రభావవంతమైన సాంకేతిక పద్ధతి. విశ్వ నిర్మాణాన్ని పరిశీలిస్తే, అది ఒక కాస్మిక్ వెబ్‌లా ఉందని తెలుస్తోంది. డార్క్ మ్యాటర్ ఫిలమెంట్‌లు అంతరిక్షంలో విస్తరించి, అవి కలిసే చోట గెలాక్సీలు, గెలాక్సీ క్లస్టర్‌లు ఏర్పడతాయి. ఈ వెబ్ లేకపోతే గెలాక్సీలు స్థిరంగా ఉండలేవు. నక్షత్రాలను కలిపి ఉంచే అదనపు గురుత్వ బలం ఉండదు. డార్క్ మ్యాటర్ స్వభావం ఇంకా తెలియని విషయం. ఇది కొత్త రకం సబ్‌ఆటామిక్ కణమా? లేక మనం ఇప్పటివరకు అర్థం చేసుకోని భౌతిక చట్టాల ఫలితమా? దీనిపై స్పష్టత లభిస్తే, విశ్వ నిర్మాణం, పరిణామం, అంతిమ గమ్యం గురించి మరింత లోతైన అవగాహన పొందగలం.

### కాస్మాలజీ సిద్ధాంతాలపై కొత్త ప్రశ్నలు



జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ (జెడబ్ల్యుఎస్‌టి) ఇటీవల అందిస్తున్న చిత్రాలు, డేటా ఆధునిక కాస్మాలజీ సిద్ధాంతాలపై కొన్ని కీలకమైన కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. విశ్వ ఆరంభ దశలను అధ్యయనం చేయడానికి రూపొందించిన ఈ టెలిస్కోప్, ఇన్‌ఫ్రారెడ్ తరంగదైర్ఘ్యాలలో అత్యంత సున్నితంగా పరిశీలించగలదు. దీనిద్వారా బిగ్‌బ్యాంగ్ తర్వాత కొన్ని వందల మిలియన్ సంవత్సరాల కాలానికి చెందిన గెలాక్సీలను స్పష్టంగా గుర్తించడం సాధ్యమైంది. ప్రారంభ పరిశీలనల్లోనే ఒక ముఖ్యమైన ఆశ్చర్యం బయటపడింది. విశ్వం పుట్టిన కొద్దికాలానికే ఇప్పటికే భారీ, పరిపక్వ గెలాక్సీ లు ఉన్నట్లు కనిపించింది. ప్రస్తుత లాంబ్డాకోల్డ్ డార్క్ మ్యాటర్ మోడల్ ప్రకారం, అంతత్వరగా ఇంతపెద్ద గెలాక్సీలు ఏర్పడటం కష్టసాధ్యం. గెలాక్సీ నిర్మాణం సాధారణంగా చిన్న నిర్మాణాల కలయిక ద్వారా క్రమంగా అభివృద్ధి చెందాలి. కానీ జెడబ్ల్యుఎస్‌టి డేటా ప్రకారం, ప్రారంభ విశ్వంలోనే వేగంగా నక్షత్రాల ఉత్పత్తి జరిగి ఉండవచ్చని సూచనలు కనిపిస్తున్నాయి. ఇది గెలాక్సీ ఏర్పాటుకు సంబంధించిన సిద్ధాంతాలను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఇంకొక ప్రధాన సమస్య హబుల్ టెన్షన్‌గా పిలవబడుతోంది. విశ్వ విస్తరణ రేటు (హబుల్ స్థిరాంకం)ను కొలిచే రెండు ప్రధాన పద్ధతులు ఉన్నాయి. వాటిలో ఒకటి కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ ఆధారంగా, మరొకటి సమీప గెలాక్సీల పరిశీలన ఆధారంగా.. ఇవి భిన్న ఫలితాలు ఇస్తున్నాయి. జెడబ్ల్యుఎస్‌టి కొలతలు ఈ వ్యత్యాసాన్ని మరింత స్పష్టంచేశాయి. ఇది కొలతా లోపమా, లేక మన విశ్వమోడల్‌లోనే ఏదైనా లోపమా అనే ప్రశ్నను బలపరుస్తోంది. ఈ పరిస్థితిని కొందరు కాస్మాలజికల్ క్రైసిస్‌గా అభివర్ణిస్తున్నారు. శాస్త్రవేత్తల ప్రతిస్పందన సమతుల్యంగా ఉంది. ఇప్పటివరకు ఉన్న భౌతిక చట్టాలను పూర్తిగా తిరస్కరించడం కాకుండా, వాటిని సవరించుకోవాల్సిన అవసరముందనే దృక్పథం ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తంగా, జెడబ్ల్యుఎస్‌టి ఆవిష్కరణలు విశ్వం మనం ఊహించినదానికంటే క్లిష్టమైనదిగా, ఇంకా రహస్యాలతో నిండి ఉందని గుర్తుచేస్తున్నాయి.

---

ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్రవ్యాప్తంగా

# ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



**ప్రజాపక్షం/ములుగు :** ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ములుగు పట్టణంలో ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావుతో కలిసి డాక్టర్ నారాయణ ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని ప్రధానంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి చేపడుతున్నామన్నారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల సాధక బాధకాలను స్వయంగా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ముఖ్యంగా పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాలు, గుడిసెవాసులకు పట్టాలు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు, సాగునీరు వంటి స్థానిక సమస్యలపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను రాష్ట్రప్రభుత్వం అమలు చేయడంలో ఆలస్యం జరుగుతుందని అన్నారు. దీనితో ప్రజలు హామీల అమలుపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సహాయకార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా కార్యవర్గసభ్యులు అంజత్‌పాష, ఇంజం కొమురయ్య, ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య, కుమ్మరి సాగర్, జక్కుల అయిలయ్య, రాజు, బోడ రమేష్, కొక్కుల రాజేందర్, నాసర్, మామిడి నటరాజ్, మంకిడి క్రిష్ణ, లింగమూర్తి, మర్రి స్వామి, పరం సింగ్, దర్ర గోపి, కల్తి తిరుపతి, గొంది రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మద్దతుతోనే సిపిఐ బలోపేతం

### దేవరకొండలో ఇంటింటికీ సిపిఐ విరాళాల సేకరణ

### హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/దేవరకొండ :** ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో శుక్రవారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ప్రముఖ డాక్టర్ సజ్జాద్‌తోపాటు పట్టణంలో ప్రముఖులను కలిసి రూ.40వేలు విరాళాలు స్వీకరించారు. ఈసందర్భంగా జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుతో పార్టీ బలోపేతం మవుతుందని తెలిపారు. సిపిఐ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుంటు కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సిపిఐ ఇంటింటికి విరాళాల సేకరణ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత దగ్గరవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నరసింహ్మా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలకొండ కాంతయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, కనకాచారి, వెంకటయ్య, జయరాములు, వెంకటయ్య, రామస్వామి, ఆంజనేయులు, శైలేష్, విజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

#### సిపిఐకి పల్లా తన్వి పొదుపు విరాళం



ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో భాగంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మనవరాలు, పల్లా లెనిన్ రెడ్డి కుమార్తె పల్లా తన్వి తాను పొదుపుగా దాచుకున్న రూ.5,000లను సిపిఐకి విరాళంగా అందజేసింది. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆ మొత్తాన్ని స్వీకరించారు. సామాజిక బాధ్యతను గుర్తించి పార్టీకి విరాళం ఇవ్వడం అభినందనీయం అని నెల్లికంటి సత్యం తెలిపారు.

---

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై

## సిఎం రేవంత్‌రెడ్డి విమర్శలు సరికాదు

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా



**ప్రజపక్షం/నాగర్ కర్నూల్ :** తెలంగాణ రాష్ట్రంలో 6 గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయలేని సిఎం రేవంత్‌రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సినరయి విజయన్‌ను విమర్శించడం సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల నరసింహ్మా విమర్శించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మ ణాచారి భవన్‌లో సిపిఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బాలనరసింహ్మా హాజరై మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్‌డిఎఫ్‌కు ఓటేస్తే బిజెపికి ఓటు వేసినట్లు అని మాట్లాడుతున్నారని విమర్శించారు. కేరళ సిఎం వినరయి విజయన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్కటే అని అనడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయలేని సిఎం సిఎం రేవంత్‌రెడ్డి కేరళలో అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌రెడ్డి అదుపులో ఉంచాలని, లేకుంటే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్.ఆనంద్ జీ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేసు మల్ల శివకృష్ణ, నాగర్ కర్నూల్ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, నాయకులు కొట్ర శేఖర్, గొర్ల సత్యం, ఈర్ల హుస్సేన్, బాల పీరు, విజయ్ పాల్గొన్నారు.

# పోరాటాల పార్టీకి చేయూతనివ్వండి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి చాడ వెంకట్‌రెడ్డి హాజరై సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పోరాటాల పార్టీ సిపిఐకి ప్రజలు మద్దతు తెలిపాలని, పార్టీ బలోపేతానికి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బోయిని అశోక్, వెన్న సురేష్, జగిత్యాల, కోరుట్ల పట్టణ సెక్రటరీలు మాడిశెట్టి కిరణ్, ముఖ్రం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, జిల్లా ఇంచార్జి వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** రాజీలేని పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ అన్ని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమంలో భాగంగా విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పి.రంజిత్ కుమార్, రాధాకృష్ణ, సాయమ్మ, గంగామణి, లత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడడమే లక్ష్యంగా 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు తెలిపారు. యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామంలో విరాళాల సేకరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారెడ్డిగూడెం సర్పంచ్ కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్/జడ్చర్ల :** ఇంటింటా సిపిఐ కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల పట్టణ కేంద్రంలో కొత్త బస్టాండ్ 8వ వార్డులో సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ ఆధ్వర్యంలో ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భాగీ కృష్ణయ్య, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు కలీం, మహేష్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.








## పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** పేద ప్రజల సొంత ఇంటి కల సహకారం ఇందిరమ్మ కలలుగన్న పేదింటికి కూడు, గూడు ల్పించడం ఏవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ప్రభుత్వం నుంచి మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న దాసరి కృపరాణి వీరేశ్‌ల ఇందిరమ్మ ఇండ్లను పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, ఉపసర్పంచ్ మంగళపర్తిస్వామిలతో కలసి వారు ప్రారంభించారు.గత బీఆర్ఎస్ పాలనలో ఇప్పటివరకు ఒక పేద కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇవ్వలేదని ఎద్దేవ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాలలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసిందని ఆయన అన్నారు. పేదల ముఖాలలో ఆనందం చూడడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు.మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి, మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, మాజీ వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రూప్లతండా సర్పంచ్ కిషన్‌నాయక్, అంసాన్‌పల్లి రాఘవరెడ్డి, పెద్దపులి సతీష్, దాసరి కృష్ణ, ఇరన్ లచ్చయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల అభ్యున్నతికి కృషి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కళాకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని జనం పాట కల్చరల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంపూర్ సాయి అన్నారు. శుక్రవారం నగరంలోని కంఠేశ్వర్‌లో జనం పాట కల్చరల్ అసోసియేషన్ 202627 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాంపూర్ సాయి మాట్లాడుతూ జనం నుంచి వచ్చిందే జనం పాట అన్నారు. ప్రజా సమస్యలపై, తెలంగాణ ఉద్యమం సమయంలో సైతం ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేయటం జరిగిందన్నారు. ఇక నుంచి జిల్లా కళాకారుల అభ్యున్నతి కోసం పోరాడుతామన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా,రాష్ట్రస్థాయి వరకు ఉన్న కళాకారులను గుర్తించి సమాజంలో కళకున్న ప్రాముఖ్యతను మరింత విస్తరించేలా చేస్తామన్నారు. 21 మంది కళాకారులతో రెండు సంవత్సరాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. గౌరవ అధ్యక్షులుగా పస్క నర్సయ్య, అధ్యక్షులుగా రాంపూర్ సాయి, ఉపాధ్యక్షులు రాజేందర్ చిన్న, ప్రశాంత్‌రెడ్డి, సవితలు ప్రధాన కార్యదర్శిగా నల్ల మహేందర్, కోశాధికారి గొర్కంటి రాజు, కార్యనిర్వాహఖ కార్యదర్శి కర్క రమేష్, సహాయ కార్యదర్శులుగా ఎ. చిట్టిబాబు, డప్పు సంతోష్, సలహాదారులు ఆర్టీసీ మల్లన్న, కోకిల నాగరాజు,సభ్యులుగా నవీన్, సోనీ, మహేష్, గణేష్, నరేష్, స్రవంతి, పద్మ, సతీష్‌లను ఎన్నుకున్నామన్నారు.

## గిరిజన సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తాం

ఐటిడిఎ పిఒ యువరాజ్ మర్మాట్



**ప్రజాపక్షం/ఉట్నూర్:** గిరిజనుల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ఉట్నూర్ ఐటిడిఏ అంకితభావంతో పనిచేస్తుందని ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో రెండు రోజుల క్షేత్ర పర్యటనకు వచ్చేసిన 20 మంది డిప్యూటి కలెక్టర్ల బృందంతో ఆయన ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజనులకు, ముఖ్యంగా పివిటిజి వర్గాలకు అందుతున్న విద్య, వైద్యం, ఇతర సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులైన ప్రతి గిరిజనుడికి అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం డిప్యూటి కలెక్టర్ల బృందం ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఐటిడిఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని సందర్శించింది. అక్కడ పండ్ల తోటల పెంపకం, అంట్లు కట్టే విధానం, ఎరువుల వినియోగం, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయ నేపథ్యం ఉన్న పలువురు బృంద సభ్యులు సాగు మెలకువలపై ఆసక్తిగా ఆరా తీశారు. పర్యటనలో భాగంగా బృంద సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. అలాగే గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యాబోధన, మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు

ఫోరమ్ ఫర్ బెటర్ అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమర వీరుడు శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి సందర్బంగా సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని దొడ్డి కొమరయ్య విగ్రహానికి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ సాయుధ పోరాటం లో తొలి అమరుడుగా నిలిచారని ఆయన పోరాట స్పూర్తితో నేటి యువత తమ చుట్టు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, వివక్షల పోరాటం చేసి దొడ్డి కొమరయ్య ఆశయ సాదనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి అమిదిపురం, మహేష్, కుమార్, సహా కార్యదర్శులు పాండురంగం, శ్రీకాంత్ కార్యవర్గ సభ్యులు సుమన్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



# విలీన గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం /రాంచంద్రాపురం:** అమీన్పూర్ డివిజన్ పరిదిలోని వడకపల్లి ,కిష్టారెడ్డిపేట, ఐలాపూర్, సుల్తాన్ పూర్ ,దయార ,పటేల్ గూడ , ఐలాపూర్ తండా, జానకంపేట, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రథమ ప్రాదాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం అమీన్పూర్ డిప్యూటీ కమీషనర్ ప్రదీప్ కుమార్,, ఇంజనీరింగ్ ఈఈ సురేష్, ఎంపిపి దేవానందం, మాజీ జెడ్పిటీసీ సుదాకర్‌రెడ్డిలతో కలిసి విలీన గ్రామాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎనిమిది గ్రామాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కిష్టారెడ్డి పేట గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు నత్త నడక కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వడక్ పల్లి గ్రామంలో గల పురాతన కోటను అభివృద్ధిపరేందుకు హెచ్ ఎండిఏ నిధులు మంజూరు చేసిందని తెలిపారు. 9 కోట్ల 80 లక్షల రూపాయాలతో కోట చుట్టూ రాక్ పార్కు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి అతి త్వరలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. సుల్తాన్పూర్‌లో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్, మల్లన దేవాలయాన్ని అతి త్వరలో ప్రారంభిచనున్నట్లు తెలిపారు. అమీన్పూర్ ,పటాన్చెరు సర్కల్ పరిధిలో జనాబాకు అనుగుణంగా మరో ఐదు డివిజన్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సి.ఎస్ ఆర్ నిధులతో అభివృద్దిని పరుగులు, పెట్టించబోతున్నట్లు తెలిపారు. అనంతరం దయారా గ్రామంలో యూత్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ ,రాజు, కృష్ణ, పాండు, శ్రీకాంత్ ,మల్లేష్, భాస్కర్ గౌడ్, మల్లేష్ ,శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్పూర్తి ఆదర్శం

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** దొడ్డి కొమురయ్య పోరాట స్పూర్తి సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేటలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంఘ నాయకులు యాదగిరితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్పూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీ సీ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు శ్రీ దొడ్డి కొమురయ్య 99 జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన స్పూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, జిల్లా గ్రంథాయ సంస్థ అధ్యక్షులు అంజయ్య ఆర్‌సి పురం , కార్పోరేటర్ పుష్ప నగేష్ , జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్ ,జిల్లా గొల్ల కురుమ అసోసియేషన్ అధ్యక్షులు మల్లయ్య యాదవ్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ,ప్రజా సంఘాల నాయకులు ,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

మెదక్ జిల్లా గిరిజన సంక్షేమాధికారి నీలిమ

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు సువర్ణవకాశం కల్పించబడిందని గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భరత ప్రభుత్వం, న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం అమలు చేయడం జరిగిందని గిరిజన సంక్షేమ అధికారి నీలిమ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. భారత్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ వారి సమన్వయం, కేరళ రాష్ట్రంలోని కోచి నందు గల నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ మే 2026 లో ప్రారంభమయ్యే తదుపరి బ్యాచ్ కోసం తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన యువతకు 25 సీట్లు కేటాయించబడినవని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మెదక్ జిల్లాలోని ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి ఏప్రిల్ 10 – 2026 లోపు సమర్పించాలన్నారు. ఇండస్ట్రియల్ ఎలక్ట్రియన్ (ఆయిల్ &గ్యాస్) . ఇండస్ట్రియల్ వెల్డర్ (ఆయిల్ &గ్యాస్), ప్రాసెస్ ఇన్‌స్టుమెంటేషన్ టెక్నీషియన్ , ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, టెక్నిషియన్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ కోర్సు. వ్యవధి: 6 నెలలు, అర్హత విద్యార్హత టెక్నికల్ డిప్లొమా పూర్తిచేసినవారు లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. వయస్సు 25 సంవత్సరాలు సౌకర్యాలు ఉచిత వసతి, భోజనం, లెర్నింగ్ మెటీరియల్స్, యూనిఫామ్, సేఫ్టీ మాస్. శిక్షణ అనంతరం నేషనల్ కౌన్సిల్ ఫర్ వోకేషనల్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా సర్టిఫికేట్ ప్రదానం చేసి ఉపాధి అవకాశం కల్పించబడుతుందన్నారు.చివరి తేది ఏప్రిల్ 10–2026 దరఖాస్తు చేసుకునుటకు ఆన్లైన్ లింక్: http:// dsappo nline. com/sds/ form/ reg ister.php సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## అర్హులైన పేదలందరికీ ఇండ్ల నిర్మాణం : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బైంసా :** అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇండ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు. బైంసా మండలంలోని మాంజ్రీ గ్రామంలో కవుడేకర్ మానజీ ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు.అర్హులందరికీ దశల వారీగా ఇండ్లు మమజూరు చేయిస్తానన్నారు. భీమ్రావ్,మాజీ ఎం.పి.పి రజాక్,బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి,స్థానిన సర్పంచ్ మారుతి, సర్పంచ్‌లు సిరం రాజమణి,శ్రీనివాస్,సుధాకర్,ఆశోక్,బెల్ తరోడా సర్పంచ్ సాయినాథ్,మాజీ ఎంపిటీసి ఆశోక్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్,మాజీ సర్పంచ్ హన్మాండ్లు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/బైంసా :** ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు.ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటన సందర్భంగా,ఆయన,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్ర ఉర్దూ ఆకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్‌లతో కలిసి బాసరలో ఏర్పాట్లను పరిశీలించారు .ముందుగా బసరకు చేరుకున్న ప్రభుత్వ సలహాదారు,తదితరులకు కలెక్టర్ అభాలాష అభినవ్ పూల ముక్కలు అందించి స్వాగతం పలికారు.దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించే ప్రాంతం ,అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే ప్రాంతాలు పరిశీలించారు.ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.అనంతరం ఆలయ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని అన్నారు.బాసర తో పాటు,రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలు అన్ని అభివృద్ధపరిస్తుందని పేర్కొన్నారు.

ఇందులో భాగంగానే ఈ నెల అరవ తేదీన ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని చెప్పారు.దేశం నలుమూలల నుంచి బాసరకు ఎంతో మంది భక్తులు వస్తారని,ఆ భక్తులకు ఇబ్బ ందులు కలుగకుండా,దర్శనాలు సౌకర్యవంతంగా పూర్తయ్యేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూ ర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఆలయ ఈవో విజయరామారా వు,తహసిల్దార్ పవన్ చంద్ర,నిర్మల్ మున్సిపల్ వై స్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఇతర అధికారు లు ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ సేవలు సమాజానికి ప్రాణాధారం

డిఎంహెచ్ఓ డా.రాజేందర్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో డిఎంహెచ్ఓ డా.రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా 108 ఎయంటీ డే జరుపుకోవడం జరిగింది.ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ,డీసిహెచ్ డా. కాశీనాథ్ పాల్గొన్నారు.ప్రజలకు ప్రాణాధారం అయిన 108 సిబ్బంది ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది,వాహన చోదకులు అలాగే ఇతర సిబ్బంది పాల్గొని ప్రజలకు అందిస్తున్న సేవల ప్రాముఖ్యతను వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తూ 108 అంబులెన్స్ సేవలు సమాజానికి ప్రాణాధారంగా నిసుస్తున్నాయని అన్నారు.పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రమాదాలు,గుండె పోటు,మెదడు సంబంధిత వ్యాధులు,గర్భిణీ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి అనేక ప్రణాలను కాపాడుతున్నట్లు వెల్లడించారు.సంఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించి బాధితులను స్థిరపరిచి సమీప ఆసుపత్రులకు తరలించడం ద్వారా అత్యవసర వైద్య సిబ్బంది కీలక ప్రాత పోషిస్తున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రమాదాలు జరిగిన వెంటనే సమయానికి చికిత్స అందించడం వల్ల అనేక ప్రాణాలు రక్షించబడుతున్నాయని తెలిపారు.జిల్లాలో గత ఒక సంవత్సరంలో మొత్తం 31,977 అత్యవసర ఘటనలకు 108 అంబులెన్స్ సేవలు అందించాయని 108 ఎయంటీ లక్ష్మణ్ తెలిపారు.ప్రమాద బాధితులు గర్భిణీలు,గండె,ఇతర అత్యవసర వ్యాధులతో బాధపడుతున్న వారికి సమయాకూలంగా వైద్య సహాయం అందించడంతో వేలాది మంది లబ్ధి పొందినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మంట్లాడుతూ,అత్యవసర చికిత్స అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ప్రజల అత్యవసర పరిస్థితులో ఆలస్యం చేయకంపడా వెంటనే 108 సేవలను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో నిర్వాహక అధికారి జనార్ధన్ మాట్లాడుతూ,జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు అత్యంత ప్రాణాధారంగా నిలుస్తున్నాయని అన్నారు.అత్యవసర వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ అనేక ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు.అత్యవసర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా డిఎంహెచ్ఓ రాజేందర్,డిసిహెచ్ డా.కాశినాథ్, డా.విజయనంద్,డా.అనిల్,డా.కైలాస్,108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ఆరోగ్య సమస్యలతో జీవితంపై మనస్థాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మొర్రి ప్రణవి (22) అనే డిగ్రీ విద్యార్థిని ఊరేసుకుని మృతి చెందినట్లు ఎస్పై తెలిపారు. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తం డ్రి రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలన

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని భోసి, బామ్ని,మహాలింగి,గ్రామాలలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న పంట తీ వ్రంగా దెబ్బతిన్నది,శుక్రవారం ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కిరణ్ కోమ్రే క్షేత్రస్థాయిలో పర్యటించి,నష్టపోయిన పంటలను పరిశీలించారు.అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సర్వే చేపట్టి ,బాధిత రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/రామాయంపేట:** కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేట పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ యూత్ కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రాబోయెది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు ఎవరు అదైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షంగా ఉన్న మనం తప్పనిసరిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. చౌదరి సుప్రబాత్‌రావు మాట్లాడుతూ యూత్ నాయకులు, కార్యకర్తలు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని మీవెంట మేము ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు చౌదరి చరిత, ప్రవీణ్‌తో పాటు నాయకులు ఉమా మహేశ్వర్, హస్నోద్దీన్, రాజుయాదవ్, దోమకొండ శ్రీనివాస్, పొల క్రం నాగార్జున బసన్నపల్లి శ్రీనివాస్, అల్లాడి వెంకటి, యూత్ అధ్యక్షులు రొయ్యల నవీన్‌కుమార్, ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్, కన్వీనర్ డాకి బునిత్, కోశాదికారి సందీప్‌గౌడ్, ఎరుపుల పవన్, పుట్టి శేఖర్, మెక్కొండ వంశీసాగర్, దేవుని మహేష్, బొట్ల సామెల్, ఊర నరేష్, పల్లె రాజుయాదవ్, బత్తుల వంశీయాదవ్, మర్కు కిరణ్‌సాగర్‌తో పాటు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడుగా రొయ్యల నవీన్‌కుమార్

రామాయంపేట పట్టణ బిఆర్ఎస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రొయ్యల నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎరుపుల పవన్, పుట్టి శేఖర్, మెక్కొండ వంశీ, దేవుని మహేష్, ప్రదాన కార్యదర్శిగా రాచూరి శ్రీనివాస్, కోశాదికారిగా కన్నాపురం సందీప్ గౌడ్, కన్వీనర్‌గా దాకి బునీత్, కార్యదర్శులుగా గుండెపు చందు, మాందాపురం నరేష్, రొయ్యల శివ, సమీర్, మర్కు స్వరాజ్, సంజయ్, ఎర్రం నువాన్, ఎర్రం మదు, పల్లె రాజు యాదవ్, దోమకొండ ప్రశాంత్‌సాగర్, సం యుక్త కార్యదర్శులుగా మర్కు కిరణ్‌సాగర్, మెట్టు గణేష్, దోమకొండ బాను, ప్రకాష్, బానోత్ మంగ్యాతో పాటు కార్యవర్గ సభ్యులుగా పెంటాజి, మర్కు శ్రీదర్, నరేష్, బాస్కర్, లింగోల్ల చందు, శేఖర్, సార్గు స్వామి, పొన్నమైన శంకర్, జాల్ల సాగర్,సాయితో పాటు ఎన్నికయ్యారు.

## ప్రభుత్వ జనరల్.. ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

ఫైర్ సిబ్బంది స్పందించడంతో తప్పిన ఆస్తి నష్టం

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం వాటిల్లింది. సకాలంలో రెండు ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది కృషి వల్ల భారీ ఆస్తి నష్టం కాకుండా కాపాడగలిగారు. అగ్నిమాపక అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం మొదటి అంతస్తులో పేషెంట్ అటెండ్ అయిన ఓ వ్యక్తి బీడీ కాల్చి పడవేయడంతో స్మోక్ పైప్‌కు నిప్పంటుకొని దట్టమైన పొగా వ్యాపిoచింది. అది ఆరో ఫ్లోర్ వరకు వెళ్లింది. భారీ పొగను, గమనించిన వైద్యులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

### తృటిలో తప్పిన భారీ ఆస్తినష్టం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆరో అంతస్తులో పెద్ద మొత్తంలో వైద్య పరికరాలను భద్రపరచడం జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో పొ గలు ఆరో అంతస్తుకు వ్యాపించినా సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పడంతోభారీ ఆస్తి నష్టాన్ని నివారించగలిగారు. ఈ విషయమై ఆసుపత్రి ఉన్నతాధికార వర్గాలు గుడ్ ఫ్రైడే సెలవు దినం కావడంతో ఎవరు అందుబాటులోకి రాలేదు. 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతిని ఈ విషయమై సంప్రదించగా ఆసుపత్రి వర్గాల నుండి ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.



'సత్య ఈజ్ నాట్ జెట్లీ' డ్యాన్స్‌తో అలరించిన సత్య. టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ) హేమలత పెద్దామల్లు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తోంది.

రీల్

# రెగ్యులర్ షూటింగ్‌లో 'రౌడీ జనార్ధన'

స్టార్ హీరో విజయ్ దేవరకొండ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నటిస్తున్న క్రేజీ మూవీ 'రౌడీ జనార్ధన'. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రౌడీ జనార్ధన' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. ఈ సినిమాకు బ్యూటిఫుల్, ఇంపాక్ట్ ఫుల్ విజువల్స్ అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఆనంద్ సి చంద్రన్. ప్రేమమ్, హెలెన్, భీష్మపర్వం, ఆనందం, గోల్డ్, ఛతా పచ్చ వంటి ఎన్నో చిత్రాలకు క్రియేటివ్ విజువల్స్ అందించి మాస్టర్ ఆఫ్ విజువల్ పొయెట్రీగా పేరు తెచ్చుకున్నారు ఆనంద్ సి చంద్రన్. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ 'రౌడీ జనార్ధన' మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ సినిమాను సిల్వర్ స్క్రీన్‌పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ నటిస్తున్నారు.



# 'డెకాయిట్' సెన్సార్ పూర్తి

అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగడ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్‌లు, గ్లింప్స్, టీజర్, అలాగే 'రుబారు' చిచ్చుబుడ్డి పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి.



ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందుతున్న ఈ చిత్రం తాజాగా రెండు భాషల్లో సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అద్భుతంగా వుందని సెన్సార్ సభ్యులు మూవీ టీమ్‌ని అభినందించారు. అడివి శేష్ 'డెకాయిట్'తో డబుల్ హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహనిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రానికి భీమ్స్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందించారు. ధనుష్ భాస్కర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జ్ఞాని నేపథ్య సంగీతం సమకూర్చారు.

# గాయపడ్డ సింహంలో 'బ్రైడ్ సాంగ్'

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్కర్స్, పిఅవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్, విభిన్నమైన ప్రమోషనల్ సాంగ్ ప్రాజెక్ట్ అంచనాలను పెంచాయి. సెకండ్ సింగిల్ 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ఈ లేటెస్ట్ సింగిల్‌ను ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ను ఫ్రెష్‌గా, ఫన్‌తో నింపేలా రూపొందించారు. పెళ్లి ముందు ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న వధువు భావాలను అందంగా ప్రజెంట్ చేస్తోంది. సాధారణంగా కనిపించే సింపుల్ ప్రెజెంటేషన్‌కు భిన్నంగా, ఈ పాటలో వధువును బోల్డ్‌గా, స్టైలిష్‌గా, ఫుల్ ఆఫ్ లైఫ్‌గా చూపించారు. సంగీత దర్శకుడు స్వీకర్ ట్రెండీ బీట్స్‌తో పాటు ఫెస్టివ్ ఫ్లేవర్‌ను అద్భుతంగా మేళవించారు. ఆయన పాడిన ఇంగ్లీష్ పార్ట్స్, శ్రీమణి రాసిన ఎనర్జిటిక్ తెలుగు లైన్స్ కలిసి ఈ పాటకు కూల్, కాంటెంపరరీ టచ్‌ను ఇచ్చాయి. ఈ లిరిక్స్‌లో నేటి వెడ్డింగ్ హంగామా, సెల్ఫీలు, రీల్స్, గ్లామ్ టచెస్, వైరల్ అవ్వాలనే ఎగ్జైట్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తాయి. ఈ చిత్రానికి విద్యా సాగర్ చింతా సినిమాటోగ్రఫీ, విప్లవ్ నైషదం ఎడిటింగ్‌ను, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైన్, సూర్య ప్రకాష్ జోస్యుల కథను అందిస్తున్నారు. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: కాశ్యప్ శ్రీనివాస్, సమర్పణ: పవన్ సాదినేని, ఎడిటర్: విప్లవ్ నిషాదం, కథ: సూర్య ప్రకాష్ జోస్యుల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శ్రీని జోస్యుల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పెన్మత్స అజయ్ వర్మ.



# 'కింగ్ బుద్ధ' టైటిల్ సాంగ్ రిలీజ్

కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్ సినిమా టైటిల్ పాటను శ్రీలంక బుద్ధిజం రిలీజియన్స్ శాఖ మంత్రి డాక్టర్ సునీల్ సేనేవి లాంచ్ చేశారు. ఇరాన్ ఇజ్రాయిల్, ఉక్రెయిన్ రష్యాతో పాటు 50 దేశాల్లో జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని 'కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్' అనే సినిమాను సత్యారెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని అమెరికాలో ప్రారంభించి థాయిలాండ్, మలేషియా, వియత్నాం, కాంబోడియా, లావోస్, ఇండోనేషియా లాంటి బుద్ధిస్ట్ దేశాల్లో షూటింగ్ జరిపామని ఈ సందర్భంగా సత్యారెడ్డి చెప్పారు. . త్వరలో శ్రీలంక దేశంలో షూటింగ్ జరుపుకోవడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రపంచ చరిత్రలో ఇన్ని బౌద్ధ దేశాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఏకైక చిత్రంగా కింగ్ బుద్ధ నిలిచిపోతుందని ఆయన అన్నారు. అను బాంబు దాడులకు గురైన హీరోషిమా నాగసాకి ఇప్పటికీ కోలుకోలేదని ఆయన గుర్తు చేశారు. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలన్న, ప్రపంచం శాంతి మార్గంలో నడవాలన్నా ప్రపంచానికి బుద్ధిజమే ఏకైక మార్గం అని ఆయన అన్నారు. ప్రముఖ రచయిత విబూత్ ఈ చిత్రానికి పని చేస్తున్నారు.



# 'కటాలన్'కు రవి బస్రూర్ మ్యూజిక్





కెజిఎఫ్, మార్కో వంటి సినిమాలతో దక్షిణ భారతంలో సంచలనంగా మారిన రవి బస్రూర్, మరోసారి తన సంగీతంతో మ్యూజికల్ సంచలనం సృష్టించడానికి రెడీ అయ్యారు. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'కటాలన్' కోసం ఆయనను సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. ముందుగా ఈ చిత్రానికి బి.అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తారని వార్తలు వచ్చాయి, కానీ ఇప్పుడు అధికారికంగా రవి బస్రూర్ ఈ బాధ్యతలు చేపట్టినట్లు ప్రకటించారు.

పాన్‌ఇండియా స్థాయిలో ప్లాన్ చేసిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. మలయాళ సినీ చరిత్రలోనే అతిపెద్ద విడుదలల్లో ఒకటిగా ఇది నిలవనుందని భావిస్తున్నారు. ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నారు. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి మార్కో తర్వాత వస్తున్న ఈ చిత్రంలో హీరోగా ఆంటోని వర్గీస్ నటిస్తున్నారు. కెజిఎఫ్ 1, కెజిఎఫ్ 2, సలార్, మార్కో వంటి సినిమాల్లో తన పవర్‌ఫుల్‌సాంగ్స్, బ్యాగ్రౌండ్ స్కోర్‌తో గుర్తింపు పొందిన రవి బస్రూర్, మళ్లీ మలయాళంలోకి వస్తూ థియేటర్లలో ఉత్కంఠభరితమైన అనుభవాన్ని ఇవ్వబోతున్నారు. భారీ యాక్షన్‌తో పాటు ఆయన ప్రత్యేకమైన సంగీతం కటాలన్‌పై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం పూర్తి స్థాయి మాస్ యాక్షన్ థ్రిల్లర్గా రూపుదిద్దుకుంటోంది. కటాలన్ మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ జుమాన్ షెరీఫ్, సినిమాటోగ్రఫీ రెనదివ్, ఎడిటింగ్ షమీర్ మహమ్మద్, స్టంట్స్ కేచా ఖంఫక్డీ, యాక్షన్ సంతోష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ దీపిల్ దేవ్, సాహిత్యం సుహైల్ కోయా

# 'సైరాభాను' షూటింగ్ షురూ

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న సైరాభాను సినిమా షూటింగ్ ప్రారంభమైంది. బంధవి హీరోయిన్ గా పరిచయమవుతున్న ఈ సినిమాకు ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన ప్రారంభోత్సవంలో హీరో కిరణ్ సబ్బవరం హీరో హీరోయిన్లపై క్లాప్ కొట్టారు. కోనవెంకట్ , సాయికుమార్ తదితరులు కల్సి దర్శకుడికి స్క్రిప్ట్ అందించారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం అవుతుందని నిర్మాత రాజేష్ దండ తెలిపారు. వైవిధ్యమైన ప్రేమకథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని అన్నారు. హిందూ, ముస్లిం మధ్య జరిగే ఒక స్వచ్ఛమైన ప్రేమకథగా ఉంటుందని దర్శకుడు ఫణి అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ రామ్ రెడ్డి, సంగీతం శేఖర్ చంద్ర, ఎడిటర్ చోట కె ప్రసాద్ పని చేస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



# హైకోర్టు 'ఫీజుల' తీర్పుపై అప్పీల్ చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్ర భుత్వం అప్పీల్ చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు 14లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నుంచి పీజులు వసూలు చేయొద్దని ప్రభుత్వ పాలసీ, సుప్రీంకోర్టు తీర్పు ఉన్నాయని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడం, అడ్వకేట్ జనరల్ అసమర్థత వల్లనే హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పును అడ్డుపెట్టి ఫీజుల స్కీమును ఎత్తేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. బిసి, ఎ స్సి, ఎస్‌టి విద్యార్థుల చదువుకుంటుంటే అగ్రకుల పాలకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని కో రారు. ప్రభుత్వం మెడలు వంచైనా ఫీజు బకాయిలు విడుదలయ్యేలా చూస్తామన్నారు. వెంటనే రూ.6వేల కోట్లు ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ పాలనను స్థంభింపజేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో సంఘం నేతలు సి.రాజేందర్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై

# విజిలెన్స్ దాడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ ఇసుక రవాణాపై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధి శంషాబాద్, నారాయణపేట గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక స్మగ్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలను గుర్తించారు. ఈ సందర్భంగా సుమారు 100 మెట్రిక్ టన్నుల ఇసుకతో కూడిన ట్రక్కులను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను విచారించి, సంబంధిత పత్రాలు సరిచూసిన తరువాత కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం కలిగిస్తున్న అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు కొనసాగిస్తామని, ప్రజలు అక్రమ ఇసుక రవాణా గురించి సమాచారం అందించాలని కోరారు.



# హైకోర్టు తీర్పు పేదలకు వ్యతిరేకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకా యిలపైన హైకోర్టు ఇచ్చిన తీర్పు పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉన్నదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి,క్ష,కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ అన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్ట్ డెడ్‌లైన్ విధించాలని కోరారు. విద్యార్థుల నుంచి ముందుగా ఫీజులను వసూలు చేసుకోవాలని, ప్ర భుత్వం నుంచి ఫీజు బకాయిలు వచ్చిన తర్వాత వాటిని తిరిగి విద్యార్థులకు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని, ఈ తీర్పును హైకోర్టు పునరాలోచించాలని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంపైన ఆధారపడ్డారని వివరించారు. విద్య సంవత్సరం పూర్తయిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం యాజమాన్యాల వద్దకు వెళ్తే, వారు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నారని, తద్వారా లక్షలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఆ సర్టిఫికెట్లు తీసుకోకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా తీర్పు వెలువడిన నేపథ్యంలో వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ఏకకాలంలో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రాజకీయ లబ్ధి కోసమే

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యునికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేశ్ చెప్పారు. ప్రస్తుత వ్యత్యాసాలు, సాపేక్ష బలాలలో ఎలాంటి భంగం కలగాలని తాము కోరుకోవడం లేదని జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. 'నారీ శక్తి వందన్ అధినియం2023' ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వం 30నెలల పాటు నిద్రావస్థలో ఉన్నదని, ఎన్నికల సమయంలో 'ద్వంద్వ క్రెడిట్'ను సాధించిందని జైరామ్ రమేశ్ విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజనపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారికి సమాచారంగానీ, ప్రతిపాదన గానీ రాలేదని ఆయన చెప్పారు. అయితే, లోక్‌సభ సీట్లలో దామాషా ప్రకారం పెరుగుదల ఉంటుందని మాకు అనధికారికంగా తెలిసిందని జైరామ్ రమేశ్ శుక్రవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇది అనుపాతంగా ఉంటుందనేది వాదన అయినప్పటికీ వాస్తవానికి చిన్న రాష్ట్రాలు, అలాగే దక్షిణ, ఈశాన్య, పశ్చిమ ప్రాంతాల్లోని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన చెప్పారు.ప్రతిపాదిత బిల్లుతో ఉత్తర్‌ప్రదేశ్ బలం 120కి దూసుకెళుతుండగా, కేరళ గరిష్ఠంగా 40కి చేరుకుంటుందని జైరామ్ రమేశ్ వివరించారు. 'అనధికారికంగా మాకు అందిన సమాచారం ప్రకారం ఇది చాలా రాష్ట్రాలకు చాలా ప్రమాదకరం' అని ఆయన వివరించారు. ఈ ప్రత్యే క సమావేశం ఏకైక లక్ష్యం రాజకీయాలను చేజిక్కించుకోవడమేనని, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల ఎన్నికలను ప్రభావితం చేయడానికి ఇది ఒక అవకాశమన్నారు. 15 రోజులు పూర్తి అయిన తర్వాత ఈ ప్రకటన చేయలేకపోయారా? అని జైరామ్ రమేశ్ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సీనియర్ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం ఏర్పాటుచేసి అనంతరం సమావేశం నిర్వహిస్తారు.

# ఈగల్ టీం సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 591/2026 కింద ఎన్‌డిపిఎస్ చట్టంలోని సెక్షన్లు 8(సి), 27(ఎ), 27(బి) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ పార్టీకి హాజరైన విదేశీ డీజే అలెగ్జాండర్ (స్పెయిన్), క్వాక్ ఏరీనా డీజే కెవిపై నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి డ్రగ్స్ వినియోగం గుర్తించలేదని పోలీసులు తెలిపారు. ఈ ఈవెంట్‌లో మొత్తం 1500 మంది హాజరైనట్లు ఈగల్ టీమ్ వెల్లడించారు. యువత డ్రగ్స్ మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని ఈగల్ ఫోర్స్ విజ్ఞప్తి చేసింది. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 8712671111 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1908కు తెలియజేయాలని సూచించింది. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం కలిసి పనిచేద్దాం అని పోలీసులు పిలుపునిచ్చారుపిలుపునిచ్చారు.

# దొడ్డి కొమురయ్య పోరాట పటిమ యువతకు ఆదర్శం

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య పోరాట పటిమ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. వచ్చే జయంతి నాటికి ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తానని, ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. శుక్రవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొము రయ్య చిత్రపటానికి బీర్ల అయిలయ్య, హర్యాన మాజీ గవర్నర్ బం డారు దత్తాత్రేయ,బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, దొడ్డి కొమురయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ కమలాకర్ తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ జన గామ జిల్లాకు, అక్కడి నిర్మించనున్న విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టేలా కృషిచేస్తానన్నారు. కోకాపేటలోని కురుమ భవనం స్థలాన్ని కొంత భాగాన్ని కుల అభివృద్ధి నిమిత్తం ఓ స్కూల్‌కు లీజుకిస్తే దానిపై అవాస్తవాలు కక్కడం సరికాదన్నారు. కురుమ పిల్లల చదువుకు ఉపయోగపడుతుందనే ఈ నిర్ణయం తీసుకొ న్నామని స్పష్టంచేశారు. ఎవ. దత్తాత్రేయ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని అప్పుడే రాజకీయంగా, ఉన్నత రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బిసి కమిషనర్ బాల మాయదేవి, ప్రొఫెసర్ రాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి,డా.ఎలెందర్, బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.





# ఖాళీగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఆ పార్టీ ఓడిపోతుందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె జర్నలిస్టులతో గురువారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తమ ప్రథమ శత్రువు కాంగ్రెస్ అని అన్నారు. తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయంపైన ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. పార్టీ ఆవిర్భావ వేదికపైన తమ ఎజెండాను చెబుతామని, ఈ వేదికపైన తమ పార్టీ నాయకులతో పాటుగా ఉద్యమకారులు కూడా ఉండే అవకాశం ఉందన్నారు. పార్టీ ఆవిర్భావ సభకు ముందు, ఆ తర్వాత కూడా రాజకీయ నాయకుల చేరికలు ఉంటాయన్నారు. గోవాలో 25 వేల మందికి ఒక ఎంఎల్‌ఎ ఉంటే, తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల మందికి ఒక ఎంఎల్‌ఎ ఉన్నారని ఆమె చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సీట్లలో 50 శాతం సీట్ల పెంపు ఎలా సహేతుకమని ఆమె ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాలను పెంచాలని?,ఆర్థిక క్రమశిక్షణ పాటించే రాష్ట్రాలకూ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో ప్రాధాన్యత ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.

**ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి: కవిత..**

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఒకేసారి 30 శాతం నుంచి 40 శాతం ఫీజులను పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, దీనిని సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావడంలో విఫలమైందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఆరోపించారని, ఇప్పుడు ఆయనే సిఎంగా ఉండి ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఏడు శాతం నుంచి ఎనిమిది శాతం మాత్రమే ఫీజులను పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ ఏర్పాటుతో తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగు తోందని, ఆ కాలేజీల యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

# కార్యాలయంలో ఎసిబి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఎసిబి గుర్తించింది. అలాగే 204 రిజిస్టర్ అయిన పత్రాలు అందించకుండా కార్యాలయంలోనే ఉన్నట్లు బయటపడింది.ఇదే సమయంలో సబ్‌రిజిస్ట్రార్ అధికారుల ఇళ్లలో కూడా ఏసీబీ సోదాలు నిర్వహించగా రూ.24,61,540 నగదు, 819.5 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి ఆభరణాలు, కపిల్ చిట్స్‌లో రూ.30.10 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో మరికొన్ని అక్రమాలు కూడా బయట పడినట్లు ఏసీబీ వెల్లడించింది. పూర్తి వివరాలతో నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.అవినీతి కేసులపై సమాచారం ఉంటే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎసిబి విజ్ఞప్తి చేసింది.

**ఎసిబి తనిఖీల్లో విస్తుపోయే నిజాలు**

కాగా హనుమకొండలోని వడ్డెపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు గురువారం జరిపిన సోదాల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఏ డాక్యుమెంట్‌కు ఎంత లంచం ఇవ్వాలనే విషయం సబ్ రిజిస్ట్రార్లు తమ వాట్సాప్ ద్వారా డాక్యుమెంట్ రైటర్లతో జరిపిన చాటింగ్‌లో బయటపడింది. అంతేకాకుండా గడిచిన ఏడాది కాలంలో ఏజెంట్ల ద్వారా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు రామ్ నర్సింహారావు, ఆనంద్ సుమారు రూ. 42,03,125 లావాదేవీలు నడిపినట్లు అధికారులు గుర్తించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com